www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 17-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 182 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి సా. 4.56 తదుపరి పాడ్యమి; నక్షత్రం: రేవతి సా. 4.20; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 10.04-10.50, మ. 2.42-3.29; అమృతఘడియలు: మ. 2.13-3.37; రాహుకాలం: ఉ. 1.30-3.00; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 5.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సుప్రీంకోర్టులో న్యాయదేవత కొత్త విగ్రహం!



చట్టం గుడ్డిది కాదన్న సందేశాన్నిచ్చేలా

కళ్లకు గంతల తొలగింపు

చేతిలో ఖడ్గం స్థానంలో రాజ్యాంగం

2



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 3 శాతం పెంపు

ఆరు రబీ పంటల కనీస మద్దతు ధర కూడా

గోధుమలకు క్వింటాకు అదనంగా రూ.150

కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

సూపర్ సిక్స్

గేమ్ చేంజర్లుగా కొత్త పాలసీలు

ఇకపై థింక్ గ్లోబల్.. యాక్ట్ గ్లోబల్

ప్రతి ఇంట్లోనూ ఒక వ్యాపారవేత్త

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన

అమరావతే ఏకైక రాజధాని

ఆర్థిక రాజధానిగా విశాఖ

కర్నూలులో హైకోర్టు బెంచ్

ఇక ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు

రాజధానిలో టాటా ఇన్నోవేషన్ హబ్

విశాఖ రాజమండ్రి, తిరుపతి, విజయవాడ/గుంటూరు, అనంతలో జోన్లు

కేబినెట్‌లో కీలక నిర్ణయాలు.. మీడియాకు వెల్లడించిన సీఎం చంద్రబాబు



కేబినెట్ భేటీలో చంద్రబాబు, మంత్రులు

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచీ ఒక వ్యాపారవేత్త తయారయ్యేలా, ఐదేళ్లలో యువతకు ఇరవై లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆరు పాలసీలను రూపొందించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించిన ఆరు పాలసీలు గేమ్ చేంజర్లుగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు. పారిశ్రామికవేత్తలకు మళ్లీ నమ్మకం కుదిరేందుకుగాను అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. అమరావతే ఏకైక రాజధానిగా ఉంటుందని పునరుద్ఘాటించారు. విశాఖ ఆర్థిక రాజధానిగా ఉంటుందని, కర్నూలుకు హైకోర్టు బెంచ్ వస్తుందని తెలిపారు. బుధవారం మంత్రివర్గ సమావేశం అనంతరం వెలగపూడి సచివాలయంలో మంత్రులు కొలుసు పార్థసారథి, కొండపల్లి

మిగతా 13వ పేజీలో...

పాలసీల సత్తా..

ఎలక్ట్రానిక్ పాలసీ: 84 వేల కోట్ల పెట్టుబడులు.. 5 లక్షల ఉద్యోగాలు

క్లీన్ ఎనర్జీ: రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు.. 7.5 లక్షల ఉద్యోగాలు

ఫుడ్ ప్రాసెసింగ్: 30 వేల కోట్ల పెట్టుబడులు.. 3 లక్షల ఉద్యోగాలు

పారిశ్రామిక పార్కులు: పార్కులకు 5 కిలోమీటర్ల పరిధిలో ఉద్యోగులకు నివాసాలు, హాస్టళ్లు

ఎంఎస్‌ఎంఈ అండ్ ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్: 5 లక్షల ఉద్యోగాలు

ఇండస్ట్రియల్ పాలసీ: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ పారిశ్రామికవేత్తలకు 5 శాతం రాయితీ

సొంతానికి ఉచితంగా ఇసుక

వాగులు, వంకల్లో ఎవరైనా, ఎక్కడైనా తవ్వి తరలించుకోవచ్చు

సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి

ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉచితంగా సౌర విద్యుత్

రౌడీషీట్ల తరహాలోనే గంజాయి స్మగ్లర్ల షీట్లు

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

ఇసుక రవాణా వాహనాలను అడ్డుకునే పోలీసులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం

రవాణా అధికారులు కూడా ఆపడానికి వీల్లేదు

ప్రజలకు విరివిగా ఇసుక లభ్యం కావాలి

బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్మితే సహించం

పది రోజుల్లో తేడా కనిపించాలి: చంద్రబాబు



సాములోరికే ఎరుక!

విశాఖ శారదా పీఠం భూముల కేటాయింపు రద్దు 'ఫైలు' వెనక్కి

సీఎం ఆదేశాలు అమలు కాని వైనం

జగన్ హయాంలో చౌకగా భూసంతర్పణ

రూ.225 కోట్ల భూమి కేవలం 15 లక్షలకే

రద్దు చేయాలని చంద్రబాబు ఆదేశం

ఫైలు పంపిన రెవెన్యూ శాఖ

రెండు నెలలు కీలక అధికారి వద్దే

ఆ తర్వాత సాంకేతిక కారణాలతో వెనక్కి

తెర వెనుక ఓ కీలక మంత్రి హస్తం!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందపై గతంలో అడపాదడపా ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. జగన్ ముఖ్యమంత్రి కాగానే ఆయన రాజగురువుగా మారిపోయారు. జగన్‌కు, ఆయన సర్కారుకు స్వామీజీ ఎంత చెబితే అంత. రూ.225 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.15 లక్షలకు జగన్ సర్కారు

మిగతా 2వ పేజీలో...

రాయలసీమపై జలఖడ్గం



తిరుపతిలో ఇంట్లోకి చేరిన వర్షపు నీటిని తోడుతున్న దృశ్యం

దూసుకొస్తున్న వాయుగుండం

గుంటూరు వరకూ ప్రభావం.. నేడు చెన్నై సమీపంలో తీరం దాటే చాన్స్

8 జిల్లాలకు ఆకస్మిక వరదల హెచ్చరిక.. ఇప్పటికే విస్తారంగా వర్షాలు

కాకినాడ, గంగవరం, విశాఖలో ఒకటో నంబరు.. దక్షిణ కోస్తా ఓడరేవుల్లో 3వ నంబరు హెచ్చరిక.. నేడూ పలు జిల్లాల్లో భారీ వర్షాలు

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలు జిల్లాలు అతలాకుతలమవుతున్నాయి. వాయుగుండం తీరం దిశగా వస్తున్నందున 8 జిల్లాలకు ఆకస్మిక వరద హెచ్చరిక జారీచేశారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, అక్కడక్కడా కుంభవృష్టి, కడప, ప్రకాశంతోపాటు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున

మిగతా 14వ పేజీలో...

వాన నీటిలోనే చెన్నై శివారు ప్రాంతాలు

4 జిల్లాలకు రెడ్ అలెర్ట్.. కుండపోత వర్షాలు కురిసే అవకాశం

15 అడుగుల ఎత్తుకు ఎగసిపడుతున్న సముద్ర అలలు



14

పోలీసుల అదుపులో బోరుగడ్డ అనిల్

గుంటూరు ఇంట్లోనే అదుపులోకి

జగన్ హయాంలో లెక్కలేనన్ని అరాచకాలు

సభ్య సమాజం తలదించుకునేలా పోస్టులు

జగన్ ఆదేశిస్తే అరగంటలో చంద్రబాబును లేపేస్తానంటూ తీవ్రస్థాయిలో హెచ్చరికలు

15 కేసులు.. 3 కేసుల్లో అరెస్టు పెండింగ్

ప్రభుత్వం మారిన వెంటనే అజ్ఞాతంలోకి



14

సజ్జల రామకృష్ణారెడ్డికి నోటీసులు

నేడు విచారణకు రావాలని ఆదేశం

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నోటీసులిచ్చిన మంగళగిరి పోలీసులు

అధికారముందని పొగరా?

పోలీసులపై చిందులు తొక్కిన సజ్జల

చంద్రబాబు రక్షణకు సీఆర్‌పీఎఫ్

యోగి, రాజ్‌నాథ్ సహా నేతలందరికీ ఇక పారామిలిటరీ రక్షణే

ఎన్‌ఎస్‌జీ సేవలు ఇకపై యాంటీ టెర్రర్ ఆపరేషన్స్‌కే

12

కేంద్ర హోంశాఖ ఆదేశాలు

నెల రోజుల్లో బదలాయింపు పూర్తి



చెత్తలోనూ స్వాహా

గత ప్రభుత్వంలో 'స్వచ్ఛాంధ్ర'లోనూ దోపిడీ

అర్హత లేని 2 సంస్థలకు 570 కోట్ల పనులు.. జగన్ సన్నిహిత మాజీ ఎమ్మెల్యేకు బినామీ

నాటి మున్సిపల్ ఉన్నతాధికారి సహకారం.. ఫోర్జరీ డాక్యుమెంట్లతో టెండర్ల ప్రక్రియకు

ఆస్తులు, బ్యాంకు సాల్వెన్సీలు లేకపోయినా అప్పగింత.. వ్యర్థాల సేకరణలోనూ అక్రమాలు

చెత్త దోపిడీపై విజిలెన్స్ విచారణ షురూ.. 200 కోట్లు దోచుకున్నట్టు ప్రభుత్వానికి ఫిర్యాదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో గనులు, ఇసుక, మద్యం వంటి వాటిని ఆదాయ వనరులుగా మార్చుకున్న వైసీపీ నేతలు చెత్తనూ వదల్లేదు. చెత్త నుంచి సంపదను సృష్టించాలనేది ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నినాదమైతే.. చెత్త నుంచి కూడా సొమ్ములు పిండుకోవాలన్నది నాటి వైసీపీ పాలకుల నైజంగా కనిపించింది. చెత్త కుంభకోణంలో రూ.200 కోట్లు దోచుకున్నట్టు ఫిర్యాదు రావడంతో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. గత ప్రభుత్వంలో రూ.570 కోట్ల విలువైన

మిగతా 12వ పేజీలో...

ఎక్కడి వారు అక్కడికి వెళ్లాల్సిందే!

తెలంగాణ అయితే ఏంటి? ఏపీ అయితే ఏంటి?

ముందు రిపోర్ట్ చేయండి.. తర్వాతే విచారణ

ఐఏఎస్ అధికారులైతే స్టే ఇవ్వాలా?

14

కేంద్రం కేటాయింపుల్లో జోక్యం చేసుకోబోం

ఏడుగురు ఐఏఎస్‌లకు స్పష్టంచేసిన టీ-హైకోర్టు

డీవోపీటీ ఉత్తర్వులపై స్టేకు నో.. పిటిషన్ల కొట్టివేత

IAS

ఏపీ నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ఐదుగురు

రిలీవ్

ఉత్తర్వులిచ్చిన సీఎస్‌లు

తాత్కాలిక డీజీపీలా?

అడ్‌హాక్ డీజీపీల నియామకంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

ఏపీ, తెలంగాణ సహా 8 రాష్ట్రాలకు ధిక్కరణ నోటీసులు

21లోపు వివరణ ఇవ్వాలని సీఎస్‌లు, తాత్కాలిక డీజీపీలకు ఆదేశం

2



పేదరిక భారతం!

దుర్భర పేదరికంలో 12.9 కోట్ల మంది ప్రజలు

ప్రపంచ బ్యాంకు నివేదిక



న్యూఢిల్లీ, అక్టోబరు 16: దేశాన్ని పేదరికం వెంటాడుతూనే ఉంది. తాజాగా 2024- ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం దేశంలో 12.9 కోట్ల మంది ప్రజలు దుర్భర పేదరికంలోనే బతుకీడుస్తున్నారు. వీరి ఆదాయం రోజుకు రూ.181 కన్నా తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. అయితే, 1990లో 43.1 కోట్ల మంది పేదలు ఉండగా వీరి సంఖ్య తగ్గుతూ వచ్చిందని తెలిపింది. 2021 నాటికి 3.8 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. మధ్యస్త ఆదాయ దేశాల్లో రోజుకు రూ.576 సంపాయించేవారిని పేదలుగా పరిగణిస్తూ రూపొందించిన ఈ నివేదికలో భారతదేశ పరిస్థితి దారుణంగా ఉందని తెలిపింది. రోజుకు రూ.576 సంపాయించే వారిని ప్రామాణికంగా తీసుకున్నప్పుడు 1990ల కన్నా భారత్‌లో పేదరికం దారుణంగా ఉందని పేర్కొంది. దీనికి కారణం జనాభా పెరుగుదలేనని వివరించింది. ఇటీవల భారత ప్రభుత్వం విడుదల చేసిన గృహ వినియోగం, వ్యయ సర్వేలో ఈ వివరాలను వెల్లడించలేదని పేర్కొంది. కాగా, ఆఫ్రికా సహా పలు దేశాల్లో 2030 నాటికి దుర్భర పేదరికాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించకపోతే.. ఈ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టసాధ్యమని నివేదిక వెల్లడించింది. పేదరిక నిర్మూలనా చర్యలు ప్రపంచ వ్యాప్తంగా చాలా మందగమనంలో ఉన్నాయని ఆక్షేపించింది. ఈ పరిస్థితి ఇలానే సాగితే మరికొన్ని శతాబ్దాలు పట్టే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ప్రపంచ పేదరికంలో భారత్ వాటా మాత్రం కొన్ని దశాబ్దాలలోనే తగ్గే అవకాశం ఉందని, దీనికి కారణం జీడీపీ వృద్ధి పెరుగుతోందని వివరించింది.

ఆర్థిక అభద్రతలో అతివలు!

200 కోట్ల మందికి ఆర్థిక భద్రత కరువు: ఐరాస



న్యూఢిల్లీ, అక్టోబరు 16: ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళలు ఉపాధి సహా ఆర్థికంగా ఎలాంటి వెసులుబాట్లు లేక ఆర్థిక అభద్రతలో జీవిస్తున్నారని ఐక్యరాజ్యసమితి(ఐరాస) మహిళా నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆఫ్రికా సహా పలు దేశాల్లో ఈ పరిస్థితి ఉందని వివరించింది. సామాజిక భద్రత కల్పించడంలోనూ మహిళలు లింగ వివక్షను ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. సామాజిక భద్రతగా పేర్కొనే నగదు లబ్ధి, నిరుద్యోగ భృతి, పింఛన్లు, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి కల్పన, ఉద్యోగాలు వంటివి కడు దూరంలో ఉన్నాయని పేర్కొంది. గురువారం(అక్టోబరు 17).. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐరాస ఈ నివేదికను విడుదల చేసింది. అభివృద్ధి చెందిన దేశాల్లో 2015 తర్వాత పరిస్థితిలో కొంత మార్పు కనిపించినా.. లింగ సమానత్వం, సామాజిక భద్రతలు మాత్రం లక్ష్యాలను ఇంకా చేరుకోలేదని పేర్కొంది. 25-34 ఏళ్ల వయసున్న మహిళలు.. ఇదే వయసున్న పురుషులతో పోల్చుకుంటే 25 శాతానికి పైగా పేదరికంలోనే ఉంటున్నారని నివేదిక తెలిపింది.

లోకం తీరు



న్యాయదేవత కొత్త అవతారం!

- కళ్లకు గంతలు తొలగింపు..చేతిలో ఖడ్గం బదులు రాజ్యాంగం

న్యూఢిల్లీ, అక్టోబరు 16: సుప్రీంకోర్టులో కొన్ని మార్పులతో కొత్త న్యాయదేవత (లేడీ ఆఫ్ జస్టిస్) విగ్రహం దర్శనమిచ్చింది. చట్టం గుడ్డిది కాదన్న సందేశాన్నిచ్చేలా న్యాయదేవత కళ్లకు కట్టి ఉండే నల్ల రిబ్బన్‌ను తొలగించడంతోపాటు అన్యాయాన్ని శిక్షించడంలో ప్రతీకగా నిలిచే చేతిలోని ఖడ్గం స్థానంలో రాజ్యాంగాన్ని కొత్త విగ్రహంలో చేర్చారు. న్యాయదేవత మరో చేతిలా కనిపించే త్రాసును అలాగే ఉంచారు. సుప్రీంకోర్టులోని న్యాయమూర్తుల గ్రంథాలయంలో ఈ కొత్త విగ్రహం కనిపించింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ ఆదేశాల మేరకు న్యాయదేవత విగ్రహంలో మార్పులు చేసినట్లు సమాచారం.

నేడు చండీగఢ్‌లో ఎన్డీయే సమావేశం

- హాజరుకానున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

న్యూఢిల్లీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్డీఏ అధికార పగ్గాలు చేతపట్టిన తరువాత తొలిసారిగా కూటమి నేతల సదస్సు జరగనుంది. గురువారం చండీగఢ్ వేదికగా ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగే ఈ భేటీకి కూటమి పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు, కమలం కీలక నేతలు హాజరుకానున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, హోం మంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు బీజేపీ, మిత్రపక్షాలకు చెందిన మొత్తం 13 మంది సీఎంలు, 16 మంది డిప్యూటీ సీఎంలు ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో చేపట్టే ముఖ్యమైన బిల్లులు, జమిలి ఎన్నికలు, జనగణన, ఉమ్మడి పౌర స్మృతి మొదలైన కీలక అంశాలపై చర్చించే అవకాశాలు ఉన్నాయి. బీజేపీకి, ఎన్డీఏ పార్టీలకూ మధ్య సమన్వయానికి కమిటీ ఏర్పాటు చేయవచ్చని, కమిటీలో చంద్రబాబుకు కీలక బాధ్యతలు అప్పగించవచ్చని అంటున్నారు. ఇక, చండీగఢ్‌లో సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్, కేంద్ర మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు.

మసీదులో 'జై శ్రీరామ్' అంటే.. మనోభావాలు దెబ్బతీసినట్టు కాదు

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మసీదులో జైశ్రీరామ్ నినాదాలు చేయడం మతపరమైన మనోభావాలకు భంగం కలిగించడం కాదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. మసీదులో జై శ్రీరామ్ నినాదాలు చేశారని దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీన్ని విచారించిన కర్ణాటక హైకోర్టు, మంగళవారం కొట్టివేసింది. 2023 సెప్టెంబరు 24వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో మసీదులోకి ప్రవేశించి జై శ్రీరామ్ నినాదాలు చేయడం వివాదాస్పదమైంది. కాగా, ఆ ప్రాంతంలో హిందువులు, ముస్లింలు సామరస్యంగా జీవిస్తున్నారని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారని, అలాంటప్పుడు జై శ్రీరామ్ నినాదాలతో మతసామరస్యానికి ఎలాంటి ఇబ్బంది తలెత్తిందని విచారణ సందర్భంగా జడ్జి నాగప్రసన్న ప్రశ్నించారు. మతాన్ని అవమానిస్తే సమస్యలు తలెత్తుతాయని, జై శ్రీరామ్ అంటే చట్టాన్ని ఉల్లంఘించినట్టు కాదని స్పష్టం చేశారు.

మార్గదర్శికి వ్యతిరేకంగా ఒక్క అభ్యంతరమూ రాలేదు.. ఏంచేయాలి?

- మాజీ ఎంపీ ఉండవల్లికి తెలంగాణ హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): "పబ్లిక్ నోటీసు జారీ చేసినప్పటికీ మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు వ్యతిరేకంగా ఇప్పటివరకు ఒక్క అభ్యంతరమూ రాలేదు. తర్వాత ఏం చేయాలి?" అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌ను తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. మార్గదర్శి సంస్థ చట్ట వ్యతిరేకంగా డిపాజిట్లు సేకరించిందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. విచారణకు ఉండవల్లి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఆయన వాదనలు వినిపిస్తూ.. ఫార్మాలిటీ కోసమే నోటీసు ఇచ్చారని.. సదరు నోటీసు ప్రజల్లోకి వెళ్లలేదని పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ డిపాజిట్లు సేకరించకుండా నిషేధం ఉందని.. ఈ విషయాన్ని ఆర్బీఐ తన అఫిడవిట్‌లో స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. "అది న్యాయపరమైన ప్రశ్న. దానిని మేం డిసైడ్ చేస్తాం" అని పేర్కొంది. అదికాకుండా ఏంచేయాలో చెప్పండి? అని ప్రశ్నించింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

టపాసుల దుకాణాలను అడ్డుకోలేం: హైకోర్టు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేయకుండా అడ్డుకోలేమని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. జనావాసాలకు దూరంగా యూనివర్సిటీ స్థలంలో ఈ దుకాణాలు ఏర్పాటు చేస్తే తప్పేముందని ప్రశ్నించింది. ఈ నెల 29 నుంచి 31 వరకు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల పిటిషనర్‌కు వచ్చిన నష్టం ఏమిటని ప్రశ్నించింది. విచారణను నవంబరు 1కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

ఈవీల బ్యాటరీలను మార్చుకోవచ్చు: కేంద్రం

హైదరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) చార్జింగ్ అయిపోయినా.. తక్కువ చార్జింగ్ ఉన్నా.. అందులోని బ్యాటరీని మార్చుకోవచ్చు. దాని స్థానంలో పూర్తి చార్జింగ్‌తో ఉన్న బ్యాటరీని చార్జింగ్ స్టేషన్లలో పొందవచ్చు. బ్యాటరీల మార్పిడి, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ కోసం తాజాగా కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను ప్రకటించింది. ఈ విధానంతో గంటల తరబడి చార్జింగ్ స్టేషన్ల వద్ద నిరీక్షించాల్సిన అవసరం లేకుండా.. చార్జింగ్ అయిపోయిన బ్యాటరీలను క్షణాల్లో పొందడానికి అవకాశం కలుగుతుంది. ఇక ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే మెట్రోపాలిటన్ నగరాల్లో కేవలం 3 రోజుల్లోనే అనుమతులివ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. మునిసిపాలిటీల్లో 7 రోజుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల్లో, కొండ ప్రాంతాల్లో 30 రోజుల్లో, సబ్‌స్టేషన్లు, విద్యుత్తు లైన్లు వంటి సదుపాయాలు కల్పించాల్సి ఉంటే 90 రోజుల్లో విద్యుత్ కనెక్షన్ జారీ చేయాలని కేంద్రం స్పష్టం చేసింది.

తాత్కాలిక డీజీపీలను నియమించడమేంటి?

- అడ్‌హాక్ డీజీపీల నియామకంపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- తెలంగాణ, ఏపీ సహా 8 రాష్ట్రాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు

న్యూఢిల్లీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక డీజీపీలను నియమించుకోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమించిన ఎనిమిది రాష్ట్రాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్ రాష్ట్రాలు నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమించాయంటూ హరియాణాకు చెందిన వినోద్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపిస్తూ.. 2006లో దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తూ ఎనిమిది రాష్ట్రాలు అడ్‌హాక్ డీజీపీలను నియమించాయని తెలిపారు. దీంతో ఆ రాష్ట్రాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది.

నిజ్జర్ కేసు దర్యాప్తులో భారత్ సహకరించాలి

- కెనడాను సమర్థించిన అమెరికా, యూకే, ఆస్ట్రేలియా
- అమిత్ షా ఆదేశాలతోనే దాడులు
- 'వాషింగ్టన్ పోస్ట్' కథనం



న్యూఢిల్లీ, అక్టోబరు 16: కెనడాలో చోటుచేసుకున్న హింసాత్మక నేరాలతో భారత అధికారులకు సంబంధం ఉందన్న ఆరోపణలపై అమెరికా, యూకే, ఆస్ట్రేలియా స్పందించాయి. ఇరు దేశాల మధ్య సాగుతున్న దౌత్య వివాదం నేపథ్యంలో కెనడాకు మద్దతుగా నిలిచాయి. నిజ్జర్ హత్య కేసు దర్యాప్తులో తమకు సహకరించాలని కెనడా కోరుతోందని, కానీ భారత్ ఆ మార్గాన్ని ఎంచుకోలేదని అమెరికా విదేశాంగ ప్రతినిధి మాథ్యూ ముల్లర్ మంగళవారం వ్యాఖ్యానించారు. 'ఇంతకు ముందు చెప్పినట్లుగా ఈ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవి. ఈ అంశాన్ని భారత్ సీరియస్‌గా పరిగణించి దర్యాప్తులో కెనడాకు సహకరించాలి. అయితే వారు భిన్నమైన మార్గాన్ని ఎంచుకొన్నారు' అని పేర్కొన్నారు. కాగా, కెనడా ప్రధాని ట్రూడో సోమవారం సాయంత్రం యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. 'భారత్‌పై కెనడా ఆరోపణలకు సంబంధించిన పరిణామాలపై వారిద్దరూ చర్చించారు. చట్టబద్ధమైన పాలన ప్రాధాన్యాన్ని అంగీకరించారు. దర్యాప్తులో సమాచారం ఇచ్చి పుచ్చుకోవాలని నిర్ణయించారు' అని యూకే ప్రధాని కార్యాలయం తెలిపింది. మరోవైపు న్యూజిలాండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి విన్‌స్టన్ పీటర్స్ కూడా కెనడాకు మద్దతు పలికారు. ఒట్టావా లేవనెత్తిన ఆరోపణలు నిజమని తేలితే పరిస్థితి చాలా ఆందోళనకరంగా మారుతుందని హెచ్చరించారు. భారత్, కెనడా దౌత్య వివాదంపై స్పందించడానికి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ నిరాకరించారు. కెనడా ప్రధానితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. అయితే, ఆస్ట్రేలియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ ఎఫైర్స్ అండ్ ట్రేడ్ అధికార ప్రతినిధి మాట్లాడుతూ, అన్ని దేశాల సార్వభౌమాధికారాన్ని, చట్టబద్ధమైన పాలనను గౌరవించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు. కాగా, కెనడాలో ఖలిస్థానీ మద్దతుదారులపై దాడుల వెనుక కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(రా) సీనియర్ అధికారి పాత్ర ఉందని ఆ దేశ అధికారులు ఆరోపించారని పేర్కొంటూ 'వాషింగ్టన్ పోస్టు' తాజాగా ఒక కథనాన్ని ప్రచురించింది. కెనడాలోని భారత దౌత్యవేత్తల మధ్య జరిగిన సంభాషణలు, మెసేజ్‌ల్లో ఈ విషయాన్ని గుర్తించినట్లు వారు భారత ప్రభుత్వానికి సమాచారం అందించారని తెలిపింది. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్‌తో కెనడా భద్రత, విదేశాంగ శాఖ ఉన్నతాధికారులు ఈ నెల 12న సింగపూర్‌లో భేటీ అయ్యారని, ఈ సందర్భంగా నిజ్జర్ హత్య కేసుతో పాటు తమ దేశంలో దాడులకు సంబంధించిన ఆధారాలను అందించారని పేర్కొంది. ఈ కథనంపై భారత విదేశాంగ శాఖ గానీ, కేంద్ర హోంశాఖ గానీ స్పందించలేదు.

తీవ్రంగా పరిగణిస్తున్నాం: భారత్

అమెరికా పౌరుడు గురుపత్వంత్ సింగ్ పన్నూన్ హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణలను తీవ్రంగా పరిగణిస్తున్నామని భారత్ ప్రకటించింది. ఈ అంశంపై చర్చించడానికి భారత్ నియమించిన దర్యాప్తు అధికారుల బృందం అమెరికా న్యాయశాఖ, విదేశాంగ శాఖ అధికారులతో మంగళవారం వాషింగ్టన్‌లో సమావేశమైంది.

భారత్ వ్యతిరేక సమాచారమిచ్చా: పన్నూన్

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కార్యాలయంతో తమ సిఖ్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) సంస్థ టచ్‌లోనే ఉందని, నిజ్జర్ హత్య నేపథ్యంలో భారత్‌కు వ్యతిరేకంగా సమాచారాన్ని వారితో పంచుకున్నట్లు ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ అంగీకరించారు. భారత దౌత్య కార్యాలయానికి చెందిన గూఢచర్య నెట్‌వర్క్ గురించి ట్రూడోకు సమాచారం ఇచ్చానని తెలిపారు. భారత్‌పై చేస్తున్న ఆరోపణలు చట్టబద్ధ పాలన, న్యాయం, జాతీయ భద్రత పట్ల కెనడా నిబద్ధతకు నిదర్శనమని పన్నూన్ అన్నారు.

నిఘా సమాచారమే తప్ప గట్టి ఆధారాల్లేవ్!

నిజ్జార్ హత్య కేసులో భారత్ పాత్రపై విచారణ కమిషన్ ముందు నీళ్లు నమిలిన ట్రూడో

అటావా, అక్టోబరు 16: కేవలం నిఘా వర్గాల సమాచారం ఆధారంగానే ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్య కేసులో భారత ఏజెంట్ల ప్రమేయం ఉందని ఆరోపణలు చేశానని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అంగీకరించారు. ఆ సమయంలో తమ వద్ద కచ్చితమైన ఏ ఆధారాల్లేవని ఒప్పుకొన్నారు. కెనడా వ్యవహారాల్లో విదేశీ జోక్యంపై నిర్వహించిన విచారణ కమిషన్ ముందు హాజరై ఆయన మాట్లాడారు. భారత్‌పై మోపిన ఆరోపణలపై ప్రస్తావిస్తూ.. 'ప్రాథమిక సమాచారం మేరకే నిజ్జర్ హత్య కేసుపై మాట్లాడాను.. స్పష్టమైన సాక్ష్యమేదీ లేదు. ఇదే విషయమై సహకరించాలని భారత్‌ను కెనడా కోరింది. వాళ్ల (భారత్) ఆధారాలు కావాలని కోరారు. అయితే ఆ సమయంలో కెనడా వద్ద నిఘా వర్గాల సమాచారం మాత్రమే ఉంది' అని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని జీ20 సమావేశాల సమయంలో ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. అయితే కెనడాలో భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వారిని అరెస్టు చేయాలని సూచించారన్నారు. ఏదేమైనా జీ20 నుంచి తమ దేశానికి వచ్చాకే తెలిసింది.. కెనడాను విమర్శించే ధోరణిని భారత్ అవలంబిస్తోందని స్పష్టమైందని పేర్కొన్నారు.

పెట్రోల్ ట్యాంకర్ పేలి 147 మంది సజీవదహనం

- నైజీరియాలో ఘటన

అబుజా, అక్టోబరు 16: నైజీరియాలో బోల్తా పడిన పెట్రోల్ ట్యాంకర్ నుంచి ఇంధనం తీస్తుండగా మంటలు చెలరేగి కనీసం 147 మంది సజీవదహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జిగావా రాష్ట్రంలోని మజియా పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కనో రాష్ట్రం నుంచి హైవేపై వెళ్తున్న ట్యాంకర్ బోల్తా పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఒక్క సారిగా పెట్రోల్ కోసం ఎగబడ్డారు. ప్రజలను ట్యాంకర్‌కు దూరంగా ఉండమని హెచ్చరించినప్పటికీ ఎవరూ వినలేదని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో పెట్రోల్ తీసుకుంటుండగా భారీ పేలుడు సంభవించి వంద మందికి పైగా మంటల్లో కాలి బూడిదయ్యారు. కొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ చనిపోయారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడిలో మేయర్ సహా 25 మంది మృతి

బీరూట్, అక్టోబరు 16: లెబనాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి భీకర దాడులు జరిపింది. దక్షిణ లెబనాన్ నెబాతియే ప్రావిన్స్‌లోని కానా పట్టణంతో పాటు బీరూట్ శివారు ప్రాంతాలపై మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో మేయర్ అహ్మద్ కహిల్ సహా 25 మంది మృతి చెందినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, హెజ్‌బొల్లాకు పట్టున్న ప్రాంతాల నుంచి తక్షణమే ఐక్యరాజ్యసమితి దళాలు వైదొలగాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు డిమాండ్ చేశారు. గతేడాది అక్టోబరు నుంచి లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో దాదాపు 2300 మంది ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది.


కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 3 శాతం పెంపు

- ఆరు రబీ పంటల కనీస మద్దతు ధర కూడా..
- గోధుమలకు క్వింటాలుకు అదనంగా రూ.150

న్యూఢిల్లీ, అక్టోబరు 16: కేంద్రం ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక ప్రకటించింది. కరువు భత్యం (డీఏ) 3 శాతం పెంచేందుకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోద ముద్ర వేసింది. ఆరు రబీ పంటల కనీస మద్దతు ధర పెంపునకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తాజా పెంపుతో ఇప్పటివరకు ఉన్న 50 శాతం డీఏ 53 శాతానికి చేరింది. పెంచిన డీఏను ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచే అమలు చేయనున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.9,448 కోట్ల అదనపు భారం పడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. డీఏ పెంపుతో దాదాపు కోటి మంది ఉద్యోగులు, పెన్షనర్లు ప్రయోజనం పొందుతారన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని డీఏను కేంద్రం ఏటా రెండుసార్లు సవరిస్తూ ఉంటుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు మార్చిలో డీఏను 4 శాతం పెంచిన సంగతి తెలిసిందే. ఉత్తరాదిలో ప్రధాన పంట అయిన గోధుమల కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) క్వింటాలుకు రూ.150 పెంచింది. దీంతో రూ.2,275 నుంచి రూ.2,425కు పెరిగింది. అత్యధికంగా ఆవాలకు రూ.300 పెంచారు. దీంతో రూ.5,650 నుంచి 5,950కు పెరిగింది. మసూర్ పప్పునకు రూ.275, ఇతర పప్పు ధాన్యాలకు రూ.210, పొద్దుతిరుగుడుకు రూ.140, బార్లీకి రూ.130 పెంచారు. రైతుల ఆదాయం పెంచేందుకు రబీ పంటల మద్దతు ధర పెంచామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

కశ్మీర్ సీఎంగా ఒమర్ ప్రమాణం

రాహుల్, అఖిలేష్, కారత్, రాజా, కనిమొళి, సుప్రియా సులే హాజరు



శ్రీనగర్, అక్టోబర్ 16: జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం కొలువుతీరింది. శ్రీనగర్‌లోని షెరి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కొత్త సీఎంగా ఒమర్ అబ్దుల్లాతో ప్రమాణం చేయించారు. ఉప ముఖ్యమంత్రిగా జమ్మూకు చెందిన సురిందర్ చౌదరి, మరో నలుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక తదితరులు హాజరయ్యారు. ఇండియా బ్లాక్ తరఫున సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్, సీపీఎం నేత ప్రకాశ్ కారత్, సీపీఐ నేత డి.రాజా, డీఎంకే నాయకురాలు కనిమొళి, ఎన్సీపీ శరద్ పవార్ వర్గం తరఫున సుప్రియా సులే, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ తదితరులు హాజరయ్యారు. నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వానికి బయటనుంచి మద్దతు ఇవ్వాలని నిర్ణయించిన కాంగ్రెస్ కేబినెట్‌లో చేరలేదు. కాంగ్రెస్ మూడు మంత్రిపదవులు ఆశించగా ఒకటి మాత్రమే ఇస్తామని ఒమర్ స్పష్టం చేయడంతో ప్రభుత్వానికి వెలుపలినుంచి మద్దతివ్వాలని కాంగ్రెస్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేశాక ఇటీవల జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ 42 స్థానాల్లో నెగ్గింది. ఎన్సీ కూటమిగా పోటీ చేసిన కాంగ్రెస్ 6 చోట్ల గెలిచింది. ఐదుగురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు, ఒక ఆప్ ఎమ్మెల్యే, ఒక సీపీఎం ఎమ్మెల్యే ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి మద్దతిచ్చారు. దీంతో మొత్తం 55 మంది ఎమ్మెల్యేల బలం ప్రభుత్వానికి ఉంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో 90 నియోజకవర్గాలకు పోటీ జరగ్గా ఐదుగురిని లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేస్తారు. దీంతో సభలో మొత్తం సభ్యుల సంఖ్య 95 కానుంది.

సీఎం పదవి ముళ్ల కిరీటమే

జమ్మూకశ్మీర్ ఎదుట అనేక సవాళ్లున్న ప్రస్తుత తరుణంలో సీఎం పదవి ముళ్ల కిరీటమేనని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, మాజీ సీఎం ఫరూఖ్ అబ్దుల్లా అభిప్రాయపడ్డారు. సీఎంగా తన తనయుడు ఒమర్ అబ్దుల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు దేవుడు అండగా ఉంటాడని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఫరూఖ్ అబ్దుల్లా తండ్రి షేక్ అబ్దుల్లా కూడా జమ్మూకశ్మీర్ సీఎంగా పనిచేశారు. అబ్దుల్లా కుటుంబం నుంచి మూడో తరం సీఎంగా ఒమర్ 2009-2014 మధ్య పనిచేశారు. కాగా, కొత్తగా కొలువుతీరిన నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వంలో ఏకైక మహిళా మంత్రిగా సకీనా ఈటూ ప్రమాణం చేశారు.

డబ్బులు అడిగితే... జగన్ పేరు చెప్తున్నారు!

- టీడీపీ నేతలకు మొర పెట్టుకున్న బాధితులు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన డబ్బులు తిరిగి ఇమ్మంటే.. మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలతో తమకు సాన్నిహిత్యం ఉందంటూ తమను బెదిరిస్తున్నారని బాధితులు వాపోయారు. ఇకపై డబ్బులు అడిగితే చంపేస్తామంటున్నారని వారు టీడీపీ నేతలకు ఏకరవు పెట్టారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. పార్టీ నేతలు కేఎస్ జవహర్, పీలా గోవింద సత్యనారాయణ, స్వామిదాసు వినతులు స్వీకరించారు. పల్లి విజయకుమారి, కొట్టే ఆదిలక్ష్మి అనే బాధితులు వినతి పత్రం.. తాము ఇచ్చిన డబ్బులు ఇవ్వమని అడిగితే.. వేమవరపు వరలక్ష్మి, ఆమె భర్త శ్రీనివాసరావు జగన్ పేరు, వైసీపీ నేతలు సజ్జల, సుచరిత, విడదల రజనీ, నందిగం సురేశ్ పేర్లు చెప్పి, బెదిరిస్తున్నారని వాపోయారు.

18న గ్రీవెన్స్ రద్దు

ఈనెల 18న టీడీఎల్పీ సమావేశం జరగనుంది. ఆ కారణంగా టీడీపీ కార్యాలయంలో జరగాల్సిన ప్రజావేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు.

అతిసార మరణాలపై సీఎం విచారం

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో అతిసార మరణాలపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సీఎంవో అధికారులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. ఒక్కరోజే నలుగురు డయేరియాతో మృతి చెందారన్న సమాచారంపై ప్రస్తుత పరిస్థితిని సీఎం ఆరా తీశారు. ఆ ప్రాంతంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చి, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎంఅధికారులను ఆదేశించారు.

సాములోరికే ఎరుక!

(మొదటి పేజీ తరువాయి)

ధారాదత్తం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ భూ కేటాయింపులను రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ శాఖ ఫైలు పంపి రెండు నెలలు అయినా అతీగతీ లేదు. సీఎం ఆమోదం కోసం వెళ్లకుండానే వెనక్కి వచ్చేసింది. ఏం జరిగిందో ఆ సాములోరికే తెలియాలి. ప్రభుత్వంలో మరెవరినో పట్టుకొని మంత్రాంగం నడిపారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో ఓ కీలక మంత్రి ప్రమేయం ఉందన్న చర్చ జరుగుతోంది.

సాములోరికి 225 కోట్ల లబ్ధి

విశాఖ జిల్లాలో భీమిలి సముద్ర తీరాన ఉంది. అక్కడ వేదిక్ పాఠశాల, ఇతర ఆధ్యాత్మిక కార్యకలాపాల ఏర్పాటు కోసం 15 ఎకరాలు కేటాయించాలని 2021లో జగన్ సర్కారును శారదాపీఠం కోరింది. వెంటనే రెవెన్యూ శాఖ విశాఖ కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు తెప్పించుకుంది. శారదాపీఠం కోరుతున్న భూమి భీమిలి మండలం కొత్తవలస కొండపై ఉందని, అక్కడ ఎకరం రిజిస్ట్రేషన్ విలువ 1.89 కోట్లు ఉందని, ఆ మేరకు భూమిని కేటాయించవచ్చని ప్రభుత్వానికి కలెక్టర్ నివేదించారు. నాటి ముఖ్యమంత్రికి శారదాపీఠాధిపతి రాజగురువు కావడంతో రెవెన్యూ శాఖ స్వామిభక్తిని ప్రదర్శించింది. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీఎల్ఎంఏ)లో భూ కేటాయింపును ఖరారు చేసింది. కలెక్టర్ ప్రతిపాదించినట్టు కాకుండా, ఏకరం లక్షకే ఇవ్వాలని సిఫారసు చేసింది. అంతే.. శారదాపీఠానికి 15 ఎకరాల భూమిని కేటాయిస్తూ 2021 నవంబరు 29న రెవెన్యూ శాఖ ఉత్తర్వులు (జీఓ 343) జారీ చేసింది. శారదాపీఠానికి కేటాయించిన భూమి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.15 కోట్లు. ఆనాడు కలెక్టర్ కనీసం ఎకరాకు 1.89 కోట్లు వసూలు చేయాలని రెవెన్యూ శాఖకు సిఫారసు చేశారు. దీని ప్రకారం పీఠం నుంచి 28.35 కోట్లు వసూలు చేయాలి. జగన్ సర్కారు అందుకు భిన్నంగా ఎకరా లక్ష రూపాయల చొప్పున కట్టబెట్టింది. అంటే.. రూ.225 కోట్ల విలువైన భూమిని రూ.15 లక్షలకే ధారాదత్తం చేసింది.

తప్పు మీద తప్పులు

శారదాపీఠానికి భూ కేటాయింపులోనే పెద్ద మతలబు ఉంది. ప్రతిపాదన వచ్చింది శారదాపీఠం తరపున. భూ కేటాయింపు చేయాల్సింది ఆ సంస్థ పేరిట. కానీ రెవెన్యూ శాఖ స్వామి భక్తిలో మునిగి శారదాపీఠం ఉత్తరాధికారి పేరిట భూ కేటాయింపు ఉత్తర్వులు జారీ చేసింది. ఇది నిబంధనలకు విరుద్ధం. పైగా దీనికి నాటి మంత్రివర్గ ఆమోదం కూడా లేదు. ఇందులో మరో ఉల్లంఘన ఉంది. సర్వే నంబర్‌లు కూడా మార్చారని తెలిసింది. ఇలా సర్వే నంబర్ మార్చాలంటే మళ్లీ ఫైలు కలెక్టర్ నుంచి మొదలవ్వాలి. ఎల్ఎంఏలో ఆమోదం పొందాలి. మంత్రివర్గం ఆమోదించాలి. ఇలాంటివేవీ లేకుండా అప్పటి రెవెన్యూ కార్యదర్శి సైలెంట్‌గా అన్నీ మార్చేశారు. 2022 ఫిబ్రవరి 8న గుట్టుగా జీఓ-64 జారీ చేశారు. స్వరూపానంద తొలుత ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల కోసం కారు చౌకగా భూమిని తీసుకున్నారు. ఆ తర్వాత మనసు మార్చుకొని ఆదాయం పెంపొందించుకునేందుకు భూమిని వినియోగించుకుంటానని, అందుకు అనుమతి ఇవ్వాలని మరో కోరిక కోరారు. అంతే.. రెవెన్యూ శాఖ క్షణాల్లో సాములోరికి జై అన్నది. పీఠం కోరిక మేరకు ఆదాయం పెంచుకునేందుకు భూమిని వినియోగించుకునేలా రెవెన్యూ శాఖ ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన ఉత్తర్వులు (జీఓ-47)ను జారీ చేసింది. దీనికి కూడా మంత్రివర్గ ఆమోదం లేదు.

చంద్రబాబు ఆదేశించినా...

కూటమి ప్రభుత్వం వచ్చాక అసైన్డ్ భూములు, ఇతర భూ కేటాయింపులపై అధ్యయనం చేసింది. శారదాపీఠం భూముల అంశంకూడా ప్రస్తావనకు వచ్చింది. ఆ భూములకు సంబంధించిన సమగ్ర నివేదికను సీఎం చంద్రబాబు తెప్పించుకున్నారని తెలిసింది. ఆ తర్వాత రెవెన్యూ శాఖ పలు సాంకేతిక, ఆర్థిక పరమైన అంశాలను ఉటంకిస్తూ శారదాపీఠానికి కేటాయించిన భూమిని వెనక్కి తీసుకునేలా, భూ కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేసేలా ప్రతిపాదిస్తూ రెండు నెలల క్రితమే ప్రభుత్వానికి ఫైలు పంపించింది. ఈ ఫైలు పలు దశలు దాటుకొని ప్రభుత్వంలో ఓ కీలకాధికారి వద్దకు వెళ్లగానే పక్కన పడేశారు. రెండు నెలల పాటు అక్కడే పెండింగ్‌లో పెట్టారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఆదేశించినా ఫైలు కదలలేదు. ఓ కీలక మంత్రి నుంచి వచ్చిన ఆదేశమే ఇందుకు కారణమని తెలుస్తోంది. పలు కారణాలను చూపి తాజాగా వెనక్కి పంపినట్టు సమాచారం. ఈ వ్యవహారం వెనుక విశాఖ కేంద్రంగానే సెటిల్‌మెంట్ జరిగిందని విశ్వసనీయ సమాచారం. ఆ సెటిల్‌మెంట్ ఎలా జరిగింది? కీలక మంత్రి ఎలా సంతృప్తి చెందారు? అన్న అంశాలు ఫైలును ఆపించిన పెద్దలకు, సాములోరికే తెలియాలని తెలుగుదేశం నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 'ఫైలు' వెనుక కథపై పార్టీ నేతల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఆ మంత్రి జోక్యంపై నేతలు బాహాటంగా చెబుతున్నారు.

ఇదేం మాయ?

జగన్ ప్రభుత్వంలో స్వరూపానంద ఓ వెలుగు వెలిగారు. ఎవరికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలి? ఎవరికి ఏ పని అప్పగించాలి? ఎవరు ఏ పనిచేయాలి? వంటి వాటిని నిర్దేశించేవారు. ఆయనకు ప్రత్యేక సెక్యూరిటీ ఏర్పాటు, ఆయన పీఠానికి రోడ్లు వేయడం... ఇలా ఎన్నెన్నో జరిగిపోయాయి. అయితే ప్రభుత్వం మారగానే పీఠం వ్యవహారం చంద్రబాబు దృష్టికి వచ్చింది. అప్పటికే సాములోరి లీలా విన్యాసాలు క్షుణ్నంగా తెలుసుకొని భూ కేటాయింపులు, వాటి వెనక జరిగిన తంతుపై ఆరా తీశారు. అక్రమ భూ కేటాయింపులు రద్దు చేయాల్సిందేనని, ఎంతటి వారైనా వదలొద్దని ఆదేశించారు. కానీ సీఎం చెప్పినా అమలు కాలేదు. జగన్‌కు ఆత్మ, పరమాత్మగా మారిన ఈ సాములోరిని వెనకేసుకొస్తున్నారంటే ఇదేం మాయ అంటూ టీడీపీ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి జరగాల్సిన దూరవిద్య పరీక్షలు వాయిదా

పెదకాకాని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూరవిద్య కేంద్రం గురువారం (17వ తేదీ) నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన యూజీ, పీజీ పరీక్షలను వాయిదా వేసినట్టు దూరవిద్య కేంద్రం పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ బుధవారం తెలిపారు. అల్పపీడన ద్రోణి వల్ల రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ పరీక్షలను వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి జరగాల్సిన రెండవ సెమిస్టర్, నాలుగవ సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. వాయిదాపడిన ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 17వ తేదీ నుంచి నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్జీటీలకు సర్టిఫికేషన్ కోర్సు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యలో మెరుగైన ఫలితాల కోసం సెకండరీ గ్రేడ్ టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు సర్టిఫికేషన్ కోర్సును పాఠశాల విద్యాశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ శిక్షణ కార్యక్రమాలను ఈ నెల 21 నుంచి 26 వరకు టీచర్లు వ్యక్తిగతంగా హాజరయ్యే విధానంలో నిర్వహిస్తారు. ఆ తర్వాత 14 రోజుల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమం ఉంటుంది. దశలవారీగా 34 వేల మంది టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శిక్షణపై సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు.

విశాఖ నౌకా పరిశ్రమకు జోష్

» మరో రెండు న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణం
» 40 వేల కోట్లు కేటాయింపునకు కేంద్రం సమ్మతి
» భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం
» ప్రైవేటు, అనుబంధ సంస్థలకు ఊతం
» ఇప్పటికే ఇక్కడ అరిహంత్, అరిఘాత్ నిర్మాణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భారత్‌లో న్యూక్లియర్ సబ్‌మెరైన్ల కేంద్రంగా వర్ధిల్లుతున్న విశాఖపట్నంలో మరో రెండు న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) ఇటీవలే దీనికి ఆమోదం తెలిపింది. ఈ రెండు అణు జలాంతర్గాముల నిర్మాణానికి రూ.40 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్టు వెల్లడించింది. ఈ నిర్ణయంతో విశాఖపట్నంలో నౌకా నిర్మాణ పరిశ్రమపై ఆధారపడిన అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మరో ఐదేళ్ల చేతి నిండా పని లభించనుంది.

ఇప్పటికే రెండు సబ్‌మెరైన్ల నిర్మాణం

తూర్పు నౌకాదళం కేంద్రంగా ఉన్న విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో 2004 నుంచి న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణం జరుగుతోంది. ఇక్కడ తొలుత ఐఎన్ఎస్ అరిహంత్‌ను నిర్మించారు. స్ట్రాటజిక్ స్ట్రయిక్ న్యూక్లియర్ సబ్‌మెరైన్స్ (ఎస్ఎస్‌బీఎన్) పేరుతో ఇక్కడ నాలుగు న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెజల్ (ఏటీవీ) ప్రాజెక్టును 2004లో ప్రారంభించారు. ఇందులో మొదటిదైన అరిహంత్ నిర్మాణానికి రష్యా సహకారం తీసుకున్నారు. దీన్ని 2009లో లాంచ్ చేసి అనేక సీ ట్రయల్స్ అనంతరం 2016 ఆగస్టులో నేవీకి అందించారు. ఇది నిర్మాణంలో ఉండగానే రెండోదైన ఐఎన్ఎస్ అరిఘాత్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాన్ని 2017లో సీ ట్రయల్స్‌కు పంపించారు. దశల వారీగా అన్ని పరీక్షలు పూర్తిచేసి ఈ ఏడాది ఆగస్టు 29న జాతికి అంకితం చేశారు. వీటిని 'అరిహంత్ క్లాస్' న్యూక్లియర్ సబ్‌మెరైన్లుగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన రెండు సబ్‌మెరైన్ల నిర్మాణం ఆలస్యమవుతుందని రక్షణ శాఖ వర్గాలు భావించాయి. అయితే కేంద్ర భద్రతా కమిటీ.. మిగిలిన రెండు సబ్‌మెరైన్ల నిర్మాణానికి రూ.40 వేల కోట్లు ఇవ్వనున్నట్టు ప్రకటించడంతో నౌకా నిర్మాణ రంగంలో కొత్త ఆశలు చిగురించాయి. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో వీటిని రూపొందించడం వల్ల స్థానిక పరిశ్రమలకు ఎక్కువ అవకాశాలు దక్కనున్నాయి. ఎల్ అండ్ టీతో పాటు అనేక ఇతర ప్రైవేటు సంస్థలు వీటి నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్నాయి.

నైపుణ్యం పెంచుకుంటేనే పనులు

న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణంలో ఆధునిక సాంకేతికను వినియోగిస్తారు. ఆ ప్రాజెక్టులో పనులు దక్కించుకోవాలంటే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూడా ప్రతి ఏటా టెక్నాలజీని పెంపొందించుకోవాలి. దాంతో స్కిల్ డెవలప్‌మెంట్ తప్పనిసరి. అప్పుడే ఈ పనులు చేజిక్కించుకోవడం వీలవుతుంది. కొత్త ప్రాజెక్టుల వల్ల విశాఖ పరిసర ప్రాంతాల్లో నౌకా నిర్మాణంపై ఆధారపడిన వారికి ఐదేళ్ల మంచి ఉపాధి లభిస్తుంది.

- శ్రీనివాసరాజు, ఎండీ, జియోమర్డీ, విశాఖపట్నం

వీఎల్ఎఫ్ స్టేషన్ కూడా విశాఖ నుంచే పర్యవేక్షణ

కేంద్ర భద్రతా కమిటీ న్యూక్లియర్ సబ్‌మెరైన్లకు నిధులు కేటాయిస్తున్నప్పుడు... నాగాయలంక మిస్సైల్ లాంచింగ్ సెంటర్‌తో పాటు తెలంగాణలోని వికారాబాద్‌లో వెరీ లో ఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్) ట్రాన్స్‌మిటింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. సముద్ర అంతర్భాగంలో సంచరించే సబ్‌మెరైన్ల సమాచారాన్ని ఈ సెంటర్ సేకరించి పంపుతుంది. ఇది 365 రోజులూ పనిచేస్తుంది. దీన్ని విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళమే పర్యవేక్షిస్తుంది.

విశాఖలో మలబార్ సముద్ర విన్యాసాలు



విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మలబార్ మేరీటైమ్ ఎక్సర్‌సైజ్-2024 రెండో దశలో భాగంగా భారత్‌తోపాటు అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ యుద్ధ నౌకలు, విమానాలు, హెలికాప్టర్లు విశాఖ సముద్రంలో బుధవారం విన్యాసాలు నిర్వహించాయి. సంయుక్తంగా కలిసి పోరాటం చేయడానికి ఈ ఎక్సర్‌సైజ్‌లు ఎంతగానో దోహదపడతాయని నేవీ వర్గాలు పేర్కొన్నాయి.



'పోలీస్' ఖాళీల భర్తీకి ఏం చర్యలు తీసుకున్నారు?

పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఉన్న 19,999 ఖాళీలను భర్తీ చేసేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పోలీసులు, సాయుధ దళాలపై ఒత్తిడి తగ్గించేందుకు ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఆ ఉత్తర్వులను సరైన స్ఫూర్తితో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఖాళీల భర్తీ ప్రక్రియను పర్యవేక్షించాలని రాష్ట్ర హైకోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం సూచించిందని ధర్మాసనం గుర్తు చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కేతినీడి అఖిల్ శ్రీ గురుతేజ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది షేక్ షెహదాజ్ వాదనలు వినిపిస్తూ... పోలీసు శాఖలో మొత్తం 19,999 ఖాళీలు ఉన్నట్లు సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వం తెలిపిందన్నారు. ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. వివరాలను కోర్టు ముందు ఉంచారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రతిని పరిశీలించిన ధర్మాసనం... పోలీసులపై పనిభారం తగ్గించేందుకు సర్వోన్నత న్యాయస్థానం ఈ ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేసింది. ఖాళీల భర్తీకి తీసుకుంటున్న చర్యలను అఫిడవిట్ రూపంలో కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

బుడమేరు వరదపై కౌంటర్ దాఖలు చేయండి

» కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం
» ప్రతివాదిగా ఉన్న సీఎం చంద్రబాబుకు నోటీసులిచ్చేందుకు నిరాకరణ
» విచారణ ఎనిమిది వారాలకు వాయిదా



అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వరద గురించి ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని, బాధ్యులైనవారిపై చర్యలు తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిల్‌పై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ కార్యదర్శి, పుర పాలకశాఖ ముఖ్య కార్యదర్శి, జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యంలో వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. విచారణను 8వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. కృష్ణానదితో పాటు కొండవీటి వాగు, బుడమేరువాగు ప్రవాహాలకు అవరోధంగా ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఒంగోలుకు చెందిన విశ్రాంత పాత్రికేయుడు నాతాని భూపతిరావు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. వరదకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల వైఖరిని నేరపూరిత చర్య ప్రకటిస్తూ, వారిపై కఠిన చర్యలు తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వరదను ఎదుర్కోవడంతో పాటు బాధితులకు పునరావాసం కల్పించడం, ఆహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది కాసా జగన్మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ ఏడాది ఆగస్టు 30, 31వ తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. అప్పటికే కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టులన్నీ నిండిపోయాయన్నారు. నీటి ప్రవాహం ఎక్కువ ఉన్న కారణంగా వెలగలేరు గ్రామం వద్ద ఉన్న గేట్లు ఎత్తివేస్తామని ఉన్నతాధికారులకు నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సమాచారం ఇచ్చారన్నారు. గేట్లు ఎత్తడం వల్ల బుడమేరుకు వరద పెరుగుతుందని తెలిసినప్పటికీ అధికారులు ప్రజలను అప్రమత్తం చేయలేదన్నారు. అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.... వ్యాజ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వరదలు రావడానికి, ముఖ్యమంత్రికి ఎలాంటి సంబంధం లేదన్నారు. దురుద్దేశపూర్వకంగా ముఖ్యమంత్రిని వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చారన్నారు. ఎలాంటి నోటీసులూ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ముఖ్యమంత్రి చంద్రబాబు మినహా వ్యాజ్యంలోని ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది.

ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరు వెళ్లకుండా నియంత్రణ ఉత్తర్వులు ఇచ్చారా?

» ఇస్తే వాటిని మా ముందు ఉంచండి: హైకోర్టు
» విచారణ 22కి వాయిదా
» ముందస్తు చర్యలపై ఇచ్చిన ఆదేశాలు పొడిగింపు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరు వెళ్లకుండా నియంత్రిస్తూ పోలీసులు ఏమైనా ఉత్తర్వులు ఇచ్చారా? ఇస్తే వాటిని కోర్టు ముందు ఉంచాలి' అని ప్రాసిక్యూషన్‌ను బుధవారం హైకోర్టు ఆదేశించింది. కేసులో నిందితులుగా ఉన్నవారి రిమాండ్ రిపోర్ట్‌లను పరిశీలించేందుకు, వాటిని తమ ముందు ఉంచాలని పోలీసులకు స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన నేతిగుట్లపల్లె, ఆవులపల్లి రిజర్వాయర్ల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపు విషయంలో వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లిన తమ పై ఎంపీ మిథున్‌రెడ్డి, అతని అనుచరులు దాడి చేశారని పేర్కొంటూ ఏఎస్ఆర్‌కె ప్రసాద్, సొహైల్ బాషా ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదులు ఆధారంగా ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడెప్ప మరికొందరిపై పుంగనూరు పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టులో వేర్వేరుగా రెండు పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.... 'మాజీ ఎంపీ రెడెప్ప నివాసానికి వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ కార్యకర్తలే దాడి చేశారు. అక్కడ ఉన్న పిటిషనర్, అతని అనుచరుల కార్లను ధ్వంసం చేసి తగులబెట్టారు. అతికష్టం మీద బయటకు వచ్చి పిటిషనర్ దాడి చేసినవారిపై కేసు పెట్టారు. అందుకు ప్రతిగా పిటిషనర్‌పై ఫిర్యాదిదారులు కేసు పెట్టారు. పిటిషనర్ ప్రోద్బలంతోనే దాడులు జరిగాయని పోలీసులు తమ కౌంటర్‌లో పేర్కొన్నారు. పిటిషనర్‌పై నిర్దిష్టమైన ఆరోపణలు లేవు. కేసులో ఇతర నిందితులకు ట్రయల్ కోర్టు, సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేశాయి. రాజకీయ కారణాలతో కేసు పెట్టినందున ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి' అని అభ్యర్థించారు. ప్రాసిక్యూషన్ తరఫును అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వెంకటరమణ వాదనలు వినిపిస్తూ... 'పుంగనూరు వెళ్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని, వెళ్లవద్దని పిటిషనర్‌కు పోలీసులు చెప్పారు. ఆ మాటను పిటిషనర్ పట్టించుకోలేదు. ఎంపీ మిథున్‌రెడ్డి తన అనుచరులను వాహనాల్లో పుంగనూరు తీసుకెళ్లారు. వాహనాల్లో కర్రలు, రాళ్లు, బీర్ బాటిళ్లు తరలించారు. ఎంపీ మిథున్‌రెడ్డి వస్తున్నారని తెలిసి, ఆయనకు వినతిపత్రం ఇచ్చేందుకు ఫిర్యాదిదారులు మాజీ ఎంపీ రెడెప్ప ఇంటికి వెళ్లారు. వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన రైతులపై రాళ్లు, కర్రలతో ఎంపీ అనుచరులు ఒక్కసారిగా దాడి చేశారు. ఘటనలో చాలామంది తీవ్రంగా గాయపడ్డారు' అని వివరించారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరు వెళ్లకుండా నియంత్రిస్తూ పోలీసులు ఏమైనా ఉత్తర్వులు ఇచ్చారా? అని ప్రాసిక్యూషన్‌ను ప్రశ్నించారు. సంబంధిత ఉత్తర్వులను కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించారు.

ఎరువులు, పురుగుమందులపై డెలివరీ చార్జీలు తొలగించాలి

» మంత్రి అచ్చెన్నాయుడుకు డీలర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులు, పురుగుమందులపై డెలివరీ చార్జీలు తొలగించాలని ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును బుధవారం సచివాలయంలో డీలర్ల సంఘం నాయకులు కలిసి తమ సమస్యలను నివేదించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల మంది వరకు డీలర్లు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం డీఏపీ, ఎంవోపీ విక్రయాలపై కేవలం 2 శాతం మాత్రమే మార్జిన్ ఇస్తామని పేర్కొందన్నారు. అలానే టీఎస్‌పీ, ఎంఏపీ, ఎస్ఎస్‌పీ, ఎన్‌పీకే, పీడీఎం వంటి పురుగుమందులపై 4 శాతం డీలర్ మార్జిన్ చెల్లిస్తామని తెలిపిందన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఈ మార్జిన్లు ఏ విధంగానూ డీలర్లకు మేలు చేకూర్చవని వివరించారు. గత 30 ఏళ్ల నుంచి డీలర్ కమిషన్ పెరగలేదని, ఫెర్టిలైజర్ కంపెనీలు టన్నుకు కేవలం రూ.400 నుంచి 480 మార్జిన్ మాత్రమే ఇస్తున్నాయన్నారు. 50 కిలోల బస్తాకి రూ.20 నుంచి 24 చెల్లిస్తున్నాయని, దీనిని ఎంఆర్‌పీపై 8 శాతం పెంచాలని కోరారు. ఫెర్టిలైజర్ శాంపిల్స్ ఫెయిల్ అయితే తమ లైసెన్సులను రద్దు చేయడం సరికాదని, తమకు ఎవరైతే సరఫరా చేశారో ఆ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్ఎఫ్‌కు దాతల విరాళాలు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్‌కు పలువురు దాతలు విరాళాలు అందించి, దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి, దాతలు చెక్కులు అందజేశారు. గుంటూరు జిల్లా క్వారీ అండ్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.16 లక్షలు, మాస్టర్ మైండ్ అకాడమీ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్‌కృష్ణ రూ.7 లక్షలు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి రూ.2.60 లక్షలు, న్యూజిలాండ్ ఎన్నారై శివశేఖర్‌నాయుడు, రాజశేఖర్ రూ.2 లక్షలు, కలధర్ ట్రావెల్స్ రూ.లక్ష, చెరుకూరి సీతారామయ్య రూ.లక్ష, సాలూరు డాక్టర్ల తరఫున మంత్రి సంధ్యారాణి రూ.లక్ష, కంతేటి నిర్మల రూ.లక్ష, వాదాడ గణేశ్వరరావు రూ.లక్ష, శుభం డెవలపర్స్ రూ.లక్ష, గుజ్జర్లపూడి రాజలక్ష్మి రూ.లక్ష, బిల్లా రాజారావు రూ.71 వేలు, కావూరి దాసు రూ.50 వేలు, దీప్తి ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.40 వేలు, గూడూరి పెద ఆంజనేయులు రూ.25 వేలు, రామకృష్ణప్రసాద్ పాలేటి రూ.10 వేలు అందించారు. మంత్రి లోకేశ్‌కు ఉండవల్లిలోని నివాసంలో పలువురు విరాళాలు అందించారు. మంగళగిరికి చెందిన కేజే సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మోహన్ వర్ధినేని రూ.10 లక్షలు, జీడీ నెల్లూరుకు చెందిన శ్రీ భానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యాజమాన్యం రూ.లక్ష, చిత్తూరుకు చెందిన జే.శేఖర్ రూ.5 వేలు అందజేశారు.

19న ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించిన 2025 జనవరి నెల కోటాను టీటీడీ ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈసేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం భక్తులు 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను కూడా భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుమల, తిరుపతిలోని గదుల కోటాను 24 మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు.

ఎస్‌సీఈఆర్‌టీ ప్రక్షాళన

» సబ్జెక్టు నిపుణులను మార్చేయాలని నిర్ణయం
» కొత్త టీచర్లను తీసుకునేందుకు నోటిఫికేషన్

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ)ని ప్రక్షాళన చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. నాలుగేళ్లుగా ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యుటేషన్‌పై కొనసాగుతున్న వారిని సాగనంపి, సబ్జెక్టు నిపుణులను కొత్తగా తీసుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు బుధవారం నోటిఫికేషన్ జారీచేశారు. ఎస్‌సీఈఆర్‌టీలో ఉన్న తొమ్మిది ప్రొఫెసర్ పోస్టులు, 20 లెక్చరర్ పోస్టులు, మరో ఐదు ఇతర పోస్టులను డిప్యుటేషన్‌పై భర్తీ చేయనున్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, వర్సిటీల్లో, జాతీయ విద్యా సంస్థల్లో పని చేస్తున్న వారు దీనికి అర్హులు. కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలి. జాతీయ అవార్డులు పొందినవారు, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. ఇంటర్వ్యూ ఆధారంగా టీచర్లను ఎస్‌సీఈఆర్‌టీకి ఎంపిక చేస్తారు. ఆసక్తి ఉన్న టీచర్లు వారి దరఖాస్తులను ఆర్జేడీలు లేదా డీఈవోలు లేదా సంబంధిత ప్రిన్సిపాల్ ద్వారా పాఠశాల విద్య డైరెక్టర్‌కు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బుధవారం నుంచి ఈనెల 25 వరకు టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చని, 28 నుంచి 30 వరకు దరఖాస్తులను పరిశీలించి, ఇంటర్వ్యూలకు తుది జాబితా సిద్ధం చేస్తారని తెలిపారు. నవంబరు 4, 5 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి టీచర్లను ఎంపిక చేస్తారు. కాగా.. ఎస్‌సీఈఆర్‌టీలో పనిచేసేందుకు మున్సిపల్ టీచర్లకూ అవకాశం కల్పించాలని యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బకాయిలు చెల్లించాలి: బీటీఏ

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని బహుజన టీచర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మనోజ్‌కుమార్, సీహెచ్ రమేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.25వేల కోట్ల ఆర్థిక బకాయిలున్నాయన్నారు. వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని, 30శాతం ఐఆర్ ప్రకటించాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వైసీపీ నేతలతో అంటకాగిన ఎస్ఐపై వేటు!

» తెనాలి వన్‌టౌన్ ఎస్ఐపై ఐజీ చర్యలు

తెనాలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలతో అంటకాగడంతో పాటు రికవరీ బంగారాన్ని అప్పగించని ఎస్ఐపై సస్పెన్షన్ వేటు పడింది. గుంటూరు జిల్లా తెనాలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న కరిముల్లాపై ఉన్నతాధికారులు బుధవారం చర్యలు తీసుకున్నారు. కరిముల్లా గత వైసీపీ ప్రభుత్వంలో నెల్లూరు జిల్లాలో పనిచేశారు. వెంకటాచల సత్రం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక చెక్‌పోస్ట్ దగ్గర తనిఖీల్లో నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి కొంత బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే అక్కడి నుంచి ఆయన బదిలీ అయ్యాక రికవరీ సొమ్మును సంబంధిత అధికారికి అప్పగించలేదు. కోర్టులో విచారణ సందర్భంగా నిందితుల తరఫువారు ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఎస్ఐ తీరును పోలీస్ అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఎస్ఐను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.

కొండమూడు-పేరేచెర్ల రోడ్డుకు 881 కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల చిరకాల స్వప్నం.. కొండమూడు నుంచి పేరేచెర్ల వరకు జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం రూ.881 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు తెలిపారు. మొత్తం 49.917 కి.మీ జాతీయ రహదారి నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. మాచర్లలో రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.120 కోట్ల వరకు నిధులను కేంద్రం కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, సీఆర్ పాటిల్‌లతో భేటీ అయిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు బుధవారం ఒక ప్రకటనలో ఆ వివరాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మళ్లీ ఒమర్...!

కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. జమ్మూప్రాంతానికి చెందిన సురేందర్ కుమార్ చౌదరీని ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఎంచుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు, ఇండియా కూటమికి చెందిన ఇతర నేతల సమక్షంలో శ్రీనగర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదారద్దుచేసి, రాష్ట్రహోదాను కేంద్రపాలిత ప్రాంతం స్థాయికి కుదించిన తరువాత తొలిగా ఏర్పాటైన ప్రభుత్వం ఇది. సచివాలయంలో బాధ్యతలు స్వీకరించడానికి వెళ్ళినప్పుడు అధికారులు, ఉద్యోగులు ఒమర్‌కు ఘనస్వాగతం పలికారు. తనతోపాటు ప్రమాణం చేసిన ఉపముఖ్యమంత్రి, మంత్రులతో కలసి ఆయన ఉన్నతాధికారులతో ఓ సమావేశం కూడా నిర్వహించారు. సీఎం కుర్చీలో తాను ఉన్న ఫోటో ఒకటి ట్విటర్‌లో పోస్టు చేసి 'ఐయామ్ బ్యాక్' అని ఓ వ్యాఖ్య కూడా జతచేశారు. 2009–14 మధ్య కాలంలో, అంటే, జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రహోదాను అనుభవిస్తున్న కాలంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ అదే కుర్చీలో కూర్చున్నంతమాత్రాన, ఆ అధికారాలు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు తనకు ఇప్పుడు లేవని, తన ఉనికిని నిలబెట్టుకోవడానికీ, ప్రజలపక్షాన కేంద్రంతో అనునిత్యం పోరాడక తప్పదని ఆయనకు బాగా తెలుసు.

గతకాలంలో ప్రజలకు, పాలకులకు మధ్య పెరిగిన దూరాన్ని తగ్గించి, ఇది మన ప్రభుత్వం అని జనం అనుకొనేట్టు చేస్తానని ఒమర్ హామీ ఇస్తున్నారు. తనది ప్రజాప్రభుత్వం అనిపించుకోవడానికి పోలీసులకు కొన్ని నిర్దిష్టమైన ఆదేశాలు కూడా జారీచేశారు. తన కాన్వాయ్ కోసం జనం రాకపోకలను అడ్డుకోవడం, లాఠీలు ఊపుతూ ప్రజలను బెదిరించడం ఇత్యాదివి కూడదని ఆదేశించారు. అధికారులతో సైతం సన్నిహితంగా ఉండాలన్న ప్రయత్నం ఆయన మాటల్లో కనిపిస్తోంది. కానీ, కేంద్రం చేయూత లేనిదే అడుగుకూడా వేయలేని స్థితి. ఓ కేంద్రపాలిత ప్రాంతానికి, అందునా జమ్మూకశ్మీర్‌కు సీఎంగా కొనసాగడం లెఫ్టినెంట్ గవర్నర్ ఆశీస్సులతో మాత్రమే సాధ్యం. పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని మోదీ సహా బీజేపీ పెద్దలంతా హామీ ఇచ్చినప్పటికీ, ఒమర్ నాయకత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వం ఏర్పడటం ఓ అద్భుతం, అమోఘం అని వారంతా కీర్తిస్తున్నప్పటికీ, రాబోయే రోజుల్లో ఎదురీత అంత సులభం కాదు. సాధ్యమైనంత వేగంగా రాష్ట్రహోదా ఇవ్వాలని ఒమర్ బుధవారం కూడా మరోమారు అన్నారు. కానీ, ఎన్నికల ప్రచారంలో మిగతాపార్టీల కంటే గట్టిగా నేషనల్ కాన్ఫరెన్స్ వాదిస్తూ వచ్చిన అంశం ప్రత్యేకప్రతిపత్తిని తిరిగి సాధించడం. లోయలో ప్రజలు ఆయన పార్టీకి అత్యధిక స్థానాలు కట్టబెట్టడంలో ఇది ప్రముఖంగా పనిచేసిందని అంటారు. కానీ, కేంద్రంతో కలసి పనిచేయవలసిన అవసరం గురించి ఇటీవల ఒమర్ మాట్లాడుతూ, ప్రస్తుతానికి ఈ తీవ్రమైన అంశాన్ని పక్కన బెట్టాల్సి ఉన్నదంటూ వ్యాఖ్యానించడం సయోధ్య సాధనలో భాగం కావచ్చు. బీజేపీ పూర్తిగా తుడిచిపెట్టేసిన జమ్మూమీద కూడా ఆయన ఎంతో ప్రేమ కురిపిస్తున్నారు. అక్కడనుంచి ఐదుగురు ఇండిపెండెంట్ల మద్దతు కూడగట్టుకున్న ఆయన ఆ ప్రాంతానికి ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతోపాటు, తమ ప్రభుత్వాన్ని అక్కడివారు సైతం మన ప్రభుత్వం అనుకొనేట్టుగా పరిపాలిస్తామని హామీ ఇస్తున్నారు.

2019 ఆగస్టు 5న కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఈ ఎన్నికల్లో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని, ఒమర్ ప్రభుత్వం ప్రప్రథమంగా ఆ నిర్ణయాలను ఖండిస్తూ అసెంబ్లీలో ఓ తీర్మానం చేయాలని మెహబూబా ముఫ్తీ డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో కేంద్రం నిర్ణయాలకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడిన ఒమర్ పార్టీ ఏం చేయబోతుందో చూడాలి. పదేళ్ళ తరువాత మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు చక్కగా పాల్గొని తమకు నచ్చిన వారిని ఎన్నుకున్నారు. గవర్నర్ ఏలుబడిలో తమ గోడు వినేవారే లేక పోయారని బాధపడుతున్నవారికి కొత్త ప్రభుత్వం ఉపశమనం అందించాలి. సర్వాధికారాలు దఖలుపరచుకున్న కేంద్రప్రభుత్వం గతంలో మాదిరిగా, ఏకపక్షంగా వ్యవహరించడం కాక, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంతో సమన్వయంతో వ్యవహరించాలి. పదేళ్ళుగా వరుస కష్టాలతో గాయపడి ఉన్న జనాన్ని రాజకీయయుద్ధాలతో మరింత వేధించడం సరికాదు. ప్రత్యేకప్రతిపత్తిని పునరుద్ధరించడం అసాధ్యమని కేంద్రం అంటోంది. కానీ, రాష్ట్రహోదా విషయంలో అది న్యాయస్థానంలోనూ, ప్రజాక్షేత్రంలోనూ కూడా హామీ పడింది. ఎన్నికల తరువాత రాష్ట్రహోదా అన్న మాటను ప్రధానిమోదీ, హోంమంత్రి అమిత్ షా వెంటనే నిలబెట్టుకోవాలి. అనేక చట్టసవరణలతో జమ్మూకశ్మీర్‌లో తాము అనుకున్నది చేసుకుపోతున్నవారు, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా, వారు ఎన్నుకున్న ప్రభుత్వానికి అండగా నిలవాలి.

రెండో కుర్చీ

కుర్చీలో కూర్చోవడం ఒక్కటే ముఖ్యం కాదు! కూర్చున్న కుర్చీలో కుదురుకోవడమే చాలా ముఖ్యం! ఇంత ముఖ్యమైన విషయాన్ని విస్మరించి ముందుకు పోవడం ఎవరికైనా ఎంతో కష్టమవుతుంది. ఈ కష్టాన్ని ముందే కనిపెట్టకపోతే ఎవరూ కార్యసాధకులు కాలేరు.

ఈ ముందు జాగ్రత్త ఉంది కనుకనే ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి అతిశీ ఒక కొత్త సంప్రదాయానికి తెర తీశారు. ముఖ్యమంత్రి కుర్చీ పక్కనే రెండో కుర్చీని వేయించి ఇది తన అధినేత అయిన అరవింద్ కేజ్రీవాల్ కోసమని సెలవిచ్చారు. ఇక నుంచి తను భరతుని వలె పరిపాలన సాగిస్తానని ప్రకటించారు. మళ్లీ ఎన్నికలకు వెళ్లేంత వరకు ఈ నాలుగు నెలలూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. అంతేకాకుండా 'నన్ను సీఎంను చేసిన వ్యక్తిని సీఎంగా చేయడమే లక్ష్యంగా నేను పని చేస్తాను' అని ప్రతిన బూనారు.

రాజకీయాలలో భక్తి కన్నా, భయం ఎక్కువ ప్రభావాన్ని చూపెడుతూ ఉంటుంది. అది కుర్చీ భయమే అయినట్లయితే ఇక అది మామూలుగా ఉండదు. ఆ భయం తాలూకు చర్యలు అనేక రూపాలలో బయటకు వస్తుంటాయి. ఈ రెండో కుర్చీ వ్యవహారం కూడా అలాంటిదే అని గిట్టనివాళ్ళు గుసగుసలాడుతున్నారు. అయితే ఇల్లలుకగానే పండుగ అవుతుందా? కుర్చీలో కూర్చున్నంత మాత్రాన అంతా కులాసాగా సాగాలని గ్యారెంటీ ఉందా? ఒకవేళ అలా సాగాలని ఎవరైనా అనుకున్నా అలా సాగనిచ్చే వ్యవస్థ ఏదీ అక్కడ ఉండాలని లేదు కదా. కూర్చున్న వారిని చూసి కుతూహల పడే వారి కన్నా కుతకుతలాడే వాళ్ళ సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. కూర్చున్న దగ్గర నుంచి వాళ్లను కూలదోసే ప్రయత్నం చేసే వాళ్ల కూడా పెరుగుతూ పోతుంటారు.



కుర్చీ మౌనంగానే ఉంటుంది. కూర్చునే వ్యక్తి కూడా మౌనంగానే ఉండొచ్చు. కానీ అందులో ఆ వ్యక్తిని ప్రశాంతంగా కూర్చోనిచ్చే వాతావరణమే చుట్టుపక్కల ఉండదు. అదిగో ఆ వాతావరణ ప్రభావం నుంచి పుట్టుకు వచ్చిందే ఈ ఆలోచన అని గిట్టని వాళ్ల చెవులు కొరుక్కుంటున్నారు. ఈమెది భయాన్ని మించిన జాగ్రత్త అనీ, అదిగో ఆ జాగ్రత్త నుంచి పుట్టుకు వచ్చిందే రెండో కుర్చీ ఆలోచన అని కూడా అంటున్నారు. తన కుర్చీకి ప్రమాదం రాకుండా ఉండడం కోసమే ఆమె 'ఆయన' కుర్చీని ముందుకు తీసుకు వచ్చారని ఒక పుకారును పుట్టించి దట్టించి మరీ దేశం మీదకి వదిలేశారు.

ఇది పైకి అధినేతపై భక్తి లాగా కనిపిస్తున్నప్పటికీ సారాంశంలో తన పదవికి ఎలాంటి ఢోకా లేకుండా చేసుకొనేందుకు చేపట్టిన ఇజ్రాయెల్ వాడిన 'ఐరన్ డోమ్' వంటి గట్టి భద్రతా వ్యవస్థ అనే అభిప్రాయాన్ని కూడా ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఇక నుంచి తన పైకి ప్రత్యర్థులు విసిరే రాజకీయ క్షిపణి దాడులన్నిటినీ కూడా తాను అధినేతకు వేసిన రెండో కుర్చీ అడ్డుకుంటుందని ఆమె నమ్మకమై ఉంటుంది!

అతిశీ చేసిన ఈ చర్య మనకు తమిళ రాజకీయాలను తలపునకు తెస్తున్నదికదూ! జయలలిత జైలుకు వెళ్ళిన ప్రతిసారీ అధికారాన్ని తన అనుంగు శిష్యుడు పన్నీరు సెల్వానికి అప్పగించడం– ఆయన కన్నీరు పెడుతూ ఈ కార్యాన్ని భుజాన వేసుకోవడం– మళ్ళీ 'అమ్మ' జైలు నుంచి బయటకు రాగానే పదవికి పన్నీరు పూత పూసి ఆమెకు పువ్వుల్లో పెట్టి మరీ అప్పగించడం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఏలుకోరా నాయనా అంటే ఈ ఏడుపు ఎందుకని అప్పుడు చాలా మంది ఆశ్చర్యపోయేవారు. కానీ ఆ ఏడుపు వెనక ఆతిశీకి ఉన్నటువంటి రెండో కుర్చీ లాంటి ఆత్మరక్షణ చర్యలు ఏవీ తనకు లేకపోయెకదా అనే బయటికి కనిపించని బాధ ఏదో ఆయనకు ఎంతో కొంత ఉండే ఉంటుంది. ఈ పదవి 'మూడు, నాలుగు నెలల' ముచ్చటే కదా అనే ఆయన ఆత్మఘోష అటువైపు చెవి యొగ్గి విన్నవాళ్లకు తప్ప ఇతరులెవరికీ వినిపించే అవకాశం లేదు.

అతిశీ చేసిన రెండో కుర్చీ ప్రయోగం 'ఆప్' వర్గాలకు నచ్చితే నచ్చవచ్చు, కానీ అందరికీ ఎందుకు నచ్చుతుంది చెప్పండి? అందుకే ఆమె భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించింది అని కమలనాథులు ధ్వజమెత్తారు. అంతేకాకుండా రెండో కుర్చీ రాజ్యాంగ విరుద్ధమని కూడా ప్రకటించేశారు. దీనికి ప్రతిగా ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు ప్రతిదాడికి పూనుకున్నాయి. డబుల్ ఇంజన్ సర్కార్లు అవసరం అంటున్న చోట– డబుల్ కుర్చీ సర్కారు ఎందుకు ఉండకూడదని ఎదురు ప్రశ్నలు గుప్పించాయి.

ఖాళీ కుర్చీ కనిపిస్తే ఎవరో ఒకరు కూర్చుంటారు. అట్లాంటిది అధికారంతో కూడిన ఖాళీ కుర్చీ కనిపించాక ఇక ఊరుకుంటారా? ఆ ఖాళీని పూరించేంత వరకు వాళ్లు ఎదుటివారికి ఖాళీ సమయాన్ని లేకుండా చేసేందుకే ముమ్మర ప్రయత్నం చేస్తారు. భారతీయ జనతాపార్టీ ఢిల్లీ శాఖ ఇక నుంచి ఆ పనిమీదే ఉండబోతోంది. వారికి భాజపా హై(పై)కమాండ్ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి మరి!

– గుండెబోయిన శ్రీనివాస్

సాయిబాబా దారుణ యాతనకు కారకులెవరు?

జీవితమంతా వీల్‌చెయిర్‌పై శ్వాసించిన ప్రొ. జి.ఎన్. సాయిబాబా తన దేహ బంధం నుంచి విముక్తి పొందాడు. ఈ దేశవాసుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి పోయాడు. పది సంవత్సరాల పాటు కారాగారం (నాగపూర్ అండాసెల్)లో దారుణ యాతన అనుభవించి, కుదించబడిన శరీర వేదనను భరించి, నిర్దోషిగా బయటికి వచ్చిన విద్యావేత్త! మావోయిస్టులకు సహకరించాడనే నేరంపై, ఈ బీజేపీ ప్రభుత్వం ఎంతో కక్షపూరితంగా సాయిబాబాను నిర్బంధానికి గురిచేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిరసనలు వెలువడినా, పౌరహక్కుల సంఘాల విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం ఖాతరు చేయలేదు.



సాయిబాబా శారీరకంగా వికలాంగుడైనా, మేధోపరంగా ఎంతో క్రియాశీలుడు. కవిగా, రచయితగా సృజనాత్మకత ఉన్న వాడు. అమలాపురంలోని ఒక పేద కుటుంబం నుంచి పెరిగి, ఢిల్లీ విశ్వవిద్యాలయం దాకా ఎదిగిన విద్యావేత్త. ఎవ్వరికీ ఎలాంటి హాని చేసినవాడు కాదు. మావోయిస్టుల పట్ల సానుభూతి ఉండొచ్చు. అంతమాత్రాన ఈ రాజ్యాంగ వ్యవస్థలోని లోపభూయిష్టమైన న్యాయశాఖ కనికరించలేదు. బీజేపీ పాలకవర్గం చట్టం ముసుగులో ఆయన్ని హింసించింది. మిత్రులు వరవరరావు తదితరులకు షరతులతో బెయిల్ ఇచ్చి, ముంబైకే పరిమితం చేసి, పరోక్షంగా ఆంక్షలు విధించి అప్రకటిత శిక్షను అమలు చేస్తున్నది.

వ్యక్తిగా స్వయంగా ఎలాంటి ఆయుధం పట్టలేని ఒక వికలాంగుడైన మేధావి, ఇంతటి నరకయాతన, హింసను పొందడానికి కారకులెవరు? పాపం, పుణ్యం, కర్మ ఫలం లాంటి మాటలను పక్కన పెడితే, అసలు ఈ దేశంలోని న్యాయశాఖ, పాలనా యంత్రాంగంలోని అన్ని విభాగాలు ఆయనపై సాగిన హింసకు బాధ్యులే! అంతిమ దశ దాకా మనోస్థయిర్యంతో జీవించిన సాయిబాబాకు విప్లవాంజలి!!

– నిఖిలేశ్వర్

హర్యానా పాఠం అందకపోతే, 'మహా' ప్రమాదం!

మధ్యలో ఆటంకాలు వస్తాయేమో అని కొందరు పనులు మొదలు పెట్టనే పెట్టరట. వీళ్లు అధములట. మొదలుపెట్టాక, చిన్న విఘ్నం రాగానే తోకముడిచే వాళ్లుంటారు, వాళ్ల మధ్యరకం వాళ్లు. ఇక, ఆరునూరైనా అవరోధాలు ఎన్ని ఎదురైనా ఉత్తములు మాత్రం పనిపూర్తి చేస్తారట. భర్తృహరి నీతులు చాలా చెప్పాడు కానీ, పని మొదలుబెట్టి, చిన్న విజయం రాగానే అదే మహాద్భాగ్యం అనుకుని, కాడిపడేసే వాళ్ల గురించి మాత్రం రాయలేదు. అప్పటికింకా కాంగ్రెస్ పార్టీ పుట్టలేదు కాబట్టి, ఆ బాపతు మనుషుల గురించి ఆ కవికి తెలియకపోయి కూడా ఉండవచ్చు.

బుధవారం నాడు శ్రీనగర్‌లో ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారానికి హాజరయిన రాహుల్‌గాంధీని, ఆయన సోదరిని, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేని చూసినప్పుడు, వారి మీద అపారమయిన జాలి కలిగింది. మొన్నటి ఎన్నికల్లో వారికి దొరికింది ఒక పావుశేరు గెలుపు మాత్రమే. అంత మాత్రానికే వారి ముఖాలు వెలిగిపోతున్నాయి. హర్యానా జారిపోయింది. జమ్మూకశ్మీర్‌లో గెలుపు ఏదైనా ఉందంటే, అది కూడా నైతికమయిన గెలుపు, నేషనల్ కాన్ఫరెన్స్‌ది మాత్రమే. జమ్మూ ప్రాంతంలో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. కేంద్రపాలిత ప్రాంతం మొత్తం మీద బీజేపీ బాగా పుంజుకున్నది. ప్రభుత్వంలో చేరకుండా కాంగ్రెస్ కొంత పరువు దక్కించుకున్నది కానీ, ఆ ప్రభుత్వం మాత్రం ఏ పాటిది? గవర్నర్ కనుసన్నలలో వ్యవహరించవలసివచ్చే జీహుజూర్ సామంతం!

మరి, ఈ కాంగ్రెస్ అల్పసంతోషులు రేపు మహారాష్ట్రలో గట్టి పోటీ ఇస్తారా? జార్ఖండ్‌లో తమ కూటమిని గెలిపించుకుంటారా? వచ్చే ఏటికి బిహార్‌లో బలపడతారా? లేక, భారం అంతా తమతో పాటు నడిచే మిత్రపక్షాల మీదికి తోసి, నిమ్మకు నీరెత్తుతారా? తమకు కాస్త బలం పెరిగే సరికి, ఏ పొత్తూ వద్దని పోజు కొట్టి, హర్యానాలో గర్వభంగం జరిగిన కాంగ్రెస్, మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీతో సవ్యంగా కలసి నడుస్తుందా?

పోయిన ఏడాది కర్ణాటకలో బీజేపీ మీద ముఖాముఖి ఘనవిజయం సాధించేసరికి కాంగ్రెస్ గాల్లో తేలిపోసాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు, కాంగ్రెస్‌కు సానుకూలత కూడా పెరుగుతోందని తెలిసినా, పరిస్థితిని పూర్తి అనువుగా మలచుకోవడంలో అగ్రనాయకత్వం సమర్థత అంతంత మాత్రంగానే ఉండడంతో, బొటాబొటి మెజారిటీతో తెలంగాణలో అధికారం దక్కించుకుంది. వరుస బీజేపీ పాలనల తరువాత, ప్రత్యామ్నాయానికి సిద్ధంగా కనిపించినప్పటికీ, మధ్యప్రదేశ్ ఓటర్లను కాంగ్రెస్ ఆకట్టులేకపోయింది. ఇక రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లను వ్యతిరేక ఓటుతో పోగొట్టుకున్నది. పొడవు జోడో యాత్ర తరువాత, అడ్డంగా చేసిన న్యాయ యాత్ర ఫలితమో, ఓటర్లు ఉద్వేగాలను అధిగమించి వాస్తవ జీవనసమస్యల మీద దృష్టి సారించారో లేదో కానీ, సాధారణ ఎన్నికల్లో, కాంగ్రెస్ తన బలాన్ని రెండింతలకు మించి పెంచుకుంది. బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకుండా, 240 దగ్గర నిలిపింది కానీ, ఎన్‌డీఏను, మోదీ మూడో రాకడను నిలవరించలేక పోయింది. యూపీ, మహారాష్ట్ర, హర్యానాల్లో బీజేపీని నేరుగా దెబ్బతీయగలిగినందుకు బహుశా, కాంగ్రెస్ అధిష్ఠానం బాగా అలసిపోయి ఉంటుంది. ఇక చేయాల్సింది, 2029 దాకా వేచిచూడడం మాత్రమే. ఆ లోగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలన్నీ వరుసగా తన బుట్టలో పడవలసినవే అనే పగటికలల్లోకి విశ్రమించి ఉంటుంది.

తన విజయం ఖాయమనుకుని ఆయుధాలు జారవిడవడం హర్యానాలో కాంగ్రెస్ ఓటమికి ఒకానొక ముఖ్య



> హర్యానాలో స్థానిక అభివృద్ధి అంశాలే ఎన్నికలలో వినిపించాయి కానీ, మహారాష్ట్రలో మత ఉద్రిక్తతల పాత్ర చాలా ఉంటుంది. మహారాష్ట్ర ఎన్నికల పోరాటానికి సన్నాహకాలుగా, ప్రభావ ప్రేరకాలుగా ఆ రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగానూ మత హింస జరగడాన్ని గమనించవచ్చు. మరో పక్క, మహాయుతి కూటమిలో కూడా నాయకత్వ పోటీ ఉన్నది. షిండేను తప్పించి, తమ వాడిని ముఖ్యమంత్రిని చేయాలని బీజేపీ ఆలోచన. లోక్‌సభ ఎన్నికలలో ఎదురుదెబ్బ దృష్టిలో పెట్టుకుని, నాయకత్వ సమస్యను ఎన్నికల తరువాతకి వాయిదా వేసింది. అగాఢీ కూడా అదే పనిచేయబోతోంది. బీజేపీ గనుక మహారాష్ట్రలో గట్టెక్కగలిగితే, ఆ పార్టీ మొన్నటి లోక్‌సభలో తగిలిన దెబ్బ నుంచి గణనీయంగా కోలుకున్నట్టే. అదే జరిగితే తన భవిష్యత్తేమిటో కాంగ్రెస్ ఊహించుకోవాలి.

కారణం. ఏకైక కారణం కాకపోవచ్చు. హర్యానాలో కాంగ్రెస్ గెలుస్తుందని లోక్‌సభ ఎన్నికల సరళి చెప్పింది. రైతు ఉద్యమాల హోరు చెప్పింది. క్షేత్రస్థాయి పరిశీలనలు చేసిన మీడియా వ్యాఖ్యాతలు చెప్పారు. పోలింగ్‌కు ముందు సర్వేలు, తరువాత ఎగ్జిట్‌పోల్స్ చెప్పాయి. అయినా, ఫలితం మాత్రం బీజేపీ హ్యాట్రిక్. ఇప్పుడు నెపాన్ని అందరూ భూపిందర్ సింగ్ హుడా మీదకు నెట్టేయవచ్చు. విజయాన్ని అమిత్ షా వ్యూహరచనకు అంటగడుతున్నప్పుడు, ఓటమికి మాత్రం రాహుల్, ఖర్గే ఎందుకు బాధ్యులు కారు?



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఇక్కడ సమస్య హర్యానాలో స్థానికంగా ఏ కారణాలు పనిచేశాయి, సామాజిక వర్గాల ఏ కూడికలు, తీసివేతలు విఫలమయ్యాయి అన్నది కాదు. వేసుకోవలసిన ప్రశ్నలు ఇవి : హర్యానా విజయం తనకు అత్యవసరమని కాంగ్రెస్ ఎందుకు అనుకోలేదు? లోక్‌సభ ఎన్నికల్లో వ్యక్తమైన సానుకూలతను ఎందుకు జారవిడుచుకుంది? గెలిచే అవకాశం లేదని లోకం కోడై కూస్తున్నా, పట్టుదలగా బీజేపీ ఎట్లా గెలవగలిగింది? లోక్‌సభ ఎన్నికలలో నాలుగు మెట్లు కిందికి జారిన బీజేపీ, హర్యానా గెలుపుతో ఒక మెట్టు తిరిగి ఎక్కగలిగింది. ఈ విజయం, బీజేపీ శ్రేణులలో కొత్త ఉత్సాహం నింపుతోంది. ఎన్‌డీఏలో మిత్రపక్షాల ప్రాధాన్యాన్ని కుదించివేస్తోంది. మా ప్రాభవం తగ్గుతుందనుకుంటున్నారేమో, మళ్లీ మేం పూర్వ వైభవానికి వచ్చేస్తున్నాం.. అంటూ మిడిమిడి గెలుపులకే మూర్ఛపోయిన ప్రత్యర్థులను హెచ్చరిస్తోంది. తీసుకుంటే, హర్యానా ఫలితాల్లో కాంగ్రెస్‌కు తీవ్ర హెచ్చరిక దాగి ఉంది. ఆ ప్రమాదసూచిక ఒకరకంగా కాంగ్రెస్‌కు మేలుచేసేది, మేలుకొల్పేది!

తప్పుల నుంచి నేర్చుకుని, దిద్దుబాటు చేసుకుంటుంది కాబట్టి బీజేపీ హర్యానాలో గెలిచింది అని కొందరు వ్యాఖ్యాతలు అంటున్నారు. అంత ఉదాత్తత ఆపాదించనక్కరలేదు కానీ, దారి సవరించుకునే పద్ధతి అయితే ఆ పార్టీకి ఒకటి ఉంది. ఫలితాలు తమకు ప్రతికూలంగా వచ్చినప్పుడు, లోపం ఎక్కడ ఉందో కనిపెట్టి, విరుగుడు ప్రయోగించడంలో బీజేపీ వ్యూహకర్తలు దిట్టలు. ప్రజలలో వ్యతిరేకతకు కారణమైన విధాన నిర్ణయాలను వెనక్కి తీసుకుని, తిరిగి వారిని ఆకట్టుకునే ప్రయత్నం బీజేపీ పెద్దగా చేయదు. ఒక్క రైతు చట్టాల విషయంలో మాత్రమే వెనుకంజ వేసింది. అదొకటే మినహాయింపు. ప్రజల దృష్టి నుంచి ఆత్మవిమర్శ చేసుకోవడం బీజేపీకి అలవాటు లేదు. అమిత్ షా వంటి బీజేపీ పెద్దలు చేసే ప్రతిక్రియలు ప్రధానంగా సామాజిక సమీకరణాలకు సంబంధించినవి. జాట్ కులస్థులు బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారు కాబట్టి, జాటేతరులందరినీ తమ వైపుకతిప్పుకోవడం బీజేపీ చేసింది. అటువంటప్పుడు, కాంగ్రెస్ ఏమి చేయాలి? తన వెనుక సమీకృతమైన జాట్ బలానికి తోడు, ఇతరులలో నుంచి కూడా గణనీయంగా రాబట్టుకోవాలి. దళిత నాయకురాలు శెల్జాను ప్రచారం నుంచి ఆమడ దూరం పెట్టి కాంగ్రెస్ ఏ ఐక్యతను ప్రదర్శించగలిగింది?

హర్యానాలో కూడా మతతత్వ వాతావరణం, దాన్ని మరింత ఉద్రిక్తం చేసిన సంఘటనల క్రమం ఉన్నది. కానీ, సాపేక్షంగాచూస్తే, బీజేపీ ఈ అసెంబ్లీ ఎన్నికలలో ఆ రాష్ట్రంలో మతవిభజనను పెద్దగా ఉపయోగించుకోలేదు. కాకపోతే, తన పార్టీ వేదికల మీద నుంచి పదే పదే నిరసించే కులవిభజనను మాత్రం బాగా ఉపయోగించుకుంది. కాబట్టి, జాతీయస్థాయిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉన్న రాజకీయ సంవాదానికి హర్యానాలో ఆస్కారం లేకపోయింది. బీజేపీ ప్రతివ్యూహాన్ని అర్థం చేసుకోలేకపోవడం, సృజనాత్మకమైన పద్ధతులతో ప్రచారం నిర్వహించకపోవడం, సంప్రదాయ నాయకత్వాన్నే పూర్తిగా విశ్వసించడం కాంగ్రెస్‌ను దెబ్బతీశాయి. తన పునరుజ్జీవనంలో హర్యానా ఒక కీలకమయిన, ఆవశ్యకమైన మజిలీ అన్న స్పృహ కాంగ్రెస్ పెద్దలకు లేకపోవడం అన్నిటి కంటె ఎక్కువ చేటు చేసింది.

హర్యానాలో లాగానే, మహారాష్ట్రలో కూడా మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్షానిదే హవా. మహా వికాస్ అగాఢీ మెజారిటీ అసెంబ్లీ సెగ్మెంట్లలో విజయం సాధించగా, అందులో కాంగ్రెస్ వాటా ఎక్కువ. ఇంకేముంది? తామే పెద్దన్నల మనుకుని, పొత్తులో మిత్రులకు అన్యాయం చేస్తే, పిట్టపోరు పిట్టపోరు పిల్లితీరుస్తుంది. హర్యానాలో స్థానిక అభివృద్ధి అంశాలే ఎన్నికలలో వినిపించాయి కానీ,

> బీజేపీ ప్రతివ్యూహాన్ని అర్థం చేసుకోలేకపోవడం, సృజనాత్మకమైన పద్ధతులతో ప్రచారం నిర్వహించకపోవడం, సంప్రదాయ నాయకత్వాన్నే పూర్తిగా విశ్వసించడం కాంగ్రెస్‌ను దెబ్బతీశాయి. తన పునరుజ్జీవనంలో హర్యానా ఒక కీలకమయిన, ఆవశ్యకమైన మజిలీ అన్న స్పృహ కాంగ్రెస్ పెద్దలకు లేకపోవడం అన్నిటికంటె ఎక్కువ చేటు చేసింది.

మహారాష్ట్రలో మత ఉద్రిక్తతల పాత్ర చాలా ఉంటుంది. మహారాష్ట్ర ఎన్నికల పోరాటానికి సన్నాహకాలుగా, ప్రభావ ప్రేరకాలుగా ఆ రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగానూ మత హింస జరగడాన్ని గమనించవచ్చు. మరో పక్క, మహాయుతి కూటమిలో కూడా నాయకత్వ పోటీ ఉన్నది. షిండేను తప్పించి, తమ వాడిని ముఖ్యమంత్రిని చేయాలని బీజేపీ ఆలోచన. లోక్‌సభ ఎన్నికలలో ఎదురుదెబ్బ దృష్టిలో పెట్టుకుని, నాయకత్వ సమస్యను ఎన్నికల తరువాతకి వాయిదా వేసింది. అగాఢీ కూడా అదే పనిచేయబోతోంది. బీజేపీ గనుక మహారాష్ట్రలో గట్టెక్కగలిగితే, ఆ పార్టీ మొన్నటి లోక్‌సభలో తగిలిన దెబ్బ నుంచి గణనీయంగా కోలుకున్నట్టే. అదే జరిగితే తన భవిష్యత్తేమిటో కాంగ్రెస్ ఊహించుకోవాలి.

అధికారంలో ఉన్నా లేకపోయినా, అంతః కలహాలు మాత్రం పుష్కలం. బరి గీసి నిలవవలసిన చోట, గురికి జానెడు దూరం ఆ పార్టీ ప్రస్తుత సరళి. విధాన విషయాలలో బీజేపీని అనుకరించే ధోరణి. పదేళ్ల ప్రవాసంలో పెరిగిన అలసత్వం.. తన బాధ్యతా రాహిత్యానికి ఈవీఎం లనో, ఎంఐఎంనో నిందించడం, ఇన్ని జబ్బులు కాంగ్రెస్‌ను బాధిస్తున్నాయి. అసదుద్దీన్ ఒవైసీ వేసిన ప్రశ్న బాగుంది. "జమ్ములోను, హర్యానాలోను మేము పోటీ చేయలేదు కదా? అయినా కాంగ్రెస్ గెలవలేదేమి?"

వగరు జ్ఞాపకాల నవ్వు

'వగరు జ్ఞాపకాల నవ్వు' విమల కవిత్వం సభ ఈ నెల 20వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 8:30 వరకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరుగుతుంది. కాలం గుండె చప్పుడు ఆధ్వర్యంలో సుధా కిరణ్ అధ్యక్షతన జరిగే ఈ సభలో కె.శ్రీనివాస్, కాత్యాయని ప్రసంగిస్తారు. అనంతరం ఖాదర్ మొహియుద్దీన్, మెర్సి మార్గరెట్, ఊర్మిళ (శోభా భట్), తాడి ప్రకాష్‌లు విమలతో 'వగరు జ్ఞాపకాల నవ్వు', ఇతర సంబంధిత అంశాలపై సంభాషిస్తారు. అనంతరం చిందు సంస్థ చేత 'కవిత్వ నృత్య ప్రదర్శన', కవిత్వ వీడియో ప్రదర్శన ఉంటుంది.

– మైత్రి శ్రీను

మెట్ట ప్రాంత ప్రజల ఆశలు నెరవేరేనా?

> కూటమి ప్రభుత్వ పాలన మొదలై మూడు నెలలు దాటినా రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల గురించి ఆశించిన మేరకు స్పందన లేదనే అసంతృప్తి సీమలో లేకపోలేదు. చంద్రబాబు నాయుడు తన హయాంలో సీమ వాసుల ఆకాంక్షలకు అనుగుణంగా పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం తుది దశకు తీసుకురాగలిగితే సీమ బిడ్డగా ఆయన జీవితం ధన్యమౌతుంది. విశ్లేషకుల అంచనాలకు కూడా అందని ఓటర్లిచ్చిన విలక్షణమైన తీర్పుకు సార్థకత ఏర్పడుతుంది.


స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా అవశేష ఆంధ్రప్రదేశ్‌లో ఈనాటికి ప్రాంతీయ అసమానతలు ఉన్నాయి. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నాయి. తుదకు రాష్ట్ర విభజన చట్టం కూడా దీనికి రాజముద్ర వేసింది. జగన్మోహన్‌రెడ్డి గత అయిదేళ్ల కాలంలో ప్రాంతీయ అసమానతల నిర్మూలన పేరుతో మూడు రాజధానుల సిద్ధాంతం తెర మీదకు తెచ్చి ప్రాంతీయ భావోద్వేగాలు, విద్వేషాలు మరింతగా పెంచారు తప్ప, వెనుకబడిన ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక, భౌతిక రంగాల్లో అభివృద్ధి ఏ మాత్రం సాధించలేదు. జగన్మోహన్‌రెడ్డి అమలు జరిపిన సంక్షేమ పథకాలే ప్రాంతీయాభివృద్ధిని సాధించివుంటే గత అయిదేళ్ల కాలంలో (బటన్ నొక్కి పంచిన) అమలు జరిపిన సంక్షేమ నిధులతో రాయలసీమలో వలస బతుకులు నివారింపబడి ఉండాలి. శ్రీకాకుళం జిల్లా నుంచి మత్స్యకారులు చేపలవేటకు గుజరాత్‌కు వెళ్లే దుస్థితి ఉండేది కాదు. తత్ఫలితంగానే మొన్నటి ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. ఈ అనుభవం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి గుణపాఠంగా ఉండాలి.

కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సాధించే క్రమంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో సమానంగా పురోగతి సాధించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా నిధులు కోరే ముఖ్యమంత్రి, రాష్ట్రంలో కూడా వెనుకబడిన జిల్లాలు అభివృద్ధి చెందిన జిల్లాలతో సమంగా పురోగతి సాధించేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రత్యేక దృష్టి సారించినపుడే ప్రాంతీయ అసమానతల నిర్మూలన సాధ్యమౌతుంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు తన శాఖలో సమీక్ష సందర్భంగా ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పథకాలు పూర్తి చేస్తామని ప్రకటించారు. వాస్తవం చెప్పాలంటే ఏ ప్రభుత్వమైనా కొత్తగా అధికారం చేపట్టినపుడు ఇదే చెబుతుంది. గతంలో జగన్మోహన్‌రెడ్డి కూడా అమలు జరపకున్నా ఇదే చెప్పారు. ఏ ప్రభుత్వమైనా వెనువెంటనే ఫలితాలు వచ్చే పథకాలను చేపడుతుంది. 70, 50 శాతం పనులు పూర్తయిన పథకాలకు ప్రాధాన్యత ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఇది కొంత మేరకు సబబే. పైగా ఈ సూత్రం మేరకు తీసుకున్నా మెట్ట ప్రాంతమైన రాయలసీమకు చెందిన పలు పథకాలు తుది దశలో ఉన్నాయి. గాలేరు–నగరి రెండవ దశ, వెలిగొండ, హంద్రీ–నీవా లాంటి పథకాలు ప్రాధాన్యతా క్రమం జాబితాలోనే ఉంటాయి. ఉత్తరాంధ్రకు చెంది వంశధార–నాగావళి అనుసంధానం, మహేంద్ర తనయ ఈ క్రమంలో ఉంటాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమలో ఓనమాలు దిద్దుకొని ఇంతింతై వటుడింతై అన్నట్టు ఉన్నత స్థితికి వచ్చిన నేత. రాయలసీమ బతుకు వెతుకులాట బాగా తెలిసిన నేత. అయితే ఎవరు ఎన్ని భాష్యాలు చెప్పినా ఈ రోజుకూ మెట్ట ప్రాంతాల్లో ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయాధారంగా బతుకు వెళ్లదీస్తున్నారు.

రాయలసీమ ప్రజలు వలసలు పోయి కండలు కరిగించి బతుకు వెళ్లదీసే బదులు అవసరమైన సాగునీరు అందిస్తే పుట్టిన గడ్డలోనే కండలు కరిగించి బంగారం పండించగలరు. ఈ అంశం జగన్మోహన్‌రెడ్డికి లాగా చంద్రబాబుకు తెలియదని భావించలేం. పైగా రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజల మనోభావాలు, డిమాండ్లు, ఆశలు, ఆకాంక్షలు తుదకు ఆహారపు అలవాట్లు ఒకటిగా లేవు. కోస్తా జిల్లాల్లో పంట కాలువల్లో గుర్రపుడెక్క తొలగించాలని, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని లేకపోతే పంటకు హాలిడే (చేసి వున్నారు) ప్రకటిస్తామని, ఆక్వా రంగానికి మరిన్ని రాయితీలు కావాలని కోరుతుంటారు. కానీ రాయలసీమ, ఉత్తరాంధ్ర పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. రాయలసీమలో పంట కాలువలే లేవు. క్రాప్ హాలిడే అనే మాటకు చోటెక్కడిది? నైరుతి రుతుపవనాల కాలంలో పదిహేను రోజులు వర్షాభావం ఏర్పడితే ఎప్పుడూ క్రాప్ హాలిడేనే. వర్షాధార పంటల సాగు జూదంలా మిగిలింది. రాయలసీమలో ఈనాటికీ సాగునీటికి కాదు కదా తాగునీటికి కూడా కటకటలాడవలసి ఉంది.

కోస్తా జిల్లాల్లో సంక్రాంతి పండుగ ముందు నెలల్లో సగటు మనిషి కోడి పందేలకు అవసరమైన కోడి పుంజుల పెంపకం లేదా క్యాసినోల నిర్వహణ సన్నాహాల్లో బిజీగా ఉంటే, పండుగ పూటైనా ఆనందంగా గడిపేందుకు రెండు మూడు నెలల ముందు నుండే రాయలసీమలోని కుటుంబాలు బెంగళూరు, తదితర పట్టణ ప్రాంతాలకు వలస పోతారు. పండుగ పూట సరదాగా ఉండేందుకు, నాలుగు రాళ్లు సంపాదించుకొని తిరిగొచ్చే హడావుడిలో ఉంటున్నారు. ఈ దుస్థితికి రాయలసీమ వాసులు కోస్తా జిల్లాల వాసులను చూసి అసూయపడటం లేదు. తాము కూడా రాష్ట్రంలో అభివృద్ధి చెందిన జిల్లాల ప్రజలలాగా తలెత్తుకు తిరగాలని అభిలషిస్తున్నారు.

రాయలసీమలో విస్తారంగా ఉండే బీడు పొలాలకు అవసరమైన సాగునీరు అందిస్తే బంగారం పండించే కండబలం సీమ రైతులకు ఉంది. వ్యవసాయం కుదుటపడితే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లభిస్తుంది. వ్యవసాయం కుదుటపడాలంటే పుష్కలంగా సాగునీరు కావాలి. అదే జరిగితే భూమి లేని వారికి కూడా గ్రామాల్లోనే ఉపాధి కలుగుతుంది. మెట్ట ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై గంపెడాశలు పెట్టుకొని మొన్నటి ఎన్నికల్లో ఏకపక్షంగా తీర్పు ఇచ్చారు. ఈ అయిదేళ్ల కాలంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే చంద్రబాబు చరిత్ర సృష్టించినవారౌతారు.



విశాఖ రాజధాని చేస్తానని జగన్మోహన్‌రెడ్డి ఊరించినందుకు రెండు స్థానాలతో సరిపెట్టిన ఉత్తరాంధ్ర ప్రజలు, చంద్రబాబుపై ఎంతో నమ్మకం పెట్టుకోనిదే ఈ తీర్పు సాధ్యం కాదు. ఉత్తరాంధ్రలో ఈ రోజుకీ అత్యధిక జనాభా వ్యవసాయాధారంగా బతుకు వెళ్లదీస్తున్నారు. విస్తారమైన తీర ప్రాంతమున్నా ఎందుకూ కొరగాకుండా ఉంది. రాయలసీమతో పోల్చుకొంటే ఉత్తరాంధ్రలో వర్ష పాతం ఎక్కువ. పడిన వర్షపు నీరు సముద్రం పాలౌతోంది. ఇక్కడున్న మధ్యతరహా ప్రాజెక్టులు అధ్వాన స్థితిలో ఉన్నాయి. వీటిలో ఈ అయిదేళ్ల కాలంలో తట్టెడు మట్టి పడలేదు. వాస్తవం చెప్పాలంటే ఉత్తరాంధ్రకు చెంది ఇదొక ట్రాన్సిట్ పీరియడ్. పరిశ్రమలు అవసరమే. ముందుగా వ్యవసాయం కుదుటపడితే గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాలు ఆర్థికంగా తట్టుకొని నిలబడి పిల్లలను చదివిస్తారు. పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తే, యువత స్థానికంగా తయారవుతారు. లేకుంటే పరిశ్రమల్లో వాచ్‌మెన్ ఉద్యోగాలే గతి.

ఉత్తరాంధ్రకు ఒకింత భిన్నమైనది రాయలసీమ. వర్షపాతం తక్కువ. మరీ ఈ సంవత్సరం రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాల్లో కరవు మేఘాలు కమ్ముకొస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేతికొచ్చే దశలో నీటి లభ్యత లేకుండా పంటలు దెబ్బ తింటున్నాయని రైతులు ఆందోళనతో ఉన్నారు. రాయలసీమలోని ఇతర జిల్లాలతో పోల్చుకొంటే ఎప్పుడూ మెరుగ్గా ఉండే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. కాగా రాయలసీమలో భావోద్వేగాలు ఇంకా వీడలేదు. అయితే జగన్మోహన్‌రెడ్డి నమ్మించి మోసం చేసినందున, మొన్నటి ఎన్నికల్లో ఏకపక్షంగా తీర్పు ఇచ్చారు.

పట్టిసీమ ద్వారా గోదావరి జలాలతో రాయలసీమ పొలాలను తడిపానని 2014–19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనను అప్పట్లో సీమ వాసులు నమ్మలేదు. లేకుంటే 2019 ఎన్నికల ఫలితాలు అలా ఉండేవి కావు. చంద్రబాబు ఈ అంశం సదా విస్మరించ కూడదు. మొన్నటి ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతిపక్ష నేతగా ఆయన అమరావతి రాజధాని గురించి రాయలసీమలో కూడా నొక్కి చెప్పారు. అయినా ఎన్నికల ఫలితాలపై భావోద్వేగాలేవీ పని చేయలేదు. జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన ద్రోహం మరచిపోలేక ఈ దఫా అయినా చంద్రబాబు పాలనలో తమ చిరకాల వాంఛ, ఆకాంక్ష నెరవేరక పోతాయా అనే ఆశతో కూటమికి పట్టం గట్టారు. ఇందుకు మూల హేతువు లేకపోలేదు. సీమ సగటు వాసులను నిద్రలో లేపినా 'నీళ్ల నీళ్ల' అంటూ కలవరిస్తారు. తరతరాలుగా నీళ్లకు మొహం వాచిపోయిన సగటు సీమ ప్రజలు నాయకులతో నిమిత్తం లేకుండా విలక్షణమైన తీర్పు ఇచ్చారు. కూటమి ప్రభుత్వ పాలన మొదలై మూడు నెలలు దాటినా రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల గురించి ఆశించిన మేరకు స్పందన లేదనే అసంతృప్తి సీమలో లేకపోలేదు. చంద్రబాబు నాయుడు తన హయాంలో సీమ వాసుల ఆకాంక్షలకు అనుగుణంగా పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం తుది దశకు తీసుకురాగలిగితే సీమ బిడ్డగా ఆయన జీవితం ధన్యమౌతుంది. విశ్లేషకుల అంచనాలకు కూడా అందని ఓటర్లిచ్చిన విలక్షణమైన తీర్పుకు సార్థకత ఏర్పడుతుంది.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు


ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

గురువారం 17 అక్టోబరు 2024





- ప్రత్యేక కథనం 8లో

ఒత్తిడే

విద్యార్థులపై పెరుగుతున్న చదువు భారం

- పగలంతా తరగతులు.. రాత్రయితే వర్కులు
- విశ్రాంతి లేక అల్లాడిపోతున్న విద్యార్థులు
- ఒత్తిడి, నిద్రలేమితో విద్యార్థుల అవస్థలు
- సైకాలజిస్టులకు పెరుగుతున్న కేసులు

పోటీ.. పోటీ.. పోటీ.. ఈ పేరుచెప్పి కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఇలాగే పిండేస్తున్నాయి. ఒత్తిడిని పెంచేస్తున్నాయి. ఫలితంగా చిన్న వయస్సులోనే చాలామంది మానసిక సమస్యలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో నగరంలో సైకాలిజిస్టుల వద్దకు వెళ్తున్న కేసుల్లో విద్యార్థులే ఎక్కువగా ఉండటం భయాందోళనకు గురిచేస్తోంది. భావిభారత పౌరుల భవితను ప్రశ్నార్థకం చేస్తోంది.

- చిట్టినగర్‌కు చెందిన ఓ విద్యార్థిని బెంజిసర్కిల్ సమీపాన ఉన్న ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతోంది. రాత్రి 7 గంటల వరకు కళాశాలలో ప్రత్యేక తరగతులు ఉంటాయి. ఇంటికి వెళ్లాక భోజనం చేసి 8 గంటలకు హోంవర్క్ మొదలు పెడుతుంది. ఆ వర్క్ పూర్తి చేయడానికి రాత్రి ఒంటిగంట అవుతుంది.
- కృష్ణలంకకు చెందిన ఓ విద్యార్థి వన్‌టౌన్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నాడు. రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకుంటాడు. భోజనం చేశాక 8 గంటలకు పుస్తకాలు పట్టుకుంటాడు. పేజీలకొద్దీ రాస్తుంటాడు. హోంవర్క్ పూర్తిచేసుకుని రాత్రి నిద్రపోయే సరికి సమయం 1.30 నుంచి 2 గంటలవుతోంది.

మాకొద్దు సెంట్రల్

..ఆ నియోజకవర్గం అంటేనే మద్యం వ్యాపారుల్లో హడల్

షాపుల ఏర్పాటుకు అనాసక్తి.. తూర్పు, పశ్చిమవైపే మొగ్గు

మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇన్ని రోజులు తెగ ఆరాటపడిపోయిన వ్యాపారులు సెంట్రల్ నియోజకవర్గం అంటే మాత్రం హడలెత్తిపోతున్నారు. సెంట్రల్ కంటే తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోనే షాపులు పెట్టుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. అసలు మద్యం వ్యాపారులు సెంట్రల్ నియోజకవర్గంవైపు ఎందుకు చూడట్లేదు..?, అధికార పార్టీ నేతల కమీషన్లకు భయపడుతున్నారా లేక సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారా..?





కొత్తకిక్కు.. నిడమానూరు స్టాక్ పాయింట్‌లో మద్యం సరుకును దిగుమతి చేస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్‌లో) మద్యం బాటిల్

- సెంట్రల్‌లో అధికార పార్టీ కమీషన్లే ప్రధాన కారణం
- మామూళ్లు ఇవ్వాల్సిందేనని వ్యాపారులకు హుకుం
- సెంటిమెంట్‌ను కూడా ఫాలో అవుతున్న వ్యాపారులు
- రూటు మార్చుకుని తూర్పు, పశ్చిమవైపు చూపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరానికి ఎక్సైజ్ శాఖ కేటాయించిన మద్యం షాపులు 39. లాటరీలో షాపులను దక్కించుకున్న వ్యాపారులు నగరంలోని మూడు నియోజకవర్గాల్లో 13 చొప్పున షాపులు ఏర్పాటు చేయాలని భావించారు. ఉన్నట్టుండి వీరంతా కొత్తగా ఒక నిర్ణయానికి వచ్చారు. సెంట్రల్ నియోజకవర్గం మినహా తూర్పు, పశ్చిమలోనే షాపులు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

కారణమేంటి?

సెంట్రల్‌ను కాదని.. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోనే వ్యాపారులు షాపులు ఏర్పాటు చేసుకోవాలనుకోవడం వెనుక ప్రధాన కారణం రాజకీయ నేతల కమీషన్లే. సెంట్రల్‌లో కొంతమంది అధికార పార్టీ నేతలు షాపులు దక్కించుకున్న వ్యాపారులకు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నారని సమాచారం. నెలవారీగా కమీషన్లు ఇవ్వాల్సిందేనని షరతులు విధిస్తుండటంతో ఈ నియోజకవర్గంలో షాపులు ఏర్పాటు చేసుకుందామని భావించిన వ్యాపారులు రూటు మార్చుకున్నారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. అలాగే, మద్యం షాపుల యజమానులు మరో సెంటిమెంట్‌ను కూడా ఫాలో అవుతున్నారు. సాధారణంగా ఏదైనా ఇల్లు కొనాలన్నా, అద్దెకు తీసుకోవాలన్నా తూర్పు, పశ్చిమవైపు ఉన్న గుమ్మాలు చూసుకుంటారు. మద్యం వ్యాపారులు కూడా ఇదే సెంటిమెంట్‌ను పాటిస్తున్నారు. అందులో భాగంగానే లాటరీలో నూతనంగా మద్యం దుకాణాలను దక్కించుకున్న వారంతా తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలను ఎంపిక చేసుకుంటున్నారు.

మిగతా 8లో..

తూర్పు, పశ్చిమలో పెరిగిన పోటీ

సెంట్రల్‌లో ఉండాల్సిన వ్యాపారులంతా తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు రావడంతో ఈ రెండుచోట్లా పోటీ బాగా పెరిగింది. మొన్నటి వరకు సెంట్రల్‌లో ఉంటామని చెప్పినవారు తూర్పు, పశ్చిమలో షాపులు ఏర్పాటు చేయాలని భావిస్తుండటంతో ఇప్పటికే అక్కడున్నవారు అభ్యంతరం చెబుతున్నారు. తాము నిర్ణయించుకున్న ప్రాంతాల్లో షాపులు ఏర్పాటు చేస్తే ఇద్దరికీ వ్యాపారం ఉండదంటున్నారు. కానీ, సెంట్రల్ నియోజకవర్గంలో తాము షాపులు పెట్టలేమని, పశ్చిమ, తూర్పులో ఎక్కడైనా ఓకే అని కొందరు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇంకా ప్రొవిజనల్ లైసెన్స్ పొందడానికి వారం గడువు ఉంది. బుధవారమే షాపులు తెరుచుకున్నా.. వారంలో బ్యాంకు గ్యారెంటీలు, డాక్యుమెంట్లను ఎక్సైజ్ శాఖకు అందజేయాలి. వాటితో పాటు షాపు ఏర్పాటు చేయబోయే ప్రదేశాన్ని చూపించాలి. ఇవన్నీ సక్రమంగా ఉంటే ఎక్సైజ్ అధికారులు ఏడాది కాలానికి పర్మినెంట్ లైసెన్స్ ఇస్తారు. షాపులు దక్కాయన్న ఆనందంలో ఉన్న వ్యాపారులకు తాజాగా ఈ నియోజకవర్గాల గొడవ తలనొప్పిగా మారింది.



కూలిన గోడ



ధ్వంసమైన కార్లు

గవర్నర్‌పేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గోపాల్‌రెడ్డి రోడ్డులోని ఓ హాస్టల్ గోడ బుధవారం ఉదయం ఒక్కసారిగా కూలింది. గోడ శిథిలాలు పడి ఆ పక్కనే నిలిపి ఉంచిన కార్లు ధ్వంసమయ్యాయి. న్యాయస్థానాల సముదాయానికి కొంతదూరంలో మహిళా ఉద్యోగుల హాస్టల్, బాలల సదన్ భవనం ఉన్నాయి. దీని ప్రహరీ రోడ్డు వైపునకు ఉంటుంది. ఆ పక్కనే కోర్టులకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారుల కార్లు, ద్విచక్ర వాహనాలు నిలుపుకొంటారు. ఉదయం ఒక్కసారిగా ప్రహరీ కూలడంతో ఐదు కార్లు ధ్వంసమయ్యాయి. వర్షాలకు ఈ గోడ బాగా నాని కూలిపోయి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఆ సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

జిల్లా సేనానిగా సామినేని



విజయవాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ఖరారు చేస్తూ జనసేన పార్టీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఉదయభాను ఉమ్మడి రాష్ట్రంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా పనిచేశారు. తర్వాత వైసీపీలోకి వెళ్లి 2019 నుంచి 2023 వరకు ఎమ్మెల్యేగా వ్యవహరించారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో ఆయన వైసీపీని వీడి జనసేన కండువా కప్పుకొన్నారు. కాపు సామాజికవర్గంలో ముఖ్యనాయకుడిగా ఉన్న ఉదయభానుకు జనసేన జిల్లా బాధ్యతలను అప్పగించింది. ఇంకా విజయవాడ నగర అధ్యక్షుడ్ని ప్రకటించాల్సి ఉంది.



కలెక్టర్ సృజన రిలీవ్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- కలెక్టర్‌గా వచ్చి మూడు నెలలు
- వరదల వేళలో చక్కటి పనితీరు
- డీవోపీటీ ఆదేశాలతో తెలంగాణాలో రిపోర్టు చేసిన కలెక్టర్
- ఇన్‌చార్జి కలెక్టర్‌గా నిధిమీనా
- కొత్త కలెక్టర్‌గా కృతికా శుక్లా వచ్చే చాన్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : స్థానికత వివాదం నేపథ్యంలో కలెక్టర్ సృజనను ప్రభుత్వ బుధవారం రాత్రి రిలీవ్ చేసింది. డీవోపీటీ ఇచ్చిన ఆదేశాలపై క్యాట్‌కు వెళ్లినా ప్రయోజనం లేకపోవటంతో అంతిమంగా కలెక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా కేసును కొట్టేయటంతో తప్పని పరిస్థితుల్లో సృజన తెలంగాణాలో రిపోర్టు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఆమెను రిలీవ్ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్టీఆర్ జిల్లాకు కలెక్టర్‌గా సృజనను నియమించారు. జూలై 26న ఆమె బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌గా మూడు నెలలు పనిచేశారు. వచ్చీ రాగానే జగ్గయ్యపేటలో డయేరియా, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ ప్రమాదం, పరిటాల క్వారీలో కొండచరియల

మిగతా 8లో..

పెద్ద కాంట్రాక్టర్ల జపం



జల్ జీవన్ మిషన్ పనులు కట్టబెట్టేందుకు ప్రయత్నం

ఆర్‌డబ్ల్యూఎస్ తీరుపై చిన్న కాంట్రాక్టర్ల ఆగ్రహం • కమీషన్ల కోసమేనంటూ అధికారులపై ఆరోపణలు

ఆర్అండ్‌బీ అనుభవాలను పరిగణనలోకి తీసుకోవడంలేదని విమర్శలు

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో వాటర్ గ్రిడ్, దాని అనుసంధాన పనులను బడా కాంట్రాక్టర్లకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ ఉన్నతాధికారులతో పాటు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖలోని ఉన్నతాధికారులు ఈ వ్యవహారంలో చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. జల్‌జీవన్ మిషన్- 2024-25లో చేపట్టే పనులతో పాటు 2023-24లో మిగిలిపోయిన పనులకు సంబంధించి టెండర్లు పిలిచే క్రమంలో ఉన్నతాధికారులు ఈ ఆలోచన చేయడం తీవ్ర వివాదానికి దారి తీస్తోంది. అధికారుల తీరుపై చిన్న కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి ఆర్అండ్‌బీలో జరిగిన అనుభవాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా విభాగంలో జల్ జీవన్ మిషన్- 2024 - 25లో చేపట్టే పనులతో పాటు, 2023-24లో మిగిలిపోయిన పనులకు సంబంధించి అధికారులు టెండర్లు పిలవనున్నారు. మంచినీటి వనరులు ఉన్నచోట వాటర్ గ్రిడ్స్‌ను ఏర్పాటు చేయటంతో పాటు ఇక్కడి నుంచి మెయిన్ పంపింగ్ లైన్స్, గ్రామాలకు డిస్ట్రిబ్యూషన్ లైన్స్, అంతర్గత పైపులైన్ల నుంచి కుళాయి కనెక్షన్లు ఇచ్చే వరకు అన్ని పనులను పెద్ద కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుత విభజిత జిల్లాలను యూనిట్‌గా తీసుకుని ఒక జిల్లాకు ఇద్దరేసి పెద్ద కాంట్రాక్టర్లకు ఈ పనులను గంపగుత్తుగా అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై కృష్ణాజిల్లాకు చెందిన చిన్న కాంట్రాక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణాలో బెడిసికొట్టినా!

తెలంగాణప్రభుత్వం చేపట్టిన మోడల్‌ను ఇక్కడ అమలు చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ విధానం అక్కడ బెడిసికొట్టడంతో చివరికి విధిలేని పరిస్థితుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. టెండర్లలో ఎవరైనా పాల్గొనవచ్చని.. బడా కాంట్రాక్టర్లకే పరిమితం చేయడం వెనుక కమీషన్ల దందా నడిచిందని చిన్న కాంట్రాక్టర్లు ఆరోపణలు సంధిస్తున్నారు. పెద్ద కాంట్రాక్టర్లు పనులు దక్కించుకుని పనులు చేయరని, వారు తిరిగి సబ్‌లీజులకు ఇస్తారని.. సబ్ లీజులకు తీసుకునేది చిన్న కాంట్రాక్టర్లేనని చెబుతున్నారు. పెద్ద కాంట్రాక్టర్లు వారి స్థాయికి సరిపోని పనులను సబ్ లీజులకు ఇచ్చి డబ్బులు ఎగవేయడం వల్ల ఇప్పటికే అనేక మంది నష్టపోయి ఉన్నారని, తామెవరం సబ్‌లీజులు తీసుకునేది లేదని చెబుతున్నారు. ఈ ఇబ్బందులన్నీ లేకుండా అందరికీ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఏకపక్షంగా వ్యవహరించడంపై

మిగతా 8లో..

కాలుష్యరహిత నగరం కోసం ఏం చేద్దాం

- నిపుణులతో వీఎంసీ కమిషనర్ సమావేశం

8లో

జిల్లాలో కొత్త రేషన్ దుకాణాలు

- 80 కొత్త చౌక దుకాణాలు కేటాయింపు
- విజయవాడ డివిజన్‌కే 61..

మల్లవల్లికి మంచిరోజులు



- పాత రేట్లకే ప్లాట్ల కేటాయింపునకు సర్కారు ఆమోదం
- సమస్యలు తొలగిపోవడంతో పారిశ్రామికవేత్తల హర్షం

మల్లవల్లి పారిశ్రామికవాడకు గుడ్‌న్యూస్. ఈ మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో నెలకొన్న సమస్యలపై ఏపీఐఐసీ ప్రతిపాదించిన ప్రణాళికను ప్రభుత్వం ఆమోదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద ఈ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1,000 కోట్ల రుణానికి ప్రభుత్వం హ్యాండ్ హోల్డింగ్‌కు ఏపీఐఐసీ చేసిన ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది.

6లో



దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు

మొదటిరోజు లెక్కింపులో భారీగా నగదు, బంగారం

8లో

నేడు ఆదిదంపతుల గిరిప్రదక్షిణ



నీటి నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది, ల్యాబ్‌లో పరీక్షలు (కింద)

పవన్ కల్యాణ్ ఆదేశాలు.. వెంటనే కదిలిన అధికారులు!

- 43 గ్రామాల్లో నీటి నమూనాల సేకరణ
- పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలింపు
- నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు : వెనిగండ్ల



గుడివాడ/గుడ్లవల్లేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగలో భాగంగా నీటి సమస్య పరిష్కారానికి అధికారులు నడుం బిగించారు. నియోజకవర్గంలో 43 గ్రామాల్లో రక్షిత నీటి పథకాల దుస్థితిని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉపముఖ్యమంత్రి పవన్‌కు వివరించారు. తక్షణమే ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటిసరఫరా విభాగ అధికారులను పవన్ ఆదేశించారు. 24 గంటలు గడవక ముందే అధికారులు రంగంలోకి దిగారు. నియోజకవర్గ పరిధిలోని గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లోని 43గ్రామాల్లో తాగునీరు రంగుమారింది. పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో బుధవారం ఆయా గ్రామాల ఇంజినీరింగ్ సిబ్బంది ఆరు బృందాలుగా గ్రామాల్లో నీటి నమూనాలను సేకరించారు. అదే విధంగా తాగునీటి సమస్యపై ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించారు. సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు తరలించి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తా : ఎమ్మెల్యే వెనిగండ్ల

ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత పథకాల ద్వారా సరఫరా అవుతున్న నీరు రంగుమారి దుర్గంధం వెదజల్లుతున్నట్టు తన దృష్టికి ప్రజలు తెచ్చారన్నారు. నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తానని నాడు హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఇదే విషయం ఉపముఖ్యమంత్రి పవన్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలివ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

నేటికి పూర్తిస్థాయి నివేదిక : ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్

పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు 43 గ్రామాల్లో తాగునీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌ల్లో పరీక్షిస్తున్నామని, గురువారం నాటికి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. మూడేళ్లుగా రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు చేపట్టలేదని, ఫిల్టర్ బెడ్‌లు పూర్తిగా పాడైపోయాయని దీంతో నీటిని శుద్ధి చేయలేకపోతున్నాయన్నారు. ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులకు రూ.3.30కోట్ల అంచనాలతో ప్రణాళికలను ఉన్నతాధికారులకు పంపించినట్టు గ్రామీణ నీటిసరఫరా శాఖ ఈఈ నటరాజ్ పేర్కొన్నారు.



సీసీ రోడ్లు పనులకు భూమిపూజ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్

పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధికి కృషి

- చల్లపల్లి పల్లె పండుగలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలో పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధికి కృషిచేస్తానని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గ్రామంలో రూ.1.27 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం అగ్రహారంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐదేళ్లలో చల్లపల్లిలో నూరుశాతం సీసీ రోడ్ల నిర్మాణానికి కృషిచేస్తానన్నారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కృషిచేస్తున్నట్టు తెలిపారు. ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలియజేయాలని పార్టీ శ్రేణులను కోరారు. గుల్లలమోదలో క్షిపణి పరీక్ష కేంద్రం నిర్మాణం ప్రారంభమైతే అనుబంధంగా వచ్చే పరిశ్రమలు చల్లపల్లిలో ఏర్పాటుచేసేలా కృషిచేస్తానన్నారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీడీవో ఏవీ రమణ, డీఈఈ పి.సురేష్‌బాబు, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఆసుపత్రి డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



కోచింగ్ సెంటరు ప్రారంభోత్సవంలో మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

విజయవాడలోనే సివిల్స్‌కు శిక్షణ

పెనమలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సివిల్స్ శిక్షణకు దూరప్రాంతాలకు వెళ్లకుండా విజయవాడలోనే శిక్షణ అందుబాటులో ఉండటం సంతోషకరమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం కానూరు టైమ్ ఆసుపత్రి సమీపంలోని ప్రతిభ సివిల్స్ అకాడమీని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు. మంచి శిక్షణతో విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టాలని అకాడమీ డైరెక్టర్ జంపాన సుధాకర్‌కు సూచించారు. కొనకళ్ల మాట్లాడుతూ, గత 20ఏళ్లుగా సుధాకర్ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టారని కొనియాడారు. డైరెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ, ఇంటర్, డిగ్రీ స్థాయిలోనే సివిల్స్ కోచింగ్ ఇవ్వడం వల్ల విద్యార్థులు సులభంగా సివిల్స్‌లో విజయం సాధించడం వీలవుతుందన్నారు. సివిల్స్ శిక్షణతో పాటు అకాడమీలో ఆటలు, యోగా, ధ్యానం, మోటివేషన్ క్లాసులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రొఫెసర్ సూర్యచంద్రరావు, రిటైర్డు ఐఏఎస్ అధికారి అశోక్, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

పెడన రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెడన తోటమూల సెంటర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించగా, మరొకరికి గాయాలయ్యాయి. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిపై జంషెడ్‌పూర్ నుంచి చెన్నై మోటారు స్పేర్స్‌తో వెళుతున్న లారీ తోటమూల జంక్షన్ వద్ద వేకువజామున ముందున్న లారీ సడన్‌బ్రేక్ వేయటంతో ముందుభాగం నుజ్జు నుజ్జయి కో-డ్రైవర్ వారాల వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ నిమ్మగడ్డ రామచంద్రయ్యకు స్వల్పగాయాలయ్యాయి. వెంకన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన మోత్కూరు గ్రామ వాసిగా పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంకన్న కుమారుడు పృథ్వీరాజ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.సత్యనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మల్లవల్లికి మంచిరోజులు

- పాత రేట్లకే ప్లాట్ల కేటాయింపునకు సర్కారు ఆమోదం
- సమస్యలు తొలగిపోవడంతో పారిశ్రామికవేత్తల హర్షం



(అమరావతి, ఆంధ్రజ్యోతి)

మల్లవల్లి పారిశ్రామికవాడకు మంచిరోజులు రానున్నాయి. కృష్ణాజిల్లాలోని ఈ మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో నెలకొన్న సమస్యలపై ఏపీఐఐసీ ప్రతిపాదించిన ప్రణాళికను ప్రభుత్వం ఆమోదించింది. ఈ ఇండస్ట్రియల్ పార్కులో దాదాపు 150 ఎకరాల్లో అందుబాటులో ఉన్న ప్లాట్లను 349 మంది పారిశ్రామికవేత్తలకు పాత ధరల ప్రకారం ఎకరం రూ. 16.50 లక్షలకే కేటాయించాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అంతేకాకుండా స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద మల్లవల్లి పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల కల్పన పనులకు రూ. 1,000 కోట్ల రుణానికి ప్రభుత్వం హ్యాండ్ హోల్డింగ్‌కు ఏపీఐఐసీ చేసిన ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. దీంతో ఏడేళ్లుగా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మల్లవల్లి పారిశ్రామిక పార్కు అభివృద్ధిపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఈ పార్కులో ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలను గత జగన్ సర్కారు వేధింపులకు గురిచేయడంతో వారంతా యూనిట్లు నెలకొల్పకుండా వదిలేశారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు కేటాయించిన ప్లాట్లలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నారు. తమకు కేటాయించిన ప్లాట్లలో యూనిట్లను నెలకొల్పుతామని, గతంలో తమకు కేటాయించిన ప్లాట్లను పాత ధరలకే రిజిస్ట్రేషన్ చేయాలని, పరిశ్రమలు నెలకొల్పేందుకు అనువైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్, ఎస్ఏపీ ఇండస్ట్రియల్ అసోసియేషన్, నవ్యాంధ్ర ఇండస్ట్రీస్ అసోసియేషన్, మల్లవల్లి స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ల ప్రతినిధులు గత మూడు నెలలకు పైగా ప్రభుత్వంతో జరుపుతున్న సంప్రదింపులు ఎట్టకేలకు ఫలించాయి.

ఏడేళ్లుగా అతీగతీ లేక..

రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం కృష్ణా జిల్లా మల్లవల్లిలో బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు (మోడల్ ఇండస్ట్రియల్ పార్కు)ను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. 2017లో దాదాపు 1,350 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పిలుపు మేరకు మల్లవల్లి పారిశ్రామిక పార్కులో భారీ పరిశ్రమలతోపాటు చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పేందుకు అనేక మంది పారిశ్రామికవేత్తలు దరఖాస్తులు చేసుకున్నారు. వారి దరఖాస్తులను పరిశీలించిన ఏపీఐఐసీ అధికారులు అశోక్ లేలాండ్, పార్లే వంటి పెద్ద పరిశ్రమలతో పాటు వందల సంఖ్యలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్లాట్లు కేటాయించారు. అప్పట్లో ఉన్న భూమి విలువ, మౌలిక సదుపాయాల కల్పనకు కలిపి ఎకరానికి రూ.16.50 లక్షలు చొప్పున ఏపీఐఐసీ వసూలు చేసింది. అయితే 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వచ్చీ రావడంతోనే కక్షపూరిత రాజకీయాలకు తెరలేపింది. మల్లవల్లి పార్కులో భూములు కేటాయించిన పారిశ్రామికవేత్తలపై తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులనే ముద్ర వేసి రకరకాలుగా వేధింపులకు గురిచేసింది. ఆ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా వదిలేయడంతో ఆ భూములు నిరుపయోగంగా ఉండిపోయాయి. ఈలోగా ఆ భూములు ఇచ్చిన రైతులు తమకు నష్టపరిహారం చెల్లించలేదంటూ కోర్టుకు వెళ్లారు. మరికొన్ని లిటిగేషన్ భూములున్నాయి. ఈ వివాదాలపై పారిశ్రామికవేత్తలు ఏపీఐఐసీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దాంతో ఆ వివాదాస్పద భూములు తమకు వద్దని, ఎలాంటి వివాదాలు లేని భూములు ఇవ్వాలని పారిశ్రామికవేత్తలు గత ప్రభుత్వాన్ని కోరారు. దాంతో జగన్ సర్కారు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మల్లవల్లి పార్కులో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన భూములను రద్దు చేసినట్లు ఏపీఐఐసీ ద్వారా నోటీసులు ఇప్పించింది. ఆ నోటీసులపై దాదాపు 150 మంది పారిశ్రామికవేత్తలు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ఈ గొడవలన్నీ పడలేక సగం మంది తాము కట్టిన డబ్బు వెనక్కి తీసేసుకున్నారు. మిగిలిన సగం మంది పారిశ్రామికవేత్తలు కట్టిన డబ్బుంతా ఇన్నేళ్లుగా ఏపీఐఐసీ దగ్గరే ఉండిపోయింది. అంటే అప్పట్లో ఎకరం 16.50 లక్షల చొప్పున 150 ఎకరాలకు చెల్లించిన దాదాపు రూ. 25 కోట్లు దాకా ఏపీఐఐసీ దగ్గరే ఉండిపోయింది. వీరిని కూడా ఎలాగైనా తరిమేయాలని భావించిన జగన్ ప్రభుత్వం.. మల్లవల్లి పార్కులో స్థలాల రేట్లను అమాంతం పెంచేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎకరా భూమిని రూ.16.50 లక్షల చొప్పున కేటాయించగా.. జగన్ ప్రభుత్వం అదే భూములకు ఎకరా రూ. 65 లక్షలు చొప్పున కొత్త ధరలు నిర్ణయించింది. ఈ రేటు చెల్లిస్తేనే ఆ భూములను తిరిగి కేటాయిస్తామంటూ ఏపీఐఐసీ ద్వారా మరోసారి నోటీసులు పంపింది. అప్పటికే కోర్టులో కేసులు వేసిన పారిశ్రామికవేత్తలంతా మళ్లీ ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఐదేళ్లూ గడిచిపోయాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయి.. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మల్లవల్లి పారిశ్రామికవాడలో ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలంతా మళ్లీ తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఏడేళ్ల క్రితం మల్లవల్లి పార్కులో తమకు కేటాయించిన ప్లాట్ల విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వ పెద్దలను కలిశారు. వారి అభ్యర్థనలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. వారికి గతంలో కేటాయించిన పాట్లను పాత ధరలకే ఇచ్చేందుకు ఆమోదం తెలపడంతో మల్లవల్లి పార్కులో యూనిట్లు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు సమాయత్తమవుతున్నారు.

18 నెలల్లో యూనిట్లు నెలకొల్పుతాం

జీఎన్‌బీ చౌదరి, మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

"మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ సమస్యలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పారిశ్రామికవేత్తల్లో మళ్లీ నమ్మకం పెరిగింది. ఎంఎస్ఎంఈ రంగం పట్ల, పారిశ్రామికీకరణ పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను స్వాగతిస్తున్నాం. మల్లవల్లి పార్కులో 18 నెలల్లోనే అన్ని యూనిట్లను నెలకొల్పి ఉత్పత్తి ప్రారంభించేలా మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ తరపున చర్యలు తీసుకుంటాం. ఈ పార్కులో 164 ఎకరాల్లో రూ. 1100 కోట్ల పెట్టుబడితో 380 పరిశ్రమలు నెలకొల్పేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉంది.దీని ద్వారా 10,800 మందికి ఉద్యోగాలు లభిస్తాయి" అని మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీఎన్‌బీ చౌదరి తెలిపారు. తమ సంఘ అధ్యక్షుడు కె.సాయికిశోర్‌తో కలిసి బుధవారం సాయంత్రం ఆయన రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌ల దొంగ అరెస్ట్.. రిమాండ్



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లి, విజయవాడ సత్యన్నారాయణపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలను చోరీ చేసిన వ్యక్తిని తిప్పనగుంట వద్ద వీరవల్లి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పలు స్టేషన్ల పరిధిలో నిలిపి ఉంచిన ఐదు బైక్‌లను దొంగిలించిన పొట్రు సాయిశేఖర్ అలియాస్ అయ్య అనే వ్యక్తి తిప్పనగుంట బస్‌స్టాప్ వద్ద ఉండగా వీరవల్లి పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు, విజయవాడ సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైక్, ఏలూరు, మంగళగిరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగిలించిన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వివరించారు. సాయిశేఖర్‌ను నూజివీడు కోర్టుకు హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఇరిగేషన్ కాంప్లెక్స్‌లో మంత్రి అచ్చెన్నకు గృహం కేటాయింపు

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ఇరిగేషన్ కాంప్లెక్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు గృహ వసతిని కల్పిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారంనాడు ఉత్తర్వు జారీ చేశారు. ఇప్పటికే కాంప్లెక్స్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా ఈ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తును కింజరాపు అచ్చెన్నాయుడుకు కేటాయించారు.

గ్లాసు మద్యం ఖరీదు నిండు ప్రాణం

- బార్‌లో మద్యం దొంగిలించాడని మందుబాబుల దాడి
- ఐదుగురిపై కేసు నమోదు.. ఆలస్యంగా వెలుగులోకి ఘటన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం హౌసింగ్ బోర్డులోని బార్‌లో మద్యం గ్లాసును దొంగిలిస్తున్న మందుబాబుపై యువకులు దాడి చేశారు. దీంతో అతడు మృతిచెందాడు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. చిలకలపూడి సీఐ నబి వివరాలు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం వద్ద ఉండి గ్రామానికి చెందిన గోర్ల వెంకటేశ్వరరావు (40) వారం క్రితం భార్యాపిల్లలను విడిచి మచిలీపట్నం వచ్చేశాడు. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో కాలం వెళ్లదీస్తున్నాడు. మద్యానికి పూర్తిగా బానిసైన వెంకటేశ్వరరావు హౌసింగ్ బోర్డు కాలనీలోని బార్‌లో టేబుళ్లపై ఉన్న మద్యం గ్లాసులు తస్కరించి తాగడం మొదలు పెట్టాడు. సోమవారం రాత్రి బార్‌లో కొందరు యువకులు తెచ్చుకున్న మద్యాన్ని సేవించడంతో కోపోద్రిక్తులై వెంకటేశ్వరరావుపై వారు విచక్షారహితంగా దాడిచేశారు. దాడిలో వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంకటేశ్వరరావును 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేశ్వరరావు సోమవారం రాత్రి మృతిచెందాడు. అయితే వెంకటేశ్వరరావును ఉండి గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు బుధవారం వెంకటేశ్వరరావు భార్య చిలకలపూడి స్టేషన్‌కు వచ్చి లబోదిబోమంది. వెంకటేశ్వరరావుకు ఇద్దరు పిల్లలు. వెంకటేశ్వరరావుపై దాడి చేసిన నిందితులను గుర్తించినట్టు సీఐ నబి తెలిపారు. ప్రధాన నిందితుడుగా కిరణ్ పేరును నమోదు చేశారు. దాడి చేసిన వారిలో రాంబాబు, సుబ్బారావు, నాగేశ్వరరావు, నాగరాజులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



మృతుడు గోర్ల వెంకటేశ్వరరావు

అపార్ట్‌మెంట్‌లో అపరిచితుడి హల్‌చల్!

- టీడీపీ నేత కారును అనుసరించి.. రెక్కీగా అనుమానం
- పోలీసులకు అప్పగింత

గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు కారు వెనుక గుర్తుతెలియని వ్యక్తి రెక్కీ నిర్వహించాడు. బుధవారం మండలంలోని సూరంపల్లి, వీరపనేనిగూడెం గ్రామాలకు వెళ్లి మధ్యాహ్నం 3.30 గంటలకు గన్నవరంలోని ఆయన నివాసానికి వచ్చాడు. జాస్తి వెంకటేశ్వరరావు వెనుక మరో కారులో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అక్కడే కూర్చున్నాడు. కొద్దిసేపటి తరువాత గాంధీ బొమ్మ సెంటర్‌లో కిరాణా షాపునకు వెళ్లి సరుకులు కట్టించాడు. వీటిని జాస్తి వెంకటేశ్వరరావు ఉండే అపార్టుమెంట్ వద్దకు తీసుకురావాలని చెప్పారు. వాటిని షాపు వాళ్లు అపార్టుమెంట్ వద్దకు తీసుకువెళ్లి డబ్బులు అడిగారు. తమ కంపౌండర్‌తో ఇచ్చి పంపినట్టు తెలిపాడు. సరుకులను అపార్టుమెంట్‌లోని వాచ్‌మెన్‌కు ఇచ్చి జాస్తి ఈ రాత్రికి వైజాగ్ వెళుతున్నారని సరుకులను పైన పెట్టమని చెప్పాడు. వాచ్‌మెన్‌కు అనుమానం రావటంతో ఎవరు ఏమిటని నిలదీశాడు. ఏమీ చెప్పకుండా మంచినీళ్లు అడిగాడు. వాచ్‌మెన్ మంచినీళ్లు తెచ్చేందుకు వెళ్లగానే అపార్టుమెంట్ పైకి వెళ్లాడు. నాలుగో ఫ్లోర్‌లో వృద్ధురాలు కనిపించటంతో దుప్పటి కప్పుకుని పక్కన నక్కాడు. అతడ్ని చూసి ఎవరు ఎవరు అని ఆమె అరవటంతో పారిపోయేందుకు ప్రయత్నించాడు. అపార్టుమెంట్ వాసులు అతడిని పట్టుకుని గన్నవరం పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు. తన వెనుక ఎందుకు రెక్కీ నిర్వహించాల్సి వచ్చిందో తెలియదని, వైజాగ్ వెళుతున్న విషయం కూడా ఎవరికి చెప్పలేదని అతడికి ఎలా తెలిసిందో అర్థం కావటం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని జాస్తి వెంకటేశ్వరరావు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.



అపార్ట్‌మెంట్ వద్ద గుర్తుతెలియని యువకుడు



జడ్పీ సమావేశాల్లో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు

శివారు గ్రామాల్లో నీటిఎద్దడి నివారించండి

- జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

మచిలీపట్నం,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : శివారు ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధికారులను ఆదేశించారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో జడ్పీ స్థాయి సంఘం సమావేశాలు బుధవారం జరిగాయి. ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, వైద్యం, వ్యవసాయం, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ, జిల్లాలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఫిల్టర్‌బెడ్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రంచేసి స్వచ్ఛమైన తాగునీటిని గ్రామీణప్రాంత ప్రజలకు అందించాలన్నారు. జల్‌జీవన్ మిషన్‌ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం..

జిల్లాలో పక్కాగృహాల పనులను వేగవంతం చేయాలని ఉప్పాలహారిక అన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించి వారిని చైతన్యవంతం చేయాలన్నారు. లేఅవుట్‌లలో తాగునీటి సౌకర్యం, విద్యుత్, డ్రెయిన్‌లు, రహదారులు, మెరకపనులు వంటి కనీస మౌలికవసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్, ఉపాధిహామీ పథకం నిధులతో ఉమ్మడిజిల్లాలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. పూర్తయిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు జడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించడం లేదని పలువురు సభ్యులు చెప్పగా హారిక మాట్లాడుతూ, ఈ అంశంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని, అధికారులు ప్రోటోకాల్‌ను పాటించాల్సిందేనన్నారు. పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ క్యాంపులు నిర్వహించి వారి ఆరోగ్య పరిరక్షణకోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, దీంతో కృష్ణా జిల్లాకు ఉత్తమ అవార్డు వచ్చిందని డీఎంఅండ్‌హెచ్‌వో గీతాభాయి తెలిపారు. బెల్‌కంపెనీ ఇచ్చిన కేన్సర్ స్క్రీనింగ్‌టెస్ట్ పరికరాలతో రానున్న రోజుల్లో గ్రామాలకు వైద్యసిబ్బంది వెళ్లి పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందించామని తెలిపారు. ఇటీవల వరదలు రాగా డ్రోన్లు, బోట్‌ల సాయంతో ఉమ్మడిజిల్లాలో అందరికీ మందులు అందజేశామని, అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టు ఎన్టీఆర్ జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో సుహాసిని తెలిపారు. వరదల సమయంలో అధికారులు చేసిన కృషిని చైర్మన్, సభ్యులు కొనియాడారు. జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డెప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పెసర.. ధర అత్తెసరు!

- ఇంకా ప్రారంభం కాని కొనుగోలుకేంద్రాలు
- నాణ్యత ఉన్నా గిట్టుబాటులేక నష్టపోతున్నరైతులు
- రబీలో పనులకు అప్పు దొరక్క ఇబ్బందులు



బహిరంగ మార్కెట్లో పెసలకు గిట్టుబాటు ధర లభించటం లేదు. మద్దతు ధర కంటే మార్కెట్ ధర చాలా తక్కువగా ఉంది. వ్యాపారులు క్వింటా రూ.7వేలకు మించి కొనటం లేదు. రైతులు క్వింటాకు రూ. 15 వందలకు పైగా నష్టపోతున్నారు. మద్దతు ధర రూ. 8,558లు కావటంతో కొనుగోలు కేంద్రాల కోసం రైతులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

(కంచికచర్ల, ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఏడాది పదివేల ఎకరాలకు పైగా రైతులు పెసర సాగుచేశారు. ప్రారంభంలో వాతావరణం అనుకూలించి పైరు కళకళలాడటంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశించారు. కాపు దిగే తరుణంలో కురిసిన భారీవర్షాలకు చేలు దెబ్బతిన్నాయి. సాధారణంగా ఎకరానికి నాలుగు బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా, ఒకటి రెండు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. నాణ్యతాపరంగా పెసలు బాగున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పెసలకు ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.8,558లు. ఈనెల ప్రారంభం నుంచి ఈ ధర అమల్లోకి వచ్చింది. అయితే పంట చేతికి వచ్చి నెలరోజులు కాగా రైతులు ఇళ్ల వద్ద, మార్కెట్ యార్డులో, గిడ్డంగుల్లో నిల్వచేశారు. బయట మార్కెట్లో ధర ఆశాజనకంగా లేదు. వ్యాపారులు ప్రస్తుతం క్వింటా రూ. 7వేల లోపు మాత్రమే ధర ఇస్తున్నారు. పెసల నాణ్యత బాగున్నప్పటికీ, వర్షాలకు తడిసి ఉంటాయన్న నెపంతో వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. మద్దతు ధరకు, బయటి ధరకు రూ. 1500 పైగా వ్యత్యాసం ఉంది. ఆర్థికంగా వెసులుబాటు లేని రైతులు తప్పనిపరిస్థితుల్లో బయట మార్కెట్లో తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. ఎక్కువ మంది రైతులు కొనుగోలు కేంద్రాల కోసం నిరీక్షిస్తున్నారు. సాధారణంగా అక్టోబరు నెల మొదటివారంలోనే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావాలి. మూడోవారం గడిచిపోతున్నప్పటికీ కొనుగోలు కేంద్రాల జాడ లేదు.

రబీ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు అల్లాడుతున్నారు. అప్పులు కూడా దొరక్క పలు ఇబ్బందులు పడుతున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు తగిన చర్యలు తీసుకున్నట్టుగా కనిపించటం లేదు. ఈ విషయమై స్థానిక మార్కెటింగ్ అధికారులను సంప్రదించగా ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు మద్దతు ధరకు కొన్నట్టయితే కొంత ఉపశమనం కలుగుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈనెల ఒకటి నుంచి పెరిగిన మద్దతు ధర అమల్లోకి వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, పెసలను మద్దతు ధరకు కొనుగోలు చేసి తమను ఆదుకోవాల్సిందిగా రైతులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

లయోలలో గ్లోబల్ ఇంగ్లీష్ ఫెస్ట్- 2024 ప్రారంభం

భారతీనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో ఆంగ్ల భాషతో నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చని శాండ్ స్పేస్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ డైరెక్టర్ అన్నే తులసి అన్నారు. లయోల కళాశాలోని ఈఎల్‌టీ సెంటర్‌లో ఇంగ్లీషు డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఇంగ్లీష్ ఫెస్ట్ -2024 కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నే తులసి హాజరయ్యారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ నేడు అన్ని రంగాలు ఆంగ్ల భాషతో ముడిపడి ఉన్నాయన్నారు. ఈ ఫెస్ట్ రెండు రోజులు పాటు జరుగుతుందని, సృజనాత్మక రచన, పబ్లిక్ స్పీకింగ్, సాహిత్య పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్‌వోడీ ఎన్. రంగబాబు, ఈఎల్‌టీ డైరెక్టర్ డాక్టర్ బి.రాజు, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డి. ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న ఆక్రమణదారులు

- కృష్ణలంక సర్వీసు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ఆక్రమణలు
- 40 అడుగులకు రోడ్డు కుదింపు
- వీఎంసీ, పోలీసు కమిషనర్లు స్పందిస్తేనే సమస్యకు పరిష్కారం

(ఆంధ్రజ్యోతి, కృష్ణలంక)

కృష్ణలంక సర్వీసు రోడ్డు (ఫీడర్‌రోడ్డు)లో ఆక్రమణదారులు పేట్రేగిపోతున్నారు. గతంలో నల్లగేటు సెంటర్ నుంచి ఎం హోటల్ సెంటర్ వరకు 80 అడుగులు వున్న రోడ్డు ప్రస్తుతం 40 అడుగులకు కుచించుకుపోయింది. సర్వీసు రోడ్డుకు రెండు వైపులా ఆక్రమణదారులు కూరగాయల బండ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్స్, పానీపూరీ, కిళ్లీబడ్డీ, మోటారు మెకానిక్, మసాలా బండ్లు, నూడిల్స్ బండ్లు ఇలా రకరకాలుగా ఆక్రమించడమే కాకుండా ఖాళీగా వున్న జాగాలో తమకు చెందిన ఒక తోపుడు బండిని పెట్టి దానిని వేరే వారికి అద్దెకిస్తున్నారు. వీరిని తీసివేసేందుకు పొరపాటున మున్సిపల్, పోలీసు సిబ్బంది వస్తే వెంటనే ఆయా డివిజన్లకు చెందిన వైసీపీ, టీడీపీ నాయకులు వాలిపోతుంటారు. 'ఆక్రమణదారుడు తమ వాడని, ఏదో బండి పెట్టుకొని బతుకుతుంటే మీ హడావిడి ఏంటని' సిబ్బందిని నిలదీస్తుంటారు. అంతటితో ఆగకుండా 'రోడ్డుపైన వున్న ఆక్రమణలన్నింటిని తొలగించి ఆ తర్వాత తమ వద్దకు రమ్మని' సిబ్బందితో ఆక్రమణదారులు రాజకీయ పార్టీల నాయకుల అండచూసుకొని రెచ్చిపోతుంటారు. దీంతో చేసేదిలేక సిబ్బంది వెనుదిరిగి పోతున్నారు. ఇక బీటు పోలీసులైతే ఆక్రమణదారుల నుంచి తమ మామూళ్లు తీసుకొని కామ్‌గా వెళ్లిపోతుంటారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొందరు ఆక్రమణదారులు వ్యాపారాలు చేసుకొంటుండగా, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మరికొందరు ఆక్రమణదారులు తమ వ్యాపారాలు కొనసాగించుకొంటూ పోతున్నారు. పోలీసులు ఎన్నిసార్లు ఆక్రమణలను తొలగించి వాహనాలలో ఎక్కించి తీసుకెళ్తున్నా మళ్లీ నాలుగు రోజుల తర్వాత యథాస్థానంలో తొలగించిన ఆక్రమణలు వెలిసిపోతున్నాయి.

వీరితో పాటు కృష్ణలంక అంతర్గత రోడ్డుల్లో వుండే వారు తమ కార్లను, ఆటోలను సర్వీసు రోడ్డులో హైవే రిటైనింగ్ వాల్‌ను ఆనుకొని పార్క్ చేస్తున్నారు. వీటిని కదపాలన్నా పోలీసులకు తలకు మించిన భారంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, పోలీసు కమిషనర్‌లు స్పందించి సర్వీసు రోడ్డులో ఆక్రమణలకు తావులేకుండా చూడాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.





కృష్ణలంక ఫీడర్‌రోడ్డులో ఇబ్బడి ముబ్బడిగా ఆక్రమణలు

రొమ్ము కేన్సర్‌పై 20న అవగాహన సదస్సు

పటమట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'బ్రెస్ట్ కేన్సర్ అవేర్‌నెస్ మంత్' సందర్భంగా రూట్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమెరికన్ అంకాలజీ సంస్థ సహకారంతో అశోక్‌నగర్ సోమనాథ్ హాస్పిటల్‌లో ఈ నెల 20న రొమ్ము కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రూట్స్ ఛైర్మన్ డాక్టర్ పి విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు అవగాహన కార్యక్రమం ఉంటుందని, ఈ క్యాంపులో మహిళలకు రొమ్ము కేన్సర్ నిర్థారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో మమ్మోగ్రామ్ పరీక్షలు చేస్తామని, వివరాలకు 9849872499, 8886758758 నెంబర్లలో సంప్రదించాలని విజయ్‌భాస్కర్ కోరారు.



బాధితుడికి కృత్రిమ కాలు అందజేత

పటమట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వర్‌నగర్‌కు చెందిన శ్రీహరికి దాత మూల్పూరి ఉపేంద్ర రూ.25వేల విలువ చేసే కృత్రిమ కాలును బుధవారం అందజేశారు. ఈ కాలును అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మూల్పూరి ఉపేంద్ర, చలసాని రమణ, దేవేంద్రలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గద్దె, టీడీపీ నేతలపై కేసు కొట్టివేత



కోర్టు వెలుపల న్యాయవాదులతో గద్దె రామ్మోహన్

పటమట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట ప్రాంతంలో 2019లో గద్దె రామ్మోహన్ నామినేషన్ సందర్భంగా బాణాసంచా కాల్చిన సందర్భంలో ఎమ్మెల్యే గద్దె రామ్మో హన్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులపై పోలీ సులు కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి కోర్టు వాయిదాలకు హాజరైన అనంతరం బుధవారం జరిగిన వాయిదాలో ఎమ్మెల్యే, ఎంపీల స్పెషల్ కోర్టులో న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. న్యాయవాదులు నిమ్మగడ్డ దుర్గాప్రసాద్, చంద్రగిరి శ్రీనివాస్, బాసంశెట్టి రవిలు గద్దె రామ్మోహన్, టీడీపీ నేతలు తరఫున కోర్టులో వాదనలు వినిపించారు. ఈ కేసులో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో పాటు పోలిపల్లి ముని, షేక్ నాగూర్, ముని ఆదిబాబు, ముని అజయ్, ఎండీ అయాజ్‌లున్నారు.

ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎన్‌సీసీ కోటా అమలు

- పీఐ స్టాఫ్ సుబేదార్ పాల్‌కర్ సంజయ్

లబ్బీపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించేం దుకు ఎన్‌సీసీ దోహదపడు తుందని పీఐ స్టాఫ్ సుబేదార్ పాల్‌కర్ సంజయ్ అన్నారు. నలంద కళాశాలలో బుధ వారం ఎన్‌సీసీ బి సర్టిఫికెట్‌లో ఉత్తీర్ణులైన కేడెట్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి సర్టిఫికెట్‌లో ఉత్తీర్ణులైన వారు సి సర్టిఫికెట్ పరీక్షకు అర్హులని, ఉన్నత విద్య, ఉద్యోగాలలో ఎన్‌సీసీ కోటాను అమలు చేస్తుందని అన్నారు. ప్రిన్సిపాల్ ఎం. అనురాధ మాట్లాడుతూ 2023-2024 లో బి సర్టిఫికెట్ పరీక్షకు 27 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారని అన్నారు. యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్, ఐడీసీ, ఆర్‌డీసీ, తల్ సైనిక్ క్యాంపులలో పాల్గొనడం వల్ల విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, భావవ్యక్తీకరణ, నైపుణ్యం అలవడుతుందని, దేశ, విదేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, అనేక విషయాలు తెలుసుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఏఎన్‌వో కె. సుధాకర్, కేడెట్లు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన కేడెట్లతో సుబేదార్ పాల్‌కర్ సంజయ్, ఎం.అనురాధ

మున్సిపల్ అధికారులు యూజీడీ పరిశీలన



సంప్ నిర్మించవలసిన ప్రాంతాన్ని అధికారులకు చూపిస్తున్న కార్పొరేటర్ రామిరెడ్డి

రాణిగారితోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోటలోని 17వ డివిజన్‌లో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పర్యటించి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. డివిజన్‌తో పాటు రాణిగారితోట ప్రాంతంలో గత కొంతకాలంగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి స్థానికులు ఇబ్బందులు పడడంతో డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి మున్సిపల్ కమిషనర్ దృష్టికి సమస్య తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులను పంపడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ యూజీడీ పరిస్థితిని వివరించారు. డివిజన్‌లో కరకట్ట వద్ద ఉన్న మరుగుదొడ్ల వెనుక సంపు నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. డివిజన్‌లోని పలు రోడ్లలో కొత్త యూజీడీ లైన్లు, మరికొన్ని సీసీ రోడ్లు వేయాలని అధికారులకు వివరించారు. అధికారులు సమస్య తీవ్రతను కమిషనర్‌కు వివరించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారుల పర్యటనతో ఈ ప్రాంతంలో మిషన్ల సహాయంతో డ్రెయినేజీలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో సీఈ శ్రీనాథ్ రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ సామ్రాజ్యం, ఏఈ సాయి పాల్గొన్నారు.

లయోలాలో ఆహారం, పోషకాహారంపై సదస్సు

భారతీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ ఆహారదినోత్సవం సందర్భంగా ఐక్యూఏసీ సెల్ కన్వీనర్ క్యాండీ ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం గెస్ట్‌టాక్ (ఆహారం, పోషకాహారం) అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో బెల్జియంలోని కేయులెవిన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి ప్రణతి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పిల్లలు, వృద్ధుల పోషణ అవసరాలను వివరించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ ఫుడ్ వైబ్‌సైట్‌ను మేనేజ్‌మెంట్ డైరెక్టర్, సెక్రటరీ ఫాదర్ బి.జోజిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి 350 కేజీల బియ్యం, 300 కేజీల గోధుమ పిండి, 250 కేజీల కందిపప్పు, 500 లీటర్ల ఆయిల్ ప్యాకెట్‌లను సిద్ధం చేశారని, ఈ వస్తువులను 50 పేద కుటుంబాలకు పంచనున్నట్లు తెలిపారు.


రైవస్ కాల్వలో మృతదేహం లభ్యం

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పరిధి కూర్మయ్య స్కూల్ వెనుక షేక్ మహబూబ్ సుభానీ కాలనీ దిగువన రైవస్ కాల్వ లాకుల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభించింది. స్థానిక డివిజన్ ఇన్‌ఛార్జి వీఆర్వో చేబ్రోలు వేణుగోపాలరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహం వద్ద ఎటువంటి గుర్తింపు ఆధారాలు లేవు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 45 సంవత్సరాల లోపు వయస్సు ఉంటుందని, ఒంటిపై నలుపురంగు టీ షర్ట్, నలుపురంగు ప్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఒత్తి'ధీ'

కాలేజీల్లో ఉన్నప్పుడు వరుస పిరియడ్లు. కాలేజీ పూర్తయ్యాక ప్రత్యేక తరగతులు. చదవడం, రాయడం నిత్యం ఇదే ప్రక్రియ. విద్యార్థులకు ఇచ్చే విశ్రాంతి చాలా తక్కువ. విశ్రాంతి వచ్చిందని ఉపశమనం తీసుకునేలోపు మళ్లీ ప్రత్యేక తరగతుల్లోకి వెళ్లిపోవాల్సి వస్తోంది. తర్వాత ఇంటికి వెళ్లినా గంటల కొద్దీ పుస్తకాలతో కుస్తీ పడాలి. ఫలితంగా విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. విరామం లేకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మానసిక ఒత్తిడితో మనోవేదనకు గురవుతున్నారు.

- ఆంధ్రజ్యోతి-విజయవాడ సిటీలైఫ్



- పగలంతా తరగతులు.. రాత్రయితే వర్కులు
- విశ్రాంతి లేక అల్లాడిపోతున్న విద్యార్థులు
- రాత్రి ఒంటిగంటకు వరకు వర్కులే వర్కులు
- ఉదయం 8 గంటలకే తరగతులు
- ఒత్తిడి, నిద్రలేవితో విద్యార్థుల అవస్థలు
- సైకాలజిస్టులకు పెరుగుతున్న కేసులు

విద్యార్థులపై పెరుగుతున్న చదువు భారం

కార్పొరేట్లు విద్యావ్యవస్థలోకి అడుగుపెట్టిన తర్వాత పోటీ పెరిగింది. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు రేటింగ్ ఉన్న విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. ఈ విషయంలో ఖర్చు కోసం వెనుకడుగు వేయట్లేదు. విద్యాసంస్థలు వాటి ప్రతిష్ఠను పెంచుకునేందుకు ఏటా పోటీ పడుతూనే ఉన్నాయి. ఎక్కువ మార్కులు, టాప్ ర్యాంకుల్లో విద్యార్థులను నిలబెట్టడానికి తరగతి గదుల్లో నలిపేస్తున్నారు. తరగతులు పూర్తయ్యాక వర్కులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఫలితంగా పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి.

కౌన్సెలింగ్ కేంద్రాల్లో పెరుగుతున్న విద్యార్థులు

సాధారణంగా వివిధ వ్యసనాలకు లోనైన వారిని సైకాలజిస్టుల వద్దకు తీసుకెళ్తుంటారు. కానీ, రెండు, మూడేళ్లుగా ఇలా కౌన్సెలింగ్‌కు వచ్చే వారిలో విద్యార్థులే ఎక్కువ కనిపిస్తున్నారు. నగరంలోని సైకాలజిస్టుల వద్దకు రోజుకు నలుగురైదుగురు పిల్లలు వస్తున్నారు. పెద్దలు 40-50 మంది వరకు ఉంటున్నారు. విద్యార్థులైతే రోజుకు 10-20 మంది వరకు వెళ్తున్నారు. ముఖ్యంగా ఇంటర్, పదో తరగతికి చెందిన విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం వస్తున్నారని సైకాలజిస్టులు చెబుతున్నారు. ఇలా వచ్చిన వారిలో గంటలకొద్దీ పుస్తకాలు పట్టుకుని కూర్చుంటున్న వారే ఎక్కువ మంది ఉంటున్నారు. కార్పొరేట్ కళాశాలలు ఉదయం 8 గంటలకే ప్రారంభమవుతున్నాయి. అప్పుడు కళాశాలకు వెళ్లిన విద్యార్థులు రాత్రి 7 గంటల వరకు నాలుగు గోడల మధ్యే ఉండాల్సి వస్తోంది. పదో తరగతిలో ఒకలా ఉన్న విద్యార్థుల టైమ్‌టేబుల్ ఇంటర్మీడియెట్‌కు వచ్చేసరికి పూర్తిగా మారిపోతోంది. ఇంటర్‌లో ఎంపిక చేసుకున్న గ్రూపులకు ప్లస్‌లు కలుస్తున్నాయి. ఒక్కో పిరియడ్‌ను సుమారు గంటపాటు నిర్వహిస్తున్నారు. ఐఐటీ, జేఈఈ వంటి కోర్సులు ఎంపిక చేసుకున్న విద్యార్థులకు గంటపాటు పాఠ్యాంశాల బోధన జరిగితే మరో గంట రీడింగ్ పిరియడ్ జరుగుతోంది. ఇలా రోజంతా విద్యార్థులు తరగతి గదుల్లో ఊపిరాడకుండా గడుపుతున్నారు. కళాశాల పూర్తయ్యాక ఒక్కో పాఠ్యాంశానికి సంబంధించి గంటన్నరకు పైగా హోంవర్క్‌లు ఇస్తున్నారు. వాటన్నింటినీ పూర్తి చేయడానికి ఆరేడు గంటలు పడుతుంది.

ఒత్తిడిని ఇలా తప్పించుకోవచ్చు

విద్యార్థులంతా టాపర్స్‌గా ఉండరు. ఒక్కొక్కరిలో ఒక్కోలా ఐక్యూ స్థాయిలుంటాయి. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గమనించాలి. విద్యార్థులకు ఒక టైమ్‌టేబుల్ అలవాటు చేయాలి. ఈ టైమ్‌టేబుల్‌లో తేడాలు రావడంతో పిల్లలు ఎక్కువగా మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ప్రతి మనిషి రాత్రి 8 గంటలపాటు నిద్ర అవసరం. ఈ నిద్ర లేనప్పుడు అన్ని రకాల సమస్యలు వస్తున్నాయి. తలనొప్పి, బీపీ, షుగర్, ఫిట్స్, మానసిక ఒత్తిడి, రక్తపోటు, భారీకాయం, గుండెపోటు వస్తున్నాయి. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఇచ్చే హోంవర్క్ విషయంలో ఆలోచించాలి. రాత్రి 10 గంటల్లోపు పూర్తయ్యేలా హోంవర్క్‌ను ఇవ్వడానికి విద్యాసంస్థలు టైమ్‌టేబుల్‌ను రూపొందించుకోవాలి.

- తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి.
- మెదడుకు ఎంత విశ్రాంతి ఇస్తే అంత మంచిది.
- మెదడు రిలాక్స్ కోసం ఇష్టమైన పనులు చేసుకోవాలి.
- మనసుకు నచ్చిన పనులు చేస్తే మెదడు రిలాక్స్ అవుతుంది.
- టైమ్‌టేబుల్ అలవాటు చేయాలి



- డాక్టర్ పామర్తి కృష్ణదాస్, మానసిక వైద్య నిపుణుడు

ఉపాధ్యాయులకు చెప్పున్నాం

మా అమ్మాయి ఎంజీ రోడ్డులో ఉన్న ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. ఇంటికొచ్చేసరికి రాత్రి 7 గంటలవుతుంది. కొద్దిసేపు మాత్రమే విశ్రాంతి తీసుకుంటుంది. తర్వాత పుస్తకాలతో హాల్లో కూర్చుంటుంది. నిద్రపోవడానికి ఒంటిగంట అవుతుంది. తిరిగి మళ్లీ వేకువజామున నిద్రలేస్తుంది. తగినంత సమయం నిద్ర లేకపోవడంతో ఇబ్బంది పడుతోంది. హోంవర్క్‌లు కొంచెం తగ్గించాలని ఉపాధ్యాయులకు చెప్పాం. ఎంచుకున్న కోర్సులు కఠినమైనవని, హోంవర్క్ కచ్చితంగా ఉంటుందని చెబుతున్నారు. అసలు ఈ కోర్సును పూర్తి చేయగలనా లేదా అనే ఒత్తిడితో మా అమ్మాయి ఉంటోంది. ఎప్పటికప్పుడు ఆమెకు కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. - రామారావు, కృష్ణలంక

కోకో ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా రాష్ట్రం

- ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్

భారతీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రధాన కోకో ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్‌గా ఉందని ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలో కోచి కేంద్రంగా పనిచేస్తున్న డైరెక్టరేట్ ఆఫ్ క్యాష్యూ నట్ అండ్ కోకో డెవలప్‌మెంట్ (డీసీసీడీ), ఏపీ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎన్టీఆర్ కాలనీ వద్ద పార్క్ ఎన్ హోటల్‌లో కోకో పంటపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా, ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విజయవాడలో అధిక నాణ్యత గల మొక్కల ఉత్పత్తికి కోకో క్లోనల్ ఆర్చర్డ్ ఏర్పాటు చేశామన్నారు. కోకో పంట 30,552 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతూ 12,135 మెట్రిక్ టన్నుల డ్రైడ్ బీన్స్ వార్షిక దిగుబడి నమోదవుతుందన్నారు. విస్తీర్ణం, ఉత్పాదకత పరంగా ఏలూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఉందన్నారు. డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా మాట్లాడుతూ నర్సరీల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు, బాలాజీ నాయక్, హరినాథ్‌రెడ్డి, సహాయ సంచాలకులు సుధ, ఐకాన్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్. ఎలైన్ అప్సారా, వైఎస్ఆర్‌హెచ్‌యూ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి, ఎన్టీఆర్ జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ పి.బాలాజీ కుమార్, శాస్త్రవేత్తలు, ఏజెన్సీలు, రైతులు పాల్గొన్నారు.



కోకో పంట గురించి వివరిస్తున్న డాక్టర్ శ్రీనివాస్, చిత్రంలో డాక్టర్ ఫెమీనా శాస్త్రవేత్తలు

కాలుష్య రహిత నగరం కోసం ఏం చేద్దాం

- నిపుణులతో వీఎంసీ కమిషనర్ సమావేశం

చిట్టినగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు, కాలుష్య రహిత నగరానికి ఆ రంగ నిపుణులతో విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేస్ట్ వాటర్ ప్రాసెస్, పారిశుద్ధ్య నిర్వహణ, నగరాభివృద్ధి దిశగా చర్చించారు. ఢిల్లీకి చెందిన కాస్మిక్ హిలోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సభ్యులు, కేజీఎంపీ పార్టనర్స్ నిపుణులు, వీఎంసీ ఎస్ఈ (ప్రాజెక్ట్) సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్ బాబు, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.



నిపుణులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

జిల్లాలో కొత్త రేషన్ దుకాణాలు

- విజయవాడ డివిజన్‌లో 61 రేషన్ షాపులు
- తిరువూరు డివిజన్‌లో 10 రేషన్ షాపులు
- నందిగామ డివిజన్‌లో 9 రేషన్ షాపులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రేషన్ కార్డుల బైఫర్‌కేషన్ ప్రక్రియతో ఎన్టీఆర్ జిల్లాలో కొత్తగా 80 రేషన్ దుకాణాలు ఏర్పడబోతున్నాయి. విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యధికంగా 61 రేషన్ దుకాణాలు కొత్తగా ఏర్పాటు కానున్నాయి. ఇందులోనూ విజయవాడ నగరంలోనే అత్యధిక సంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది. తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 10 రేషన్ దుకాణాలకు, నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో 9 రేషన్ దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. నూతన చౌక దుకాణాలకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది. డీలర్ల ఎంపికకు సంబంధించి రాతపరీక్ష విధానంలో మెరిట్ ఆధారంగా ఎంపిక చేసే అవకాశం ఉంది. రాతపరీక్షలు ఉత్తీర్ణులైన వారిని విద్యార్హతలు, రిజర్వేషన్ల ప్రాతిపదికన ఎంపిక చేసే పరిస్థితి కనిపిస్తోంది. రేషన్ డీలర్ల నోటిఫికేషన్‌తో ఎన్టీఆర్ జిల్లాలో 80 మందికి ఉపాధి అవకాశాలు లభించే పరిస్థితి ఏర్పడబోతోంది.

అభ్యంతరాల తిరస్కరణ

జిల్లా వ్యాప్తంగా రేషన్ డీలర్లు విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలకు తమ అభ్యంతరాలను తెలిపారు. అభ్యంతరాలను పరిశీలిస్తే.. గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన క్రమంలో సచివాలయాల ప్రాతిపదికన మ్యాపింగ్ చేశారని, అది కూడా నాలుగేళ్లు కావస్తోందన్నారు. తర్వాత మధ్యలో ఎక్కడా మ్యాపింగ్‌ను క్రమబద్ధీకరణ చేయలేదన్నారు. చాలామంది చనిపోయిన వారున్నారని, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారున్నారని ముందు ఈ సమస్యలను పరిష్కరించి తర్వాత బైఫర్‌కేషన్‌ను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రేషన్ డీలర్ల అభ్యంతరాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ ఆర్డీవోలు కొట్టివేశారు. దీనిపై మళ్లీ రేషన్ డీలర్ల సంఘం కోర్టును ఆశ్రయించేందుకు సన్నాహాలు చేస్తోంది.



విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న మరుదూరి నరసింహాచార్యులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కిరణ్ కుమార్ తదితరులు

లయోలాలో వైభవంగా వాల్మీకి జయంతి

విజయవాడ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో ప్రాచ్య భాషా పరిషత్ వాల్మీకి జయంతిని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆశ్వయుజ పూర్ణిమ తిథిని వాల్మీకి జయంతిగా జరుపుకుంటారు. ముఖ్య అతిథిగా సంస్కృత భాషా సేవకుడు, సంస్కృత భారతి బోధకవర్గ ప్రముఖుడు డాక్టర్ మరుదూరి నరసింహాచార్యులు విచ్చేసి మాట్లాడారు. సాధారణమైన వాక్యాలను కూడా తన కవిత్వంతో ఎంతో హృద్యంగా చెప్పిన మహా మనిషి వాల్మీకి అని విద్యార్థులకు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ జి.కిరణ్‌కుమార్ ఎస్‌జే, ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ జీఏపీ కిశోర్ ఎస్‌జె, ప్రాచ్య భాషా శాఖాధ్యక్షులు డాక్టర్ కె.శేఖర్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో నిర్వాహకుడిగా సంస్కృతాధ్యాపకుడు బి.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ డి.కృపారావు, సర్వేశ్వరరావు, హిందీ అధ్యాపకురాలు స్నేహల్ శుక్లా, విద్యార్థులు పాల్గొన్నారు.



మెడల్స్ సాధించిన క్రీడాకారులతో ప్రధానోపాధ్యాయురాలు అరుణ మేరీ

తైక్వాండోలో సెయింట్ ఆన్స్ సత్తా

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14,17 తైక్వాండో పోటీల్లో ప్రసాదంపాడులోని సెయింట్ ఆన్స్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు పాల్గొని పతకాలు వశం చేసుకున్నారు. అండర్-17 బాలికల 68 కేజీల విభాగంలో ఎస్ నాగ వెంకట శ్రీ నిఖ రజతం, బాలుర 51 కేజీల విభాగంలో ఎం మాధవ్ కాంస్యం వశం చేసుకున్నాడు.స్కూల్లో బుధవారం జరిగిన సభలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అరుణ మేరీ, కోచ్ అంకమ్మరావులు మెడల్స్ సాధించిన వారిని అభినందించారు.

పారదర్శకంగా ఇసుక అందించాలి

- జేసీ నిధి మీనా

కంచికచర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత ఇసుకను పారదర్శకంగా అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా కంచికచర్ల మండలం పెండ్యాల-1, 2 రీచ్‌లకు సంబంధించి నందిగామ మండలం కంచెలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను, వత్సవాయి మండలం ఇందుగపల్లి, ఆళ్లూరుపాడు స్టాక్ పాయింట్లను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 15 రీచ్‌లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని, ముందుగా ఈ రోజు 4 రీచ్‌లు ప్రారంభించామని, 3.69 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. మిగతా 11 రీచ్‌లను నీటి ప్రవాహం తగ్గిన వెంటనే అందుబాటులోకి తెస్తామన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న కీసర, మోగులూరు స్టాక్ పాయింట్లతో కలిపి మొత్తం 15 రీచ్‌లలో 11 లక్షల 6 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. కొత్తగా ప్రారంభించిన రీచ్‌లలో టన్ను ఇసుక ధర రూ.232గా కమిటీ నిర్ణయించిందన్నారు. నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, గనులు, భూగర్భశాఖ సహాయ సంచాలకుడు వీరాస్వామి పాల్గొన్నారు.



ఇసుక నిల్వల వివరాలు తెలుసుకుంటున్న జేసీ డాక్టర్ నిధి మీనా

హుండీల లెక్కింపులో మొదటిరోజు ఆదాయం రూ.3.50 కోట్లు

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో సాధారణ రోజులతో పాటు ఇటీవల జరిగిన దసరా మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు మొదటిరోజు బుధవారం లెక్కించగా రూ.3,50,28,700లు లభించినట్టు ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మహామండపం 6వ అంతస్తు వద్ద ఈవో పర్యవేక్షణలో భక్తులు సమర్పించిన కానుకలను సిబ్బంది లెక్కించారు. భక్తులు 15రోజుల పాటు సమర్పించిన కానుకల రూపంలో రూ. 3,50,28,700 నగదు, 270 గ్రాముల బంగారం, 9 కేజీల 320 గ్రాముల వెండి ఆభరణాలు లభించినట్టు ఈవో తెలిపారు. 285 అమెరిన్ డాలర్లు, 20 యుఏఈ దిర్హమ్స్, 0.5 ఒమన్ రియల్స్ 100 బైసా, 2 మలేషియా రింగెట్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 50 కెనడా డాలర్లు, 5 కువైట్ దీనార్లు, 15 సౌదీ రియాల్స్, 15 ఇంగ్లండ్ పౌండ్లు, 160 ఆస్ట్రేలియా డాలర్లు, 6 సింగపూర్ డాలర్లు భక్తులు సమర్పించినట్లు తెలిపారు. గురువారం కూడా లెక్కింపు ఉంటుందన్నారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, ఏఈఓలు, సిబ్బంది, ఎస్‌పీఎఫ్, వన్‌టౌన్ పోలీసులు, సేవాదారులు పాల్గొన్నారు.



హుండీల లెక్కింపులో పాల్గొన్న ఈవో రామారావు, అధికారులు, సిబ్బంది

మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం



మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీకామాక్షి స్వర్ణకార సంఘం నేతలు

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వన్‌టౌన్, గోల్డ్ మార్కెట్‌లోని శ్రీకామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంత్రి లోకేష్ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కేశనం భావనారాయణ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్ ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, బుధవారం కేబినెట్ సమావేశంలో కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలపటం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి, మంత్రి లోకేష్‌కు ధన్యావాదాలు తెలిపారు. తొలుత పాలాభిషేకం, అనంతరం కేక్ కట్ చేసి పంచారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.పి.చారి, కోశాధికారి సలీం, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.భాస్కర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కటకం మురళి, సంఘం నేతలు పాల్గొన్నారు.

రోగుల బంధువులకు ఆకలి తీర్చుతున్న 'తానా'

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో రోగులు, వారి వెంట వచ్చే బంధువులకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆకలి తీరుస్తోందని తానా ఫౌండేషన్ ట్రస్టీ, అన్నపూర్ణ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సురేష్ పుట్టగుంట అన్నారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో తానా, అన్నపూర్ణ పేరుతో ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసి బుధవారం నాటికి మూడేళ్లయిన సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తానా అన్నపూర్ణ ప్రాజెక్టు పేరుతో విజయవాడ, గుంటూరు, తెనాలి ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత ఆహార పంపిణీ సెంటర్లను చేశామన్నారు. వీటిని ఏర్పాటు చేసి బుధవారం నాటికి మూడేళ్లు పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు 3.40 లక్షల మందికి భోజనం వడ్డించినట్లు తెలిపారు.తానా ప్రెసిడెంట్ నిరంజన్ శృంగవరపు, ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ వల్లేపల్లి తదితరులు సురేష్ పుట్టగుంటను అభినందించారు.



భోజనం వడ్డిస్తున్న కోఆర్డినేటర్ సురేష్

108లో డ్రైవర్లు, పైలెట్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 108లో పని చేసేందుకు డ్రైవర్లకు, పైలట్ల పోస్టులకు ఈనెల 17న భవానీపురం మార్కెట్ యార్డ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎండీ అష్మతుల్లా బుధవారం తెలిపారు. టెన్త్ పాసై ఇంగ్లీష్ చదవడం, రాయడం తెలిసివారు 35ఏళ్లు నిండనివారు, హెవీ లైసెన్స్ కలిగిన వారు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారు ఎన్టీఆర్ జిల్లాలో పని చేయాలన్నారు. వివరాలకు 99630 06867 నంబరును సంప్రదించాలన్నారు.

22 నుంచి అండర్-19 క్రీడాజట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 క్రీడాజట్ల ఎంపికలను ఈ నెల 22, 23, 24, 29న వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ట్లు జిల్లా సెక్రటరీ వీ రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఉయ్యూరులోని ఏజీఅండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో కబడ్డీ (బాలురు మాత్రమే), 23న విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో వెయిట్‌లిఫ్టిం గ్, బాక్సింగ్, జూడో, వుషూ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలను బాలబాలికలకు, అదేరోజు పీబీ సిద్ధార్థ కళాశాలలో వాలీబాల్, ఖోఖో బాలబాలికల జట్లను, 24న పీబీ సిద్ధార్థ కళాశాలలోనే బ్యాడ్మింటన్, క్రికెట్ జట్ల ఎంపికలను చేపడతామన్నారు. 24న బీఎస్ఆర్‌కే మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్లో మాల్కంబ్ ఎంపికలు, 29న మహానాడు రోడ్డులోని ఓల్గా అకాడమీలో ఆర్చరీ జట్ల ఎంపికలు చేపడుతున్నామని, ఫిజికల్ డైరెక్టర్లు గ్రహించి క్రీడాకారులను సెలక్షన్స్‌కు పంపాలని రవికాంత కోరారు.



దుర్గగుడి కళావేదికపై కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు.

అలరించిన కూచిపూడి నాట్యప్రదర్శన

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి కళావేదికపై బుధవారం పలువురు కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఇటీవల దుర్గగుడిలో జరిగిన దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 3 నుంచి 15 వరకు మహామండపం 7వ అంతస్తులో కళావేదికపై నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలను తాత్కాలికంగా రద్దు చేశారు. ఉత్సవాలు ముగియటంతో మళ్లీ బుధవారం నుంచి యథావిధిగా ప్రారంభించారు. దాచేపల్లి లక్ష్మిసుధేష్ణ, గ్రీష్మప్రియ, పి.హరిణి బ్రహ్మొక్కటే, బ్రహ్మాంజలి అంశాలపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం ఈవో రామారావు కళాకారులకు ప్రశంసా పత్రాలు, లడ్డూ ప్రసాదం అందజేసి అభినందించారు.

నేడు ఆదిదంపతుల గిరిప్రదక్షిణ

ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా దుర్గగుడిలో గురువారం గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నట్టు ఈవో కేఎస్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.55 గంటలకు దుర్గగుడి టోల్‌గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

మాకొద్దు సెంట్రల్

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 113 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో నగరానికి 39 కేటాయించింది. ఈ మొత్తం షాపులకు రెండు రోజుల క్రితం లాటరీ తీశారు. నగరంలో ఏర్పాటుచేసే 39 షాపుల్లో సగానికి పైగా సిండికేట్లు తన్నుకుపోయారు. నాలుగైదు సిండికేట్లు 20కి పైగా షాపులను దక్కించుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం రాత్రితో మూసుకుపోయాయి. రాత్రి 9 గంటల తర్వాత ఈ మద్యం దుకాణాలను మూసేశారు. అనంతరం జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలోని మద్యం దుకాణాలకు వెళ్లారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన అమ్మకాల మొత్తాన్ని లెక్కించారు. అనంతరం షాపుల్లో ఉన్న మద్యం సరుకును బ్రాండ్లవారీగా లెక్కించారు. మొత్తం అన్‌సోల్డ్ స్టాక్‌కు సంబంధించిన జాబితాను రూపొందించారు. ఈ సరుకును తిరిగి డిపోలకు అప్పగించారు. అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం ఉదయం బ్యాంకుల్లో జమ చేయించారు. కాగా, జిల్లావ్యాప్తంగా బుధవారం రాత్రికి సుమారు 25 కొత్త మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. ఇవన్నీ ఎక్సైజ్ శాఖ డిపోల పరిధిలోనివే.

కలెక్టర్ సృజన రిలీవ్

(5వ పేజీ తరువాయి)

ప్రమాదం, నగరంలో కొండచరియలు విరిగిపడటం, కృష్ణానది, బుడమేరు వరదలు వంటి ఎన్నో సమస్యలను ఆమె ఎదుర్కొన్నారు.

నూతన కలెక్టర్ ఎవరు?

కొత్త కలెక్టర్ ఎవరనే చర్చ మొదలైంది. తెలంగాణ నుంచి వచ్చేవారి కంటే.. ఇక్కడి వారినే నియమించే అవకాశం ఉంది. ఇంటర్మీడియెట్ బోర్డులో పనిచేస్తున్న కృతికా శుక్లా, సీఆర్‌డీఏ మాజీ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ పేర్లు వినిపిస్తున్నాయి. కొత్త ముఖాలకు అవకాశం కల్పించవచ్చనే ప్రచారం కూడా జరుగుతోంది. కాగా, జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు.

పెద్ద కాంట్రాక్టర్ల జపం

(5వ పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం పవన్ తక్షణం జోక్యం చేసుకుని వివాదాస్పద నిర్ణయాలకు చెక్ పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అవినీతి

జల్ జీవన్ మిషన్-2024 పనుల వ్యవహారం వైసీపీ ప్రభుత్వంలో ఉన్నతాధికారులకు కామధేనువుగా మారింది. ఆర్‌డబ్ల్యూఎస్‌లో విచ్చలవిడిగా అవినీతి జరిగింది. కాంట్రాక్టర్లు అడ్డగోలుగా పనులు చేపట్టినా.. ప్రశ్నించకుండా వారు చెప్పినట్టుగా ఎంబుక్‌లలో నమోదు చేయటంతో పాటు చెక్ మెజర్‌మెంట్ కూడా చేశారు. అవినీతి వ్యవహారంలో కొందరు అధికారులు చార్జి మెమోలు కూడా తీసుకున్నారు. ఇక పనుల విషయానికి వస్తే బిల్లుల చెల్లింపుల విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శించడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి ఆసక్తి చూపలేదు. కొందరు చేస్తున్న పనులను కూడా నిలుపుదల చేశారు. చివరకు పనుల చెయిన్ లింక్ తెగిపోయింది. దీంతో పనులన్నీ ఒక తీరు, తెన్ను లేకుండా పోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పనులన్నింటినీ ఒక చైన్ లింక్‌గా చేపట్టేందుకు సంకల్పించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ ఉన్నతాధికారులు, పంచాయితీరాజ్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం పనులు స్పీడ్‌గా అవ్వాలంటే పెద్ద కాంట్రాక్టర్ల ద్వారానే సాధ్యమవుతుందన్న సరికొత్త వాదనలు తెరమీదకు తీసుకువచ్చారు.

ఆర్అండ్‌బీ అనుభవాలు కళ్లకు కనిపిస్తున్నా..

వైసీపీ ప్రభుత్వంలో ఆర్అండ్‌బీ పరిధిలో జిల్లాల ప్రాతిపదికన ప్రధానమైన ఆర్అండ్‌బీ రోడ్లను రెండు వరుసలుగా విస్తరించేందుకు నిర్ణయించారు. అప్పట్లో నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ఆర్థిక సహకారంతో చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. టెండర్లలో పెద్ద కాంట్రాక్టర్లే అన్న నిబంధనను ప్రవేశపెట్టారు. పెద్ద కాంట్రాక్టర్ల వల్ల పనులు పరుగులు పెడతాయని అప్పుడు కూడా చెప్పారు. తీరా చూస్తే.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో టెండర్లు దక్కించుకున్న వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ ఈ పనులను సబ్‌లీజులకు అప్పగించటం ప్రారంభించింది. సబ్‌లీజుకు తీసుకోవడానికి చిన్న కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 13 ఆర్అండ్‌బీ రోడ్లకు టెండర్లు పిలవగా.. సగం రోడ్ల పనులు కూడా మొదలు కాలేదు. ఆర్అండ్‌బీ అనుభవాలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా కూడా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరు మారడం లేదు. పెద్ద కాంట్రాక్టర్ల జపమే కొనసాగిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 17 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com

అఖండ తాండవం ఆరంభం



నందమూరి బాలకృష్ణ-బోయపాటి శ్రీను హిట్ కాంబినేషన్‌లో నాలుగో చిత్రం మొదలైంది. వీరిద్దరి కలయికలో తెరకెక్కి ఘన విజయం అందుకున్న 'అఖండ' చిత్రానికి కొనసాగింపుగా 'అఖండ 2' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. బుధవారం ఈ చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమాలతో మొదలైంది. బాలకృష్ణ పవర్‌ఫుల్ డైలాగ్‌తో మొదలైన ముహూర్తం షాట్‌కు తేజస్విని కెమెరా స్విచాన్ చేయగా, బ్రాహ్మణి క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. ఏం తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా తమన్ నేపథ్య సంగీతంతో రూపొందిన 'అఖండ 2 తాండవం' టైటిల్ థీమ్‌ను నందమూరి రామకృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. శివలింగం, డమరుకం, హిమాలయాల నేపథ్యంలో రూపొందించిన 'అఖండ 2' టైటిల్ పోస్టర్‌ను చూస్తుంటే యాక్షన్ అంశాలతో పాటు మనసును కదిలించే ఆధ్యాత్మిక అంశాలతో రూపొందుతోందని తెలుస్తోంది. రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సి. రామ్ ప్రసాద్, సంతోష్ డి డెటాకే, ఆర్ట్ ఏఎస్ ప్రకాశ్, ఎడిటర్: తమ్మిరాజు



సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ బుధవారం తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 19న నిర్వహించే మ్యూజికల్ కాన్సర్ట్‌కు హాజరవ్వాలని కోరుతూ ఆహ్వానం అందించారు. దేవిశ్రీ ప్రసాద్ వెంట నిర్మాత బండ్ల గణేశ్ కూడా ఉన్నారు.
హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)

సైకిల్‌పై 1600 కిలోమీటర్లు!



అల్లు అర్జున్‌కు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. వాళ్లలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోహిత్ ఒకరు. తన అభిమాన హీరోను చూడాలని అలీఘర్ నుంచి సైకిల్‌పై బయలుదేరి 1600 కిలోమీటర్లు ప్రయాణించి అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్నాడు. సైకిల్‌పై వందల కిలోమీటర్లు ప్రయాణించి తనను చేరుకున్న అభిమానిని చూసి ఆశ్చర్యపోయారు అల్లు అర్జున్ ఆప్యాయంగా అతనితో మాట్లాడారు. 'హీరో అల్లు అర్జున్‌ని కలవడం నా జీవితంలో మరుపురాని అనుభూతి. సైక్లింగ్ మొదలు పెట్టే ముందు చాలా సార్లు హనుమాన్ చాలీసా చదివాను' అని మోహిత్ తెలిపారు. అతనికి దారి ఖర్చులు ఇచ్చి మళ్లీ ఉత్తరప్రదేశ్‌కు పంపించారు అల్లు అర్జున్.

జస్ట్ ఆస్కింగ్ కాదు.. జస్ట్ షూటింగ్



'జస్ట్ ఆస్కింగ్' అంటూ ఈ మధ్య వరుస ట్వీట్లతో వార్తల్లో నిలిచారు ప్రకాశ్ రాజ్. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి ఆయన చేసిన ట్వీట్స్ చర్చనీయాంశంగా మారాయి. అలా జస్ట్ ఆస్కింగ్ అని ప్రశ్నించిన ఆయన.. ఇప్పుడు జస్ట్ షూటింగ్ అనుకున్నారో ఏమో వరుస షూట్లతో హైదరాబాద్‌లో బిజీగా ఉన్నారు. ఉదయం బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న 'జాక్' సినిమాతో.. రాత్రి పూట పవన్‌కల్యాణ్ హీరోగా నటిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రం షూటింగ్‌లతో తీరిక లేకుండా గడుపుతున్నారు.

ఆరేళ్ల విరామం తర్వాత

సీనియర్ నటుడు అర్జున్ ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ మెగా ఫోన్ చేపడుతున్నారు.



2018లో ఆయన దర్శకత్వంలో ఓ తమిళ సినిమా వచ్చింది. ఆ తర్వాత విష్వక్ సేన్ హీరోగా ఓ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో ప్రారంభించారు కానీ అది ఆరంభంలోనే ఆగిపోయింది. తాజాగా ఇప్పుడు 'సీతా పయనం' అనే పొయిటిక్ టైటిల్‌తో ఓ సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించనున్నారు. తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో ఈ చిత్రం ఒకేసారి విడుదలవుతుంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తారు.







పీరియాడిక్ ఫిల్మ్స్... నయా ట్రెండ్!

సినిమాల్లో కొత్తదనం కనిపించేందుకు ఫిల్మ్ మేకర్స్ ఫాలో అవుతున్న నయా ఫార్ములా 'పీరియాడిక్ నేపథ్యం'. పదులు, వందల సంవత్సరాలు వెనక్కి వెళ్లి, చరిత్రకు ఆధునిక సాంకేతిక హంగులు జోడించి విజయాలు అందుకుంటున్నారు. గతంలో జరిగిన సంఘటనలకు కొంత కల్పన జోడించి తీస్తున్న ఈ సినిమాలకు ప్రేక్షకుల స్పందన కూడా బాగుంది. అందుకే ఇప్పుడంతా ఈ నయా ట్రెండ్ నడుస్తోంది. ఇలా రూపుదిద్దుకుంటున్న చిత్రాలేమిటో ఒకసారి చూద్దాం.

ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఫౌజీ'. చారిత్రక అంశాలు కలిగిన ఈ పీరియాడిక్ లవ్ యాక్షన్ డ్రామా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. 'సీతారామంతో' సూపర్ హిట్ కొట్టిన హను, 'సలార్', 'కల్కి 2898ఏ.డీ'లతో వసూళ్ల సునామీ సృష్టించిన ప్రభాస్ కలయికలో వస్తుండడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి.

స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్: బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న చిత్రం 'ఆర్‌సీ 16'. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే పీరియాడిక్ కథ ఇది. ఇందులో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉంది.

ప్రజానాయకుడిగా: నాని, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'దసరా'లో నటించి సూపర్‌హిట్ కొట్టారు. ఇప్పుడు ఆయన అదే దర్శకుడితో మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇది కూడా పొలిటికల్ టచ్‌తో సాగే పీరియాడికల్ చిత్రమట. ఇందులో ప్రజానాయకుడి పాత్రలో ఊర మాస్ లుక్‌లో నాని కనిపించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

వీరుడిగా విజయ్: రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ పీరియాడిక్ చిత్రంలో నటిస్తున్నారు. 1854 నుంచి 1878 మధ్య జరిగిన కొన్ని చారిత్రక సంఘటనలను ఆధారం చేసుకుని రూపొందుతున్న చిత్రమిది. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విజయ్ వీరుడిగా అలరించనున్నారు.

యదార్థ సంఘటనలతో: 'పలాస' ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'మట్కా'. 1950 నుంచి 1980ల మధ్య కాలంలో వైజాగ్ నేపథ్యంలో జరిగిన కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ సినిమా నవంబర్ 14న విడుదల కానుంది.


స్వాతంత్ర్యానికి పూర్వం: నూతన దర్శకుడు రోహిత్.కే.పీ దర్శకత్వంలో 1940 నేపథ్యంలో తెరకెక్కుతున్న ఓ సినిమాలో సాయి దుర్గాతేజ్ నటించనున్నారు. 'ఎస్‌డీటీ 18' వర్కింగ్ టైటిల్‌తో స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కథతో తెరకెక్కుతోంది. దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా సాయి దుర్గాతేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో కూడుకున్నది. సాయి దుర్గాతేజ్ పుట్టినరోజు సందర్భంగా ఇటీవలే విడుదల చేసిన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది.


అక్కినేని అఖిల్, దర్శకుడు అనిల్‌కుమార్ ఉపాధ్యాయుల దర్శకత్వంలో నటించే చిత్రం కూడా పీరియాడికల్ నేపథ్యం ఉన్నదే. ఈ సినిమాకు 'ధీర' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం.

చారిత్రక నేపథ్యంలో: పవన్ కల్యాణ్ నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. చారిత్రక నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను రెండు భాగాలుగా జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్నారు. బాబీ డియోల్ మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ పాత్రను పోషిస్తున్నారు.

తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా నటిస్తున్న చిత్రం 'కంగువ'. ఈ సినిమా కథాంశం.. ఎక్కువ శాతం చారిత్రక నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామాగా.. కొంత శాతం వర్తమానంలో సాగేలా ఉండనుంది. నవంబర్ 14న విడుదలవుతోంది. శివ దర్శకుడు. ఇందులో సూర్య చారిత్రక పోరాట యోధుడు 'కంగువ'.. వినోదాలు పంచే 'ఫ్రాన్సిస్' పాత్రల్లో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు. మరోవైపు, కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న 'సూర్య 44' కూడా పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతోంది.

నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న 'స్వయంభు' చారిత్రక నేపథ్యంలో సాగే పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది.. భరత్ కృష్ణమాచారి దర్శకుడు. మరోవైపు నిఖిల్ స్వాతంత్ర్యానికి ముందు సాగే పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ద ఇండియా హౌస్'లోనూ నటిస్తున్నారు.







భారీసెట్‌తో మొదలు



శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో ఇటీవలే ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. 'శర్వా 38' అనేది వర్కింగ్ టైటిల్. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బేనర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. 1960లో ఉత్తర తెలంగాణ, తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లోని గ్రామీణ నేపథ్యంలో కథ సాగుతుండడంతో ఆనాటి సంస్కృతిని ప్రతిబింబించేలా హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు. 15 ఎకరాల విస్తీర్ణంలో భారీ వ్యయంతో ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె ఈ సెట్‌ను రూపొందిస్తున్నారు. ఈ సెట్‌లో సినిమాకు కీలకమైన ఘట్టాలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

విభిన్నంగా ప్రయత్నించాను



'పొట్టేల్' చిత్రంలో నాలుగు పాటలుకూ చక్కటి ప్రేక్షకాదరణ లభించడం ఆనందాన్నిస్తోందని సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర అన్నారు. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. సురేశ్ కుమార్ సడిగె నిర్మాత. 'పొట్టేల్' ఈ నెల 25న విడుదలవుతోన్న సందర్భంగా శేఖర్ చంద్ర సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'గ్రామీణ నేపథ్యంలో రూపొందిన చిత్రం కావడంతో 'పొట్టేల్'కు సందర్భానుసారం సంగీత సృజన చేయడానికి కాస్త ఎక్కువ సమయం పట్టింది. పల్లె ప్రాంతంలో సహజమైన వాతావరణంలో ఈ సినిమాను చిత్రీకరించారు. దానికి తగినట్లు సంగీతం సమకూర్చడానికి విభిన్నంగా ప్రయత్నించాను. గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ పాటను పాశ్చాత్య శైలిలో స్వరాలు సమకూర్చడం ద్వారా ఓ ప్రయోగం చేశాను. అది ప్రేక్షకులకు బాగా నచ్చుతోంది' అన్నారు.

ఆ ఇద్దరి కోసం



యాక్షన్ కింగ్ అర్జున్, జె.డి చక్రవర్తి కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఇద్దరు'. ఎస్.ఎస్ సమీర్ దర్శకత్వంలో మహమ్మద్ ఫర్హీన్ ఫాతిమా నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతున్న సందర్భంగా బుధవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మంచి లొకేషన్లలో గ్రాండ్‌గా చిత్రీకరణ చేశాం. అర్జున్, చక్రవర్తి ఇద్దరూ పోటీపడి నటించారు. కళాతపస్వి కే. విశ్వనాథ్‌గారు నటించిన చివరి సినిమా ఇదే. ఆయన ఎంతో ఇష్టపడి చేసిన చిత్రమిది. ఓ పాటలో ఆయన స్టెప్స్ కూడా వేశారు' అని తెలిపారు. హీరోలు ఇద్దరూ కలసి చేసిన యాక్షన్ హంగామా ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు చెప్పారు.



రకుల్ వెన్నెముకకు గాయం

బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గన్‌తో కలిసి 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నారు రకుల్ ప్రీత్ సింగ్. సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తూ ప్రస్తుతం తన దృష్టినంతా బాలీవుడ్‌పైనే కేంద్రీకరించారు. అయితే, జిమ్‌లో రెగ్యులర్‌గా వర్కవుట్స్ చేసే రకుల్... ఇటీవల 80 కిలోల బరువును లిఫ్ట్ చేసే క్రమంలో వెన్నెముకకు తీవ్ర గాయమైంది. ఆమె వర్కవుట్ బెల్ట్ పెట్టుకోకుండా భారీ వెయిట్ లిఫ్టింగ్ చేయడంతోనే గాయమైందని డాక్టర్లు నిర్ధారించారు. డాక్టర్ల సూచనల మేరకు ప్రస్తుతం రకుల్ ప్రీత్ బెడ్ రెస్ట్ తీసుకుంటున్నారు. కాగా, సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్‌తో తన ఆరోగ్యంపై తాజా అప్‌డేట్స్ షేర్ చేసుకున్నారు రకుల్ ప్రీత్ . 'ఆరు రోజుల నుంచి బెడ్ రెస్ట్ తీసుకుంటున్నాను. పూర్తిగా కోలుకోవడానికి మరో వారం రోజులు పడుతుంది. త్వరితగతిన కోలుకుంటాననే నమ్మకం నాకుంది. విశ్రాంతి భారంగా అనిపిస్తోంది' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రకుల్ పోస్ట్ చేశారు.

శివగాడు యమాస్పీడ్



నటుడు సుమన్ ముఖ్య పాత్రధారిగా రూపొందుతున్న చిత్రం 'శివగాడు యమాస్పీడ్'. శివ జొన్నలగడ్డ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. మెడికల్ మాఫియా మోసాల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాజేందర్, రవిశంకర్, పొట్టి ప్రసాద్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని శివ చెప్పారు. సినిమాటోగ్రఫీ: ఏఎస్ రత్నం.

ఇన్ ప్రోగ్రెస్

కొత్త ఒరవడి సృష్టిస్తుంది




అకిరా డ్రీమ్ క్రియేషన్స్ పతాకంపై రాజేష్ నాయుడు దర్శకత్వంలో యోగేష్, ఆకృతి అగర్వాల్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'త్రిముఖ'. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను హీరో సాయి దుర్గా తేజ్ ఆవిష్కరించి మాట్లాడారు. 'యోగేష్ మంచి పట్టుదల ఉన్న వ్యక్తి. ఈ చిత్రం డెఫినెట్‌గా కొత్త ఒరవడి సృష్టిస్తుంది' అని అన్నారు. హీరో యోగేష్ మాట్లాడుతూ 'నా మొదటి ప్రాజెక్ట్‌గా త్రిముఖలో నటించడం సంతోషంగా ఉంది. సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని చాలా నమ్మకంగా ఉంది' అని అన్నారు.

మర్డర్ మిస్టరీ-క్రైమ్ థ్రిల్లర్



మల్టీ టాలెంటెడ్ అయిన విజయ్ ఆంటోనీ నటించిన తాజా చిత్రం 'గగన మార్గన్'. విజయ్ ఆంటోని ఫిల్మ్స్ కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా విజయ్ ఆంటోని నిర్మించారు. ఎన్నో చిత్రాలకు ఎడిటర్‌గా పని చేసిన లియో జాన్ పాల్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కాగా, తాజాగా రిలీజ్ చేసిన ఈ చిత్రం టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విజయ్ ఆంటోని రెండు రకాలుగా కనిపించారు.

పుట్టినరోజున 'ఈశ్వర్'



ప్రభాస్ 'ఈశ్వర్' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 23న రీ రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో రీ ఇంట్రడ్యూసింగ్ ప్రభాస్ అంటూ రిలీజ్ చేసిన మూవీ ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ మూవీని జయంత్ సీ పరాన్జీ తెరకెక్కించారు. కె.అశోక్ నిర్మించారు. లక్ష్మీ నరసింహా మూవీస్ సంస్థ రీ రిలీజ్ చేస్తోంది.

టైమ్ ట్రావెల్



సాయి రోనక్, అమృత చౌదరి హీరో హీరోయిన్లుగా క్రాస్ వైర్ క్రియేషన్స్‌పై నిర్మాత, దర్శకుడు కళ్యాణ్ చక్రవర్తి తెరకెక్కించిన చిత్రం రివైండ్. ఈ నెల 18న సౌత్ ఇండియా వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. 'కొత్త కాన్సెప్ట్‌తో టైమ్ ట్రావెల్ మీద ఈ సినిమాని తీసుకొస్తున్నాం. తెలుగు ప్రేక్షకులు కొత్తదనాన్ని, కొత్త కంటెంట్‌ని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తారు' అని చెప్పారు.

థ్రిల్ ఇచ్చే డీల్



హను కోట్ల హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది డీల్'. హెచ్ పద్మా రమాకాంతరావు, రామకృష్ణ కొలివి నిర్మించారు. చందన, ధరణి, ప్రియ కథానాయికలు. ఈ నెల 18న విడుదలయ్యే ఈ చిత్రం ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని నిర్మాతలు తెలిపారు.

బిజినెస్

విజయవాడ ● గురువారం 17 అక్టోబరు 2024

2035 నాటికి భారత రోడ్లపైకి
రోజుకు 12,000 కొత్త కార్లు

మెక్సికో దేశ కరెంట్ వినియోగాన్ని మించనున్న ఏసీల విద్యుత్ వాడకం

2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా

కోరలు చాస్తున్న ఇంధన డిమాండ్.. ఐఈఏ నివేదిక వెల్లడి



భారతదేశ ఇంధన దాహం రోజురోజుకు పెరిగిపోతోంది. ఆర్థికాభివృద్ధి, జనాభా ఇందుకు దోహదం చేస్తున్నాయి. అంతేకాకుండా వ్యక్తిగత, వాణిజ్య వాహనాలకు ఏటేటా డిమాండ్ పెరిగిపోతోంది. దీంతో భారత్‌లో 2035 నాటికి రోజుకు 12,000 కార్లు కొత్తగా రోడ్లపైకి రానున్నాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) అంచనా వేసింది. ఇదే సమయంలో మన దేశంలోని ఎయిర్ కండీషనర్లు (ఏసీలు) వినియోగించే విద్యుత్.. మెక్సికో దేశ మొత్తం కరెంట్ వినియోగాన్ని మించిపోతుందని వెల్లడించింది.

న్యూఢిల్లీ: భారత ఇంధన అవసరాలు ఏటా గణనీయంగా పెరిగిపోతున్నాయి. వచ్చే పదేళ్లలో భారత్‌లో ఇది మరింతగా పెరగనుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ).. వరల్డ్ ఎనర్జీ ఔట్‌లుక్-2024 పేరుతో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2035 నాటికి భారత ఇంధన డిమాండ్ మరో 35 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. అప్పటికి దేశంలో స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం ప్రస్తుత స్థాయి నుంచి మూడింతలు పెరిగి 14 లక్షల మెగావాట్లకు చేరుతుందని తెలిపింది. ఆర్థికాభివృద్ధి, పెరుగుతున్న జనాభా భారత్‌లో ఇంధన వినియోగాన్ని ఏటికేటికీ పెంచేస్తున్నాయని నివేదిక పేర్కొంది.

వాహనాలు పెరిగిపోతే కష్టమే: దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న మోటారు వాహనాలపైనా ఐఈఏ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పెరుగుదల ఇలానే కొనసాగితే 2035 నాటికి రోజుకు 12,000 కొత్త కార్లు రోడ్లపైకి వస్తాయని అంచనా వేసింది. దాంతో వీటి పార్కింగ్ పెద్ద సమస్యగా మారనుంది. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు ఏటా 100 కోట్ల చదరపు మీటర్ల స్థలం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇది దాదాపు దక్షిణాఫ్రికా దేశ విస్తీర్ణానికి సమానం. 2035 నాటికి భారత్‌లో ఏసీలు వినియోగించే కరెంట్.. మెక్సికో దేశం వినియోగించే మొత్తం కరెంట్‌ను మించిపోతుందని తెలిపింది.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ: ఎన్ని శషభిషలు ఉన్నా 2028 నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని ఐఈఏ అంచనా. కాకపోతే ఇందుకు జీడీపీ వృద్ధి రేటు ప్రస్తుత స్థాయిలో కొనసాగాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. గత ఏడాది (2023) భారత్ 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటుతో ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో అత్యధిక వృద్ధి రేటు సాధించిన దేశంగా నిలిచిన విషయాన్ని గుర్తు చేసింది.

బొగ్గే గతి: పునరుత్పాదక ఇంధన వనరులపై ఎంతగా ప్రచారం జరుగుతున్నా భారత ఇంధన రంగంలో ఇప్పటికీ బొగ్గుదే హవా అని ఐఈఏ తెలిపింది. ప్రస్తుతం మొత్తం ఇంధన వినియోగంలో బొగ్గు వాటా 40 శాతంగా ఉంది. ఇక మొత్తం స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నా.. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల వాటా 60 శాతానికి పైగా ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. మరో రెండేళ్లలో ఇది 68 శాతానికి చేరుతుందని తెలిపింది. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ కేంద్రాలతో పోలిస్తే ఇది 30 శాతం ఎక్కువ. 2030 నాటికి అందుబాటులోకి వచ్చే కొత్త విద్యుత్ ఉత్పాదక సామర్థ్యంలోనూ దాదాపు 60,000 మెగావాట్లు బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల ద్వారానే అందుబాటులోకి రానుందని ఐఈఏ నివేదిక తెలిపింది.

చమురు ఉత్పత్తి దేశాలకు తిప్పలు తప్పవు: మరో ఐదేళ్ల తర్వాత చమురు ఉత్పత్తి దేశాలకు తిప్పలు తప్పవని ఐఈఏ స్పష్టం చేసింది. అప్పుడు ఇప్పటిలా కృత్రిమంగా ఉత్పత్తి కుదించి చమురు ధరలు పెంచుకునే ఈ దేశాల వ్యూహం పెద్దగా ఫలించకపోవచ్చని తెలిపింది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వనరులే ఇందుకు కారణమని స్పష్టం చేసింది. అయితే భారత్ ఈ విషయంలో కొన్ని సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఐఈఏ అంచనా వేసింది.

ముఖ్యంగా డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ వాహనాలు, చార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారనుంది. దీంతో ఇప్పటికే చమురు వినియగం, దిగుమతుల్లో మూడో స్థానంలో ఉన్న భారత్ వచ్చే పదేళ్లలోనూ అదే స్థానంలో కొనసాగుతుందని ఐఈఏ అంచనా. అప్పటికి భారత రోజువారీ చమురు దిగుమతులు మరో 20 లక్షల బ్యారెల్స్ మేర పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

పసిడి.. రికార్డ్!

రూ.79,000 చేరువలో బంగారం

ముంబై: దేశీయంగా పసిడి ధర సరికొత్త జీవితకాల రికార్డు స్థాయికి చేరింది. బుధవారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.250 పెరుగుదలతో రూ.78,900కి చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ఈ విలువైన లోహం రేటు పెరగడంతో పాటు దేశీయంగా ఆభరణ వర్తకుల కొనుగోళ్లు పెరగడం ఇందుకు దోహదపడిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. కిలో వెండి ధర సైతం రూ.1,000 పెరిగి రూ.93,500గా నమోదైంది. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ రేటు 0.51 శాతం పెరిగి 2,692.50 డాలర్లకు చేరుకోగా..వెండి 0.91 శాతం పెరుగుదలతో 32.05 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

హిందుస్థాన్ షిప్‌యార్డ్‌తో విశాఖ పోర్టు ఒప్పందం

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీ, హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్.. బుధవారం నాడు అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఒప్పందంలో భాగంగా విశాఖ పోర్టు కోసం 60 టన్నుల సామర్థ్యం కలిగిన బొలార్డ్ పుల్ టగ్‌ను హిందుస్థాన్ షిప్‌యార్డ్ తయారు చేయనుంది. 18 నెలల్లో ఈ పుల్ టగ్‌ను పోర్టుకు అందించనుంది. ఈ మేరకు పోర్టు డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ టీ. శ్రీనివాస్, షిప్‌యార్డ్ డైరెక్టర్ కమాండర్ గిరిదీప్ సింగ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఈ టగ్‌ను తయారు చేయనుంది. పోర్టు, హార్బర్లలో నౌకల నిరంతర కదలికలను సులభతరం చేయడంలో ఇది కీలకంగా వ్యవహరిస్తుందని పోర్టు అధికారులు తెలిపారు.

ఏఓపీలకూ డీమ్యాట్ అకౌంట్లు!

ముంబై: అసోసియేషన్స్ ఆఫ్ పర్సన్స్ (ఏఓపీ) పేరిట డీమ్యాట్ ఖాతాలు తెరిచేందుకు, ఈక్విటీ షేర్లు మినహాయించి కొన్ని రకాల సెక్యూరిటీలను డీమ్యాట్ అకౌంట్లో కలిగి ఉండేందుకు అనుమతించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన చర్చా పత్రాన్ని బుధవారం విడుదల చేసింది. వచ్చే నెల 5 నాటికల్లా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరింది. సెబీ తాజా ప్రతిపాదన సులభతర వ్యాపార నిర్వహణతో పాటు సెక్యూరిటీలను భౌతికంగా కాకుండా ఎలక్ట్రానిక్ రూపంలో కలిగి ఉండటాన్ని ప్రోత్సహించనుంది.

డెట్ సెక్యూరిటీ ఇన్వెస్టర్ల కోసం లిక్విడిటీ విండో

స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా డెట్ సెక్యూరిటీలను కొనుగోలు చేసే ఇన్వెస్టర్ల కోసం సెబీ లిక్విడిటీ విండోను ప్రవేశపెట్టింది. ఇన్వెస్టర్లు తాము కలిగి ఉన్న లిస్టెడ్ డెట్ సెక్యూరిటీలను వాటిని జారీ చేసిన వారికి నిర్దేశిత తేదీతో కూడిన పుట్ ఆప్షన్ ద్వారా తిరిగి విక్రయించేందుకు ఇది వీలు కల్పిస్తుందని సెబీ తెలిపింది. వచ్చే నెల 1వ తేదీ నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది.

ఐటీ, వాహన షేర్లలో అమ్మకాలు

» 318 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రేడింగ్ ట్రెండ్, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు ఐటీ, వాహన రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో ప్రామాణిక సూచీలు నష్టాలు చవిచూశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 461.86 పాయింట్ల మేర క్షీణించినప్పటికీ, చివరికి 318.76 పాయింట్ల నష్టంతో 81,501.36 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86.05 పాయింట్లు కోల్పోయి 24,971.30 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ మరోసారి 25,000 దిగువకి చేరింది.

వచ్చే ఏడాది కాలంలో 27,800 స్థాయికి నిఫ్టీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ప్రామాణిక సూచీ నిఫ్టీ 50 వచ్చే ఏడాది కాలంలో 27,867 స్థాయికి చేరుకోవచ్చని దేశీయ బ్రోకరేజీ సంస్థ పీఎల్ క్యాపిటల్ అంచనా వేసింది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలోనూ చురుకుగా వృద్ధి చెందుతున్న రంగాలు, మదుపరులలో జాగురూకతతో కూడిన ఆశావహం సూచీ ర్యాలీకి దోహదపడనున్నాయని తాజా నివేదికలో పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,890 ▲	71,400 ▲	1,02,900 ▼
ముంబై	76,553 ▲	70,123 ▲	91,512 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	505
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	538	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	126	విజయవాడ	135
వరంగల్	126	గుంటూరు	135
కరీంనగర్	126	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	126	చిత్తూరు	127
కర్నూలు	126	నెల్లూరు	127
విశాఖపట్నం	125	అనంతపురం	127
గోదావరి	135		

ఎగుమతులు..కాస్త మెరుగు

» 2 నెలల క్షీణత తర్వాత మళ్లీ వృద్ధి బాటలోకి..

» సెప్టెంబరులో రూ.2.90 లక్షల కోట్లుగా నమోదు

» ఐదు నెలల కనిష్ఠానికి తగ్గిన వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: భారత విదేశీ వాణిజ్యం మళ్లీ కాస్త పుంజుకుంది. వరుసగా రెండు నెలలపాటు క్షీణించిన ఎగుమతులు.. సెప్టెంబరులో మళ్లీ వృద్ధిని నమోదు చేశాయి. కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెలలో దేశీయ ఉత్పత్తుల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 0.5 శాతం పెరిగి 3,458 కోట్ల డాలర్లకు (రూ.2,90,472 కోట్లు) చేరుకున్నాయి. కాగా, గత నెలలో దిగుమతులు కూడా 1.6 శాతం పెరుగుదలతో 5,536 కోట్ల డాలర్లుగా (రూ.4,65,024 కోట్లు) నమోదయ్యాయి. అయినప్పటికీ, వాణిజ్య లోటు 5 నెలల కనిష్ఠ స్థాయి 2,078 కోట్ల డాలర్లకు (రూ.1,74,552 కోట్లు) పరిమితమైంది. ఎగుమతుల ద్వారా లభించే ఆదాయం కంటే ఎగుమతుల వ్యయం అధికంగా ఉండటాన్ని వాణిజ్య లోటు అంటారు. ఎగుమతులు గణనీయంగా క్షీణించిన కారణంగా ఈ ఆగస్టులో వాణిజ్య లోటు 10 నెలల గరిష్ఠ స్థాయి 2,965 కోట్ల డాలర్లకు పెరిగింది.

చైనా నుంచే అధిక దిగుమతులు: భారత దిగుమతుల్లో చైనాదే అత్యధిక వాటా. వాణిజ్య శాఖ డేటా ప్రకారం.. ఈ ప్రథమార్థంలో చైనా నుంచి 5,629 కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులు దిగుమతయ్యాయి. కాగా, భారత ఎగుమతులకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. గత ఆరు నెలల్లో అమెరికాకు ఎగుమతులు 5.62 శాతం పెరుగుదలతో 4,038 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

శాటిలైట్ స్పెక్ట్రమ్‌పై అంబానీ, మిట్టల్‌కు చుక్కెదురు

కేటాయింపుల ద్వారానే స్పెక్ట్రమ్

న్యూఢిల్లీ: శాటిలైట్ కమ్యూనికేషన్లకు ఉపయోగించే స్పెక్ట్రమ్‌ను వేలం ద్వారా కేటాయించాలన్న రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ డిమాండ్‌కు చుక్కెదురైంది. ఈ స్పెక్ట్రమ్‌ను మిగతా అన్ని దేశాల్లానే మన దేశంలోనూ ప్రత్యేక కేటాయింపు ద్వారా కేటాయిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన విధి విధానాలు, ధరలను ట్రాయ్ నిర్ణయిస్తుందని ఢిల్లీలో జరుగుతున్న ఐఎంసీ సదస్సులో కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లహోటియా మాత్రం దీనికి సంబంధించి అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్టార్‌లింక్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్వాగతించారు. శాటిలైట్ కమ్యూనికేషన్ కంపెనీలు ఈ స్పెక్ట్రమ్ ద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం టెలికాం, బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించవచ్చు. దీంతో ఈ రంగాలపై తమ పట్టు ఎక్కడపోతుందోననే భయంతో, ఈ కంపెనీలకు కూడా స్పెక్ట్రమ్‌ను తమలాగే వేలం ద్వారా కేటాయించాలని రిలయన్స్ జియో అధినేత ఆకాశ అంబానీ, ఎయిర్‌టెల్ అధినేత సునీల్ మిట్టల్ ప్రభుత్వాన్ని కోరారు.

స్పోర్ట్స్

టాస్ కూడా వేయలేదు!

● తొలి రోజు ఆట వర్షార్పణం
● భారత్-కివీస్ మొదటి టెస్ట్

ఉ. 9.15 నుంచి స్పోర్ట్స్18లో..


జైస్వాల్, కోహ్లి

బెంగళూరు: ఎడతెరిపిలేని వర్షం కారణంగా భారత్-న్యూజిలాండ్ మధ్య తొలి టెస్ట్ మొదటి రోజు ఆట ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. బుధవారం ఉదయం నుంచే వాన కురుస్తుండడంతో మధ్యాహ్నం 2.30 గంటలకు తొలి రోజు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కనీసం టాస్ వేయడానికి కూడా పరిస్థితులు సహకరించలేదు. మధ్యాహ్నం 2 గంటలకు అంపైర్లు పిచ్‌ను పరిశీలించడానికి వచ్చినప్పుడు.. వికెట్‌కు ఇరువైపులా తడిగా ఉన్నట్టు గమనించారు. ఆ సమయంలో మరోసారి భారీ వర్షం కురవడంతో ఆటను రద్దు చేశారు. రెండు రోజుల నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో హాక్-ఐ కెమెరాలను కూడా అమర్చలేదు. ఒకవేళ మ్యాచ్ జరిగే పరిస్థితులుంటే ఆ కెమెరాలను అమర్చడానికే మరో గంటన్నర సమయం పట్టేది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ చెప్పుకోదగ్గ సంఖ్యలో ప్రేక్షకులు స్టేడియానికి వచ్చారు. వీరికి కోహ్లీ, యశస్వీ జైస్వాల్ నెట్ ప్రాక్టీస్‌ను చూసే చాన్స్ దక్కింది. గురువారం కూడా మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారం బట్టి తెలుస్తోంది. ఒక రోజు నష్టపోవడంతో.. మిగిలిన నాలుగు రోజులు 98 ఓవర్ల చొప్పున ఆట సాగేందుకు మ్యాచ్ 15 నిమిషాలు ముందుగా ఆరంభమై.. 15 నిమిషాలు ఆలస్యంగా ముగియనుంది. స్లో ఓవర్ రేట్ నడిస్తే మరో అరగంటపాటు ఆటను పొడిగించే అవకాశం ఉంది. గురువారం ఉదయం 8.45 గంటలకు టాస్‌ను షెడ్యూల్ చేశారు.

ఫేవరెట్ ఆస్ట్రేలియా

దక్షిణాఫ్రికాతో నేడు తొలి సెమీఫైనల్

మహిళల టీ20 వరల్డ్ కప్



షట్ ఎంలాబా

దుబాయ్: వరుసగా మూడుసార్లు డిఫెండింగ్ చాంపియన్‌గా నిలుస్తూ టీ20 వరల్డ్ కప్‌లో తిరుగులేని జట్టుగా ముద్ర వేసుకున్న ఆస్ట్రేలియా మహిళలు ప్రతిష్ఠాత్మక టోర్నీలో మరో పోరుకు సిద్ధమయ్యారు. గురువారం జరిగే సెమీఫైనల్లో సౌతాఫ్రికాను ఢీకొననున్నారు. అయితే గ్రూపు దశలో ప్రత్యర్థులపై ప్రదర్శించిన ఆధిపత్యాన్ని చూస్తే..సెమీస్‌లో ఆస్ట్రేలియా జట్టే నిస్సందేహంగా హాట్ ఫేవరెట్. 2009లో ఈ మెగా టోర్నమెంట్ ప్రారంభమయ్యాక ఇది తొమ్మిదో వరల్డ్ కప్. కాగా, ఈ టోర్నీలో అన్నిసార్లూ కంగారూలు సెమీఫైనల్‌కు చేరడం విశేషం. ఇక, ఆరుసార్లు ఆస్ట్రేలియా చాంపియన్‌గా నిలిచింది. ఇకపోతే..ఈసారి సెమీఫైనల్ 2023లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన ప్రపంచ కప్ ఫైనల్‌ను గుర్తు తెస్తోంది. నాడు ఈ రెండు జట్లే తుది పోరులో తలపడగా..19 పరుగులతో కంగారూలు జయకేతనం ఎగురు వేశారు. మహిళల టీ20లలో ఇరుజట్లూ 10 సార్లు పరస్పరం ఢీకొన్నాయి. ఇందులో 9 సార్లు విజేతగా నిలవడం ఆసీస్ సత్తాను తెలియజేస్తుంది. టీ20 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికాతో 7సార్లు తలపడిన ఆసీస్ అన్నిసార్లూ గెలిచింది. రిటైర్మెంట్ ప్రకటించిన మెగ్ లానింగ్ మినహా 2023 మెగా టోర్నమెంట్ ఫైనల్లో ఆడిన అలీసా హీలీ, బెత్ మూనీ, పెర్రీ, మేగన్ షట్, గార్డ్‌నర్..తదితర 10 మంది క్రికెటర్లు ప్రస్తుత ఆసీస్ జట్టులో ఉన్నారు. మందకొడిగా ఉండే దుబాయ్ పిచ్‌పై ఆడనుండడం బ్యాటింగ్ డెప్త్ ఉన్న ఆస్ట్రేలియాకు కలిసి వచ్చే అంశం. మరోవైపు స్లో లెఫ్టామ్ స్పిన్నర్ ఎంలాబానే దక్షిణాఫ్రికా జట్టుకు తురుపుముక్క. గ్రూపు దశలోని 4 లీగ్ మ్యాచ్‌ల్లో ఆమె 10 వికెట్లు పడగొట్టింది. లారా వోల్వార్ట్, బ్రిట్స్, మరిజానే కాప్ ముగ్గురూ మ్యాచ్ విన్నర్లే. కానీ హీలీ సారథ్యంలో అత్యంత పటిష్ఠంగా ఉన్న జట్టుపై వారు ఎలా రాణిస్తారనేది కీలకం.

గాయత్రి, సిక్కి జోడీలకు నిరాశ

ఓడెన్స్ (డెన్మార్క్): డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ డబుల్స్‌లో భారత్ పోరు ముగిసింది. మహిళల డబుల్స్ ఆరంభ రౌండ్లో ట్రీసా జాలీ/గాయత్రీ గోపీచంద్ జోడీ 21-19, 17-21, 15-21తో మలేసియా ద్వయం పెర్లీ టాన్/టీనా చేతిలో ఓటమి పాలైంది. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్ రెడ్డి/సిక్కి రెడ్డి జంట 22-20, 19-21, 22-24తో కెనడా జోడీ కెవిన్/ఎలియానా చేతిలో పరాజయం పాలైంది. మిగతా భారత షట్లర్లలో మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, పురుషుల సింగిల్స్‌లో సతీశ్ కుమార్ కూడా మొదటి రౌండ్లోనే ఇంటిబాట పట్టారు.

‘హాల్ ఆఫ్ ఫేమ్’లో నీతూ

కుక్, డివిల్లీర్స్ కూడా..


నీతూ డేవిడ్

దుబాయ్: భారత మహిళల జట్టు మాజీ స్పిన్నర్ నీతూ డేవిడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో డేవిడ్‌కు చోటు లభించింది. డయానా ఎడుల్జీ తర్వాత ఈ ఘనత సొంతం చేసుకొన్న రెండో భారత ప్లేయర్‌గా నీతూ (47) నిలిచింది. ఆమెతోపాటు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్, దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిల్లీర్స్ హాల్ ఆఫ్ ఫేమ్‌కు ఎంపికయ్యారు. నీతూ ప్రస్తుతం భారత మహిళల జట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన డేవిడ్ ఎడమ చేతి వాటం స్పిన్నర్. 1995-2008 మధ్య నీతూ 10 టెస్టులు, 97 వన్డేలు ఆడింది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో 100 వికెట్ల మైలురాయిని చేరిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డులకెక్కింది. 2006లో రిటైర్మెంట్ ప్రకటించినా మళ్లీ వెనక్కు తీసుకొని కొంతకాలం ఆడింది. 1995లో స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 8/53తో రికార్డు సృష్టించింది. మహిళల టెస్ట్ క్రికెట్‌లో ఇప్పటికీ ఇదే అత్యుత్తమ ప్రదర్శన.

ఢిల్లీలో ఖో ఖో వరల్డ్ కప్

» జనవరి 13న టోర్నీ ప్రారంభం

న్యూఢిల్లీ: తొలిసారి నిర్వహిస్తున్న ఖో ఖో వరల్డ్ కప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ మెగా టోర్నీ వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 19 వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనుంది. ఈ సందర్భంగా బుధవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు వరల్డ్ కప్ అధికారిక లోగోను ఆవిష్కరించారు. పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నీలో 24 దేశాల జట్లు పాల్గొంటున్నాయని భారత ఖో ఖో సమాఖ్య అధ్యక్షుడు సుధాంశు మిట్టల్ వెల్లడించాడు.

మళ్లీ ముంబై జట్టులోకి పరాస్ మాంబ్రే

ముంబై: టీమిండియా మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే ఐపీఎల్‌లో మళ్లీ ముంబై ఇండియన్స్ జట్టుతో చేరాడు. వచ్చే ఐపీఎల్ సీజన్‌కు తమ జట్టు బౌలింగ్ కోచ్ మలింగతో కలిసి పరాస్ పని చేయనున్నట్టు ముంబై ఇండియన్స్ యాజమాన్యం బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన టీమిండియాకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించిన 52 ఏళ్ల పరాస్ పదవీకాలం ఈ జూన్‌తో ముగిసింది. దీంతో ముంబై ఫ్రాంచైజీ తిరిగి అతణ్ణి జట్టులోకి తీసుకుంది. 2013లో ఐపీఎల్ విజేతగా నిలిచినప్పుడు ముంబై జట్టుతో పరాస్ పనిచేశాడు. ఇక, ముంబై చీఫ్ కోచ్‌గా మహేల జయవర్దనే వ్యవహరించనున్న సంగతి తెలిసిందే.

హర్మన్ కెప్టెన్సీపై వేటు?

బీసీసీఐ నిర్ణయం!

త్వరలో సెలెక్షన్ కమిటీ భేటీ



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్ కప్‌లో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగి గ్రూపు దశ నుంచే వైదొలగడం..భారత జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ పదవికి ఎసరు తెచ్చేలా ఉంది. టీమిండియా దారుణ ప్రదర్శనపై బీసీసీఐ ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం. ఈమేరకు హర్మన్‌ప్రీత్‌ను సారథ్య బాధ్యతలనుంచి తప్పించాలని బోర్డు పెద్దలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రపంచ కప్ గ్రూపు ‘ఎ’లో తలపడిన భారత్ నాలుగు మ్యాచ్‌ల్లో రెండింటిలో గెలిచి మరో రెండింటిలో ఓడింది. దాంతో మొత్తం నాలుగు పాయింట్లతో ఐదు జట్ల గ్రూపులో మూడోస్థానంతో టోర్నీనుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే. కాగా..ఈనెల 24 నుంచి భారత్‌లో న్యూజిలాండ్ మహిళల జట్టు పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు జరగనున్నాయి. ఈ సిరీస్‌కు టీమిండియాను ఎంపిక చేసేందుకు సెలెక్టర్లు సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా సెలెక్షన్ కమిటీ, జట్టు చీఫ్ కోచ్ అమోల్ మజుందార్‌తో భేటీ అయ్యే బీసీసీఐ పెద్దలు హర్మన్‌ప్రీత్ భవితవ్యంపై నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. ‘జట్టుకు కొత్త కెప్టెన్ ఉండాలా..వద్దా..అనే విషయమై బీసీసీఐ తప్పకుండా చర్చిస్తుంది. జట్టు ఏది కావాలంటే అది బోర్డు ఇచ్చింది. కానీ జట్టు ప్రదర్శన గమనిస్తే కొత్త సారథిని నియమించే సమయం ఆసన్నమైందని భావిస్తున్నాం. హర్మన్‌ప్రీత్ జట్టులో ముఖ్య సభ్యురాలిగానే కొనసాగుతుంది. కాకపోతే.. మార్పునకు ఇదే తగిన సమయం’ అని బోర్డు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. అయితే హర్మన్‌ను తొలగిస్తే..వైస్-కెప్టెన్ స్మృతి మంధానాకు సారథ్య బాధ్యతలు అప్పగిస్తారా లేక జెమీమా రోడ్రిగ్స్ పేరును పరిశీలిస్తారా అన్నది చూడాలి.. 2016లో హర్మన్ టీ20 జట్టు కెప్టెన్‌గా నియమితురాలైంది. ఆమె సారథ్యంలో 2018, 2023 టీ20 ప్రపంచ కప్ సెమీస్‌కు క్వాలిఫై అయిన జట్టు.. 2020లో ఫైనల్‌కు చేరింది.

ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టిన సాజిద్

● డకెట్ సెంచరీ ● స్టోక్స్ సేన 239/6, పాక్ 366

ముల్తాన్: స్పిన్నర్ సాజిద్ ఖాన్ (4/86) తిప్పేయడంతో.. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ పైచేయి సాధించింది. ఓపెనర్ బెన్ డకెట్ (114) మినహా మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో.. ఆటకు రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 239/6 స్కోరు చేసింది. బుధవారం ఆట చివరకు జేమీ స్మిత్ (12), కార్స్ (2) క్రీజులో ఉన్నారు. 10 బంతుల తేడాతో రూట్ (34), డకెట్, బ్రూక్ (9)ను అవుట్ చేసిన సాజిద్.. స్టోక్స్ సేనను గట్టి దెబ్బ కొట్టాడు. కాగా, ఓవర్‌నైట్ స్కోరు 259/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాక్ 366 రన్స్‌కు ఆలౌటైంది. లీచ్ 4, కార్స్ 3 వికెట్లు పడగొట్టారు.

అత్యంత ధనవంతుడు అజయ్ జడేజా!



న్యూఢిల్లీ: భారత్‌లో ధనవంతుడైన క్రికెటర్‌గా అజయ్ జడేజా నిలిచాడు. అతడి నికర ఆస్తుల విలువ అక్షరాల రూ. 1450 కోట్లు!! దసరానాడు అజయ్ జడేజాను గుజరాత్‌లోని జామ్‌నగర్ సంస్థానానికి వారసుడిగా ప్రకటించారు. దాంతో రూ. 1450 కోట్లు జడేజాకు వారసత్వంగా లభించనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటిదాకా రూ. వేయి కోట్ల నికర విలువతో టాప్‌లో ఉన్న విరాట్ కోహ్లీని జడేజా పక్కకు నెట్టేశాడు!

అఖిల్‌కు కాంస్యం



న్యూఢిల్లీ: సొంత గడ్డపై జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ ఫైనల్ టోర్నమెంట్‌లో భారత షూటర్ అఖిల్ షెరాన్ పతకంతో మెరిశాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కాంస్యం సాధించాడు. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో పారిస్ ఒలింపిక్స్ విజేత లూ యుకున్ (చైనా)ను అధిగమించిన అఖిల్ 452.6 స్కోరుతో మూడోస్థానంలో నిలిచాడు. హంగేరీ షూటర్ ఇస్త్‌వాన్ పెని స్వర్ణం, చెక్ రిపబ్లిక్‌కు చెందిన జిరి ప్రివ్‌రాస్కీ రజతం గెలిచారు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది రెండో పతకం. మంగళవారం మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో సోనమ్ మస్కార్ రజతం నెగ్గింది.



ఆంధ్రజ్యోతి

నవ్య

11

కుటుంబ కదంబం

గురువారం

17 అక్టోబరు 2024

సంకల్పం

పదిహేనేళ్లకే పెళ్లి. పద్దెనిమిదేళ్లు నిండకుండానే ఒక బిడ్డకు తల్లి. వద్దు వద్దని మొత్తుకున్నా పుట్టింటివాళ్లు బరువు వదిలించుకున్నారు. అత్తింటివారు మాఇంటికి రావద్దని అన్నారు. అందరూ ఉండి ఒంటరి అయ్యారు 24 ఏళ్ల రోషిణీ పర్వీన్. కానీ ఆమె కుంగిపోలేదు. విపత్కర పరిస్థితులకు ఎదురొడ్డి ఆత్మవిశ్వాసంతో నిలబడ్డారు. బాల్య వివాహాలను అరికడుతూ... ఎందరో బాలికల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు.

నా కష్టం... వేరొకరికి రాకూడదని...

"నా బాల్యం అంతా ముళ్ల బాటలోనే సాగింది. బాగా చదువుకొని... ఒకరిపై ఆధారపడకుండా నా బతుకు నేను బతుకుదామని అనుకున్నా. కానీ ఆ సంకల్పానికి మా అమ్మానాన్నలే విఘాతం కలిగించారు. బీహార్ రాష్ట్రం కిషన్‌గంజ్ జిల్లాలోని మారుమూల పల్లె సిమల్‌బారీలో ఓ సాధారణ కుటుంబం మాది. ఎనిమిదో తరగతి వరకు అంతా బాగానే సాగింది. ఎప్పుడైతే తొమ్మిదో తరగతిలోకి అడుగుపెట్టానో అప్పటి నుంచీ ఊహించని కష్టాలు వచ్చిపడ్డాయి. మా ఇంట్లోవాళ్లు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. 'ఇంకా పదో తరగతి కూడా పూర్తవ్వలేదు. అప్పుడే పెళ్లేంటి?' అని అడిగాను. నాకు ఇంకా చదువుకోవాలని ఉందని, అప్పటివరకు ఓపిక పట్టమని ప్రాధేయపడ్డాను. అమ్మానాన్న వినలేదు. రోజూ ఎవరూ ఒకరు నన్ను చూడ్డానికి వచ్చేవారు. చాలా



సంబంధాలు తిప్పి పంపాను. అయినా వాళ్ల ప్రయత్నం ఆగలేదు. చివరకు నా పోరాటం వృథా అయింది. బలవంతంగా పెళ్లి చేశారు. అది కూడా నాకంటే వయసులో మూడు రెట్లు పెద్దవాడితో. అప్పుడతనికి 45 సంవత్సరాలు. అత్తింటికి వెళ్లేవరకు అతని వయసు నాకు తెలియదు. వివాహ బంధం అంటే ఏంటో కూడా అవగాహన లేదు. వేధింపులు ఎక్కువయ్యాయి. దాంతో భయం వేసి మూడు నెలలకే మా ఇంటికి వెళ్లిపోయాను.

పుట్టింటివారూ పట్టించుకోలేదు...

కొన్నాళ్లకు తెలిసింది... నేను గర్భవతిని అని. తరువాత బాబు పుట్టాడు. భర్త దగ్గరకు వెళ్లమని అమ్మానాన్న చెప్పారు. నేను ఆ నరకంలోకి మళ్లీ వెళ్లాలనుకోలేదు. కానీ ఇంట్లోవాళ్లు బలవంతం చేశారు. వెళితే... అత్తింటివాళ్లు నన్ను లోపలికి రానివ్వలేదు. ఏడాది దూరంగా ఉన్నానని, అందుకే నేను తనకు వద్దని నా భర్త తెగేసి చెప్పాడు. మా ఇంట్లోవాళ్లు కూడా నన్ను రానివ్వలేదు. అందరూ ఉండి ఎవరూ లేని అనాథనయ్యాను. చంకలో పసి బిడ్డతో రోడ్డున పడ్డాను. అలాగని బాధతో కూర్చోలేదు. నా కాళ్ల మీద నేను నిలబడాలని ఆ క్షణమే బలంగా నిర్ణయించుకున్నాను.

'యునిసెఫ్'తో కలిసి...

'సేవ్ ది చిల్డ్రన్, యునిసెఫ్' తదితర స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో బీహార్‌లోని చాలా గ్రామాలు తిరిగాను. బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు చెప్పాను. అది వారి భవిష్యత్తును మొగ్గలోనే చిదిమేస్తుందని, అది చట్టవిరుద్ధమని వివరించాను. ఫలితంగా ఇప్పటికి పదుల సంఖ్యలో బాల్య వివాహాలు ఆపగలిగాను. నా ప్రయత్నానికి ప్రోత్సాహకంగా రెండేళ్ల కిందట జెనీవాలో జరిగిన సదస్సులో 'యునైటెడ్ నేషన్స్' నాకు ప్రతిష్ఠాత్మక అవార్డునిచ్చి సత్కరించింది. సమాజంలో పాతుకుపోయిన కట్టుబాట్లను దాటి, మహిళల జీవితాల్లో మంచి మార్పునకు కృషి చేస్తున్నందుకుగానూ నన్ను కొనియాడింది.

బంధాలు తెంచుకుని...

నన్ను వద్దనుకున్న భర్త, నాకు ఆశ్రయం ఇవ్వని తల్లిదండ్రులు, సామాజిక కట్టుబాట్లు... బంధాలన్నిటినీ తెంచుకొని ధైర్యంగా అడుగు బయటకు వేశాను. నా కోసం, నా బిడ్డకు బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలని సంకల్పించాను. తొలుత ఒక షోరూమ్‌లో హెల్పర్‌గా చేరాను. అదే సమయంలో 'చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్'లో వాలంటీర్‌గా పని చేశాను. అక్కడ నాలా భయంకరమైన కథలున్న మహిళలు చాలామందిని చూశాను. బాల్య వివాహానికి బలయింది నేనొక్కదాన్నే కాదని అప్పుడు అర్థమైంది. అలాంటి మహిళల గళం నేనెందుకు కాకూడదనే ఆలోచన వచ్చింది. నాటి నుంచి మహిళల హక్కుల సాధన, సాధికారత దిశగా అడుగులు వేశాను. ముఖ్యంగా బాల్య వివాహాలను నియంత్రించడంపై దృష్టి పెట్టాను.

పాఠశాలల్లో పునాది...

సమాజంలో రుగ్మతలు రూపుమాపి, బాల్య వివాహాలు అరికట్టాలంటే తల్లిదండ్రులతో పాటు బాలికలకు కూడా అవగాహన కల్పించాలి. ఆ ఉద్దేశంతోనే పలు గ్రామాల్లోని బాలికలతో పదిహేను బృందాలు ఏర్పాటు చేశాను. స్థానిక పెద్దలు, నాయకుల సాయం కూడా తీసుకున్నాను. వారందరి సహకారంతో ఎక్కడైనా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తాను. ఎక్కడైనా అందుకు



ఏర్పాట్లు జరుగుతుంటే తక్షణం వెళ్లి, పెద్దలతో మాట్లాడి ఆపడానికి ప్రయత్నిస్తాను. ఒకవేళ వినకపోతే తదనంతర పరిణామాల గురించి వివరిస్తాను. అప్పటికీ దారికి రాకపోతే పోలీసుల సహాయం తీసుకొంటాను.

ఇక్కడే ఎక్కువ...

'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే' (ఎన్ఎఫ్‌హెచ్ఎస్)-5 నివేదిక ప్రకారం... 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసుగల ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరు 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకున్నవారే. అంత చిన్న వయసులో వివాహ బంధంలోకి అడుగుపెట్టడంవల్ల వాళ్లు విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. అది వారికి జీవితాంతం ఒక మాయని గాయంలా మిగిలిపోతోంది. అలాగే మహిళల అక్రమ రవాణా కూడా పెద్ద సమస్యగా మారింది. వీటన్నిటిపైనా ఒక యుద్ధమే చేస్తున్నా. అమ్మాయిలు నిర్భయంగా తమ జీవితానికి ఏంకావాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛను కల్పించేందుకు కృషి చేస్తున్నా. స్వయంసాధికారత దిశగా వారిని నడిపించేందుకు నావంతు ప్రయత్నం ఇది."

కౌన్సెలింగ్

కడుపులో నొప్పి ఎందుకు?

డాక్టర్! తరచూ కడుపు నొప్పి వేధిస్తోంది. నొప్పి ఎందుకొస్తుందో, అసలు కారణమేంటో తెలియడం లేదు. లక్షణాలను బట్టి నొప్పికి మూల కారణాన్ని కనిపెట్టే మార్గం ఉందా?

- ఓ సోదరి, హైదరాబాద్.

నొప్పి వచ్చే ప్రదేశాన్ని బట్టి కడుపు నొప్పికి కారణాన్ని కనిపెట్టొచ్చు. తిన్న ఆహారం జీర్ణం కాకపోయినా, కలుషిత ఆహారం తీసుకున్నా కడుపు నొప్పి తప్పదు. ఈ నొప్పుల్లో రకాలున్నాయి. అవేంటంటే...- అసిడిటీ నొప్పి: మసాలాలు, పులుపు, కారాలతో కూడిన పదార్థాలు తినటం వల్ల అసిడిటీతో, పొట్టలో నొప్పి మొదలవుతుంది. ఈ నొప్పి పొట్ట పైభాగంలో మొదలవుతుంది. కడుపు ఉబ్బరం, బ్రేవ్‌గా తయారవటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్నిసార్లు పొట్టలో, కత్తితో పొడిచినంత విపరీతమైన నొప్పి కూడా రావొచ్చు. సాధారణంగా ఈ నొప్పి ఒకటి, రెండు రోజుల్లో తగ్గిపోతుంది. ఆ సమయంలో పెరుగు, మజ్జిగ తీసుకుంటూ ఉప్పు, పులుపు, కారాలు తగ్గిస్తే అసిడిటీ తాలూకు నొప్పి తగ్గిపోతుంది. ఈ జాగ్రత్తలు తీసుకున్నా రెండు రోజులకు మించి నొప్పి వేధిస్తే, తప్పనిసరిగా వైద్యుల్ని సంప్రదించాలి.

- **గాల్ బ్లాడర్ స్టోన్స్:** గాల్ బ్లాడర్‌లో రాళ్లున్న వాళ్లు నూనె పదార్థాలు తిన్న వెంటనే కడుపులో నొప్పి మొదలవుతుంది. ఈ నొప్పి కుడి వైపు డొక్కలో మొదలవుతుంది. నొప్పి భరించలేనంత తీవ్రంగా ఉంటుంది. వాంతులు కూడా అవుతాయి. ఇలా గాల్‌బ్లాడర్‌లో రాళ్లున్న వ్యక్తులు నూనె పదార్థాలు తిన్నప్పుడు గాల్ బ్లాడర్ నుంచి రాళ్లు బయటకి రావటానికి ప్రయత్నిస్తాయి. దాంతో పొట్టలో నొప్పి మొదలవుతుంది. ఈ లక్షణం కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. గాల్ బ్లాడర్ వాపు, రాళ్ల పరిమాణం, కదలికలను బట్టి వైద్యులు మొదట యాంటీబయాటిక్స్, అవసరాన్నిబట్టి సర్జరీని ఎంచుకుంటారు.
- **పాంక్రియాటిక్ పెయిన్:** ముఖ్యంగా మద్యపానం చేస్తూ ఆ సమయంలో నూనెతో కూడిన పదార్థాలు తినేవారికి ఈ నొప్పి వస్తుంది. పొట్ట మధ్య భాగంలో, పైన నొప్పి ఉంటుంది. పొట్ట నుంచి వీపులోకి కూడా నొప్పి ప్రసరిస్తుంది. పాంక్రియాస్ వెనక భాగంలో ఉంటుంది కాబట్టి వెల్లకిలా పడుకుంటే దాని మీద ఒత్తిడి పడి నొప్పి ఎక్కువవుతుంది. దాంతో రోగి బోర్లా పడుకోవటానికి ఇష్టపడతాడు. సాధారణంగా సెలైన్లు, యాంటీబయాటిక్స్‌తో ఈ నొప్పిని అదుపులోకి తేవొచ్చు. మద్యపానం మానేసి, కొలస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకుంటే పాంక్రియాస్ నొప్పిని నియంత్రించవచ్చు.



- **చిన్న పేగు, పెద్ద పేగుల్లో ఇన్‌ఫెక్షన్:** వర్షాకాలం ఆహారం, నీరు కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువ. దాంతో చిన్నపేగు, పెద్దపేగులు ఇన్‌ఫెక్షన్‌కు గురై బొడ్డు చుట్టూ నొప్పి, విరేచనాలు మొదలవుతాయి. ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల వాంతులు కూడా అవుతాయి. ఈ సమస్యను కూడా మందులతో అదుపు చేయొచ్చు. అలాగే ఇన్‌ఫెక్షన్‌కు గురైన రోగులు శుభ్రమైన ఆహారం, నీరు మాత్రమే తీసుకోవాలి.

డాక్టర్. భవానీ రాజు

సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హైదరాబాద్.

స్ఫూర్తి

అంతా సవ్యంగా సాగిపోతోంది అనుకుంటున్న సమయంలోనే ఉపద్రవాలు విరుచుకుపడతాయి. మీరట్‌కు చెందిన 45 ఏళ్ల లవీనా జైన్ విషయంలో ఇదే జరిగింది. ఆ దంపతులిద్దరూ కేన్సర్ బారిన పడడం, కుటుంబం రోడ్డున పడడం ఒకేసారి జరిగిపోయాయి. అయినా తనకెంతో ఇష్టమైన పచ్చళ్ల వ్యాపారంతో కుటుంబాన్నెలా కాపాడుకుందో ఆమె మాటల్లోనే తెలుసుకుందాం!

కేన్సర్‌ను జయించి.. పచ్చళ్లతో పైకెదిగి..

"రొమ్ము కేన్సర్ సోకినప్పుడు, ఆదుకోడానికి ఆయన ఉన్నారని గుండె దిటవు చేసుకున్నాను. కానీ అదే సమయంలో ఆయన కూడా నోటి కేన్సర్ బారిన పడ్డారు. ఇద్దరికీ సర్జరీలు పూర్తయి, కీమోథెరపీలు మొదలయ్యాయి. ఒకే కుటుంబంలో ఇద్దరు కేన్సర్ రోగులుంటే, ఆర్థిక పరిస్థితులు ఎంతలా దిగజారుతాయో ఎవరికీ తెలియనిది కాదు. బాబు పదో తరగతి చదువుతున్నాడు. పాప ఇంకా చిన్నది. ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్‌లో వచ్చే ఆదాయమంతా మా చికిత్సలకే సరిపోతోంది. దాంతో ఇల్లు గడవడం కష్టమైపో



యింది. బంధువులు ఇల్లు అమ్మేయమని సలహా ఇచ్చారు. కానీ పిల్లలకు మేం సంపాదించి పెట్టిన ఆస్తి అదొక్కటే! కాబట్టి అందుకు మనసొప్పలేదు. ఏం చేయలో పాలుపోని పరిస్థితి.

పాత సీసాల్లో నింపి...

నాకు పచ్చళ్ల తయారీ వచ్చు. నిల్వ పచ్చళ్లు బ్రహ్మాండంగా తయారుచేస్తూ ఉంటాను. ఆ ఆసక్తినే ఆదాయంగా ఎందుకు మలుచుకోకూడదు? అని మావారు ప్రశ్నించారు. నిజమే! స్కూలు రోజుల్లో ఫుడ్ ప్రిపరేషన్ కోర్సు కూడా పూర్తి చేశాను. కాబట్టి ఆ జ్ఞానాన్ని పచ్చళ్ల తయారీలో ప్రవేశపెట్టి, నిల్వ పచ్చళ్లు, పానీయాలను తయారుచేసి అమ్మాలనే ఆలోచన వచ్చింది. అలా 2012లో, 1500 రూపాయల పెట్టుబడితో, 10 సీసాల లెమన్ స్క్వాష్ తయారుచేశాను. అప్పట్లో సీసాలు కొనే స్తోమత లేకపోవడంతో, ఇంట్లో ఉన్న పాత సీసాలే ఉపయోగించాను. కానీ వాటినెలా అమ్మాలో తెలియలేదు. అమ్మకాల కోసం, ఎక్కువ మహిళలు కలుసుకునే వేడుకలను ఎంచుకున్నాను. లెమన్ స్క్వాష్‌తో పాటు, 5 కిలోల మామిడి కాయ పచ్చడి, పది కిలోల నిమ్మ పచ్చళ్లను చిన్న చిన్న కిట్టీ పార్టీలు, వేడుకలకు హాజరయ్యే మహిళలకు పరిచయం చేశాను.

ఒడిదొడుకులను ఎదుర్కొని...

మొదటి మూడేళ్లూ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నాను. అయినా పిల్లలకు మంచి జీవితాన్నివ్వాలనే పట్టుదలతో, రేయింబవళ్లూ కష్టపడ్డాను. 12వ తరగతి పరీక్షల కోసం సిద్ధపడుతున్న మా అబ్బాయి, పగలంతా పచ్చళ్ల తయారీలో సహాయం చేసి, అర్ధరాత్రి దాటిన తర్వాత, కొద్దిపాటి సమయాన్నే చదువుకు కేటాయించేవాడు. మరో పక్క భర్త ఆరోగ్య సమస్యలు మళ్లీ తిరగబెట్టాయి. ఆయన సరిగా మాట్లాడలేక పోయేవారు, వినలేక పోయేవారు. మూడేళ్లకు నా శ్రమ ఫలించింది. నా పచ్చళ్లను మంచి గుర్తింపు లభించింది. లవీన తృప్తి పేరుతో, కాకర, అల్లం పచ్చళ్లతో పాటు, చట్నీలు, అప్పడాలు, స్క్వాష్‌లు, జామ్స్... ఇలా ఎన్నో రకాల ప్రొడక్ట్స్‌ను తయారు చేయడం మొదలుపెట్టాను. ఈ రోజు 60 నుంచి 70 రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నాను. పిఎమ్ ముద్ర యోజన పథకం సహాయంతో, యుపి హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా కిసాన్ మేళా, వరల్డ్ ఫుడ్ ఇండియా 2024లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లలో నా ఉత్పత్తులను ప్రదర్శించాను. ఇప్పటికి పచ్చళ్ల వ్యాపారంలోకి అడుగుపెట్టి 13 ఏళ్లు. ఇంత దూరం రాగలుగుతానని నేనెప్పుడూ అనుకోలేదు. పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించాలనే పట్టుదల వల్లే, ప్రారంభంలో ఎదురైన కష్టాలకు, సవాళ్లకు కుంగిపోకుండా, ధైర్యంగా ముందడుగు వేయగలిగాను. అంతిమంగా విజయం సాధించగలిగాను."

మనకు ఏదైనా సమస్య వస్తే... దాని నుంచి బయటపడితే చాలనుకుంటాం. ఆ సమస్య ఉన్నవారందరికీ ఒక దారి చూపించాలనుకొనేవారు చాలా కొద్దిమంది. వారిలో రూప్‌మణి ఛత్రి ఒకరు. పుట్టుకతోనే ఉన్న వినికిడి లోపాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారు. 'సైనబుల్' అనే యాప్‌తో తనలాంటి ఎంతోమందికి కొత్త జీవితాన్నిస్తున్నారు.

సైగల యాప్‌తో వినిపిస్తున్నారు..

"ఏ పిల్లలకూ ఎదురవకూడదని కోరుకోవాల్సిన బాల్యం నాది. పుట్టుకతోనే నాకు వినికిడి శక్తి లేదు. దాంతో నా సొంత కుటుంబమే నన్ను వెలివేసినట్టుగా ప్రవర్తించేది. కుటుంబ కార్యక్రమాలకు, సంభాషణలకు నన్ను దూరంగా ఉంచేవారు. 'ప్రపంచంలో నేను మాత్రమే బధిరురాల్ని' అని అప్పట్లో నేను గట్టిగా నమ్మేదాన్ని. 'నాకే ఎందుకిలా జరిగింది?' అని బాధపడని రోజు లేదు. నా స్వస్థలం డార్జిలింగ్. అప్పట్లో బధిరుల కోసం ప్రత్యేకమైన స్కూల్ లేదు. మా నాన్న సెక్యూరిటీ గార్డ్‌గా పని చేసేవారు. ఆర్థిక సమస్యల కారణంగా... ప్రభుత్వ పాఠశాలలో చేర్చారు. నేను బడిలో ఏదైనా సైగల ద్వారా చెప్పడానికి ప్రయత్నించేదాన్ని. నా వైకల్యాన్ని గుర్తించడంలో విఫలమైన టీచర్లు నాకు తరచూ పనిష్మెంట్లు ఇచ్చేవారు. బధిర బాలికని కావడంతో... తోటి పిల్లలు పట్టించుకొనేవాళ్ళు కాదు. నా చదువంతా కేవలం నోట్సుల్ని చూసి రాసుకోవడమే. పాఠ్యాంశాలేవీ నాకు అర్థమయ్యేవి కావు. ఇక మా ఇంట్లో చూస్తే... నాకు చదువు చెప్పించడం అనవసరమనే భావనలో మా పెద్దలు ఉండేవాళ్ళు. కొన్నాళ్ళు స్పీచ్ థెరపీలో నన్ను చేర్పించినా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. కష్టపడి తొమ్మిదో తరగతి వరకూ చదివాను. ఆ తరువాత నాకు పెళ్ళి చేశారు. నా భర్త కూడా బధిరుడే. ఢిల్లీలోని అత్తవారింటికి వెళ్ళాను. అక్కడ నన్ను తీవ్రంగా వేధించేవారు. దాంతో నా పుట్టింటికి వెళ్ళాను. "నీ బతుకు నువ్వే చక్కదిద్దుకోవాలి. మేమేం చెయ్యలేం" అన్నారు నా తల్లితండ్రులు.

నన్ను పట్టించుకొనేవారు కాదు...

ఢిల్లీకి తిరిగివచ్చి, చిన్న ఉద్యోగంలో చేరాను. 2011లో... నా భర్తతో విడాకులు తీసుకున్నాను. ఆ తరువాత... నేను ఆపేసిన హైస్కూల్, సోషియాలజీలో డిగ్రీ పూర్తి చేశాను. ఈ క్రమంలో నాకు అనేకమంది బధిరులు పరిచయం అయ్యారు. మొట్టమొదట... పూర్తి అర్థవంతమైన సైగల భాషను నేను చూసింది అక్కడే. కానీ నాకు ఆ భాష రాకపోవడంతో వాళ్ళు నన్ను పట్టించుకొనేవాళ్ళు కాదు. చివరకు నోడియాలో 'డెఫ్ సొసైటీ', 'ది వే డెఫ్' లాంటి సంస్థల గురించి తెలుసుకొని, వాటిని సంప్రతించాను. సైగల భాషలో శిక్షణ తీసుకున్నాను. డిగ్రీ పూర్తయ్యాక ఢిల్లీలోని ఒక ఎన్జీవోతో పని చేశాను. అప్పుడే 'యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' (యుఎన్‌డిపి) తరఫున యూరప్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. కమ్యూనికేషన్ అసిస్టెంట్‌గా... ఉక్రెయిన్ యుద్ధ బాధితుల సహాయక కార్యక్రమాల్లో పని చేశాను. వినికిడి సమస్య ఉన్న పిల్లలకు సైగల భాష తరగతులు నిర్వహించాను. జర్మనీలో, ఇండియాలో కూడా ఐక్యరాజ్యసమితి కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకున్నాను.

రిస్క్ అని తెలిసినా...

ఉక్రెయిన్‌లో పని చేసిన ఏడాదిన్నర కాలం నా జీవితంలో చాలా క్లిష్టమైనది. ఆ దేశానికి వెళ్ళొద్దని చాలా మంది హెచ్చరించారు. అది రిస్క్ అని నాకూ తెలుసు. కానీ ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవాలని నిశ్చయించుకున్నాను. యుద్ధంలో ఎంతోమంది వికలాంగులయ్యారు, చాలామంది గాయపడ్డారు. మూడు వందల మందికి పైగా బధిరులు నిరాశ్రయులయ్యారు. నేను వారిని కలిసినప్పుడు... తోటి బధిర వ్యక్తిగా నన్ను సాయం అడిగేవారు. యుద్ధం లాంటి విపత్తు తరువాత తలెత్తే మానసిక సంఘర్షణల్ని ఎలా ఎదుర్కోవాలో వారికి నేర్పించాను. ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఉన్న ఎన్నో సంస్థలు అక్కడ చేపట్టిన సహాయక కార్యక్రమాల్లో భాగస్వామినయ్యాను. యూరప్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చాక... మళ్ళీ ఉద్యోగం కోసం వేట మొదలుపెట్టాను. అదే సమయంలో... సైగల భాషను అవసరమైనవారందరికీ అందుబాటులో తేవడానికి ఏదైనా చెయ్యాలని ప్రణాళికలు వేసుకొనేదాన్ని. అప్పుడే నాకు తరుణ్ సర్వాల్ పరిచయం అయ్యారు. ఆయన యూరప్‌లో దాతృత్వ సంస్థలతో పదేళ్ళకు పైగా పని చేశారు. బధిరులకు ఏది అవసరమో కచ్చితంగా తెలుసుకోవడానికి ఆయన ఒక ప్రాజెక్ట్ ప్రారంభించారు. అందులో నేను ఉద్యోగిగా చేరాను. ఆయనకు కూడా సైగల భాష నేర్పించాను. అప్పుడే ఒక యాప్ రూపొందించాలనే ఆలోచన మాకు వచ్చింది. విదేశాల్లో ఉన్నప్పుడు, నా పురోగతికి అవసరమైన సమాచారం, వనరులు పెద్ద స్థాయిలో అందుబాటులో ఉండేవి. మన దేశంలో కూడా వినికిడి సమస్య ఉన్న వారు తమకి ఇష్టమైన రంగంలో రాణించడానికి అవసరమైన అంశాలన్నీ సైగల భాషలో అందుబాటులో ఉంచాలని నిర్ణయించుకున్నాం. అలా 2019లో 'సైనబుల్' అనే వెంచర్ ప్రారంభించాం.



అది ప్రాథమిక హక్కు...


ఈ రోజు సైనబుల్ ఒక వైవిధ్యభరితమైన వేదిక. ఇక్కడ దాదాపు యాభై మంది ఇంటర్‌ప్రిటర్స్ ఉన్నారు. బధిరులు ఎదుర్కొంటున్న కమ్యూనికేషన్ అవరోధాలను ఇంగ్లీష్‌తో పాటు పన్నెండు వేర్వేరు భాషల్లో... వారు అధిగమించేలా చేస్తున్నారు. యూట్యూబ్‌లో ఉన్న కంటెంట్ ప్రత్యక్షానువాదంతో పాటు పాఠ్యాంశాలు తదితరాలను నేర్చుకోవడానికి వీలుగా అనువాదాలు చేయడం, టెక్స్ట్ నుంచి సైగల భాషలోకి అనువర్తన... ఇలా ఎన్నో సేవల్ని మేం అందిస్తున్నాం. ఇండియన్ సైన్ లాంగ్వేజ్ కోర్సెస్ కూడా నిర్వహిస్తున్నాం. ఇంటర్‌ప్రిటర్లందరికీ కఠోరమైన శిక్షణ ఉంటుంది. ఇప్పటి వరకూ 350 మందికి పైగా ఇంటర్‌ప్రిటర్స్‌ను మేం తయారు చేశాం. అనువాద సేవలతో పాటు, 'అమెజాన్', 'విప్రో', 'యాక్సెంచర్' తదితర కంపెనీల్లో ఉద్యోగులకు, ఉన్నతస్థాయిలో ఉన్నవారికి శిక్షణ, కమ్యూనికేషన్ సపోర్ట్ అందిస్తున్నాం. ఇప్పటివరకూ కొన్ని వేలమంది బధిరులు మా ద్వారా ప్రయోజనం పొందారు.. నామమాత్రపు రుసుముతో మా యాప్ సేవల్ని అందుబాటులో ఉంచుతున్నాం. కార్పొరేట్ సంస్థల నుంచి విరాళాలతో పాటు, జీఎస్ఎంఏ తదితర సంస్థలు నిర్వహించే పోటీల్లో పాల్గొనడం ద్వారా నిధులు సమకూర్చుకుంటున్నాం. 'సైనబుల్' ఎంతో మంది బధిరులకు విద్య, ఉపాధి రంగాల్లో కొత్త అవకాశాలను చూపిస్తోంది. మూడేళ్ళ క్రితం 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' నిర్వహించిన ఒక సర్వే ప్రకారం భారత దేశంలో కనీసం కోటీ ఇరవై లక్షల మంది వినికిడి సమస్యలతో బాధపడుతున్నారు. సైగల భాష బధిరులకు మాతృభాష లాంటిది. తమను తాము వ్యక్తీకరించుకోడానికీ, కమ్యూనికేట్ చేసుకోవడానికి అది సాయపడుతుంది. అందుకే అది ఒక ప్రాథమిక హక్కు. వినికిడి సమస్యలున్నవారికి చిన్నతనంలోనే దాన్ని నేర్పించాలి. దీనికోసం మా వంతుగా తల్లితండ్రులకు శిక్షణ ఇవ్వడానికి, పాఠశాలల్లోని బధిర విద్యార్థులకు సైగల భాష నేర్పించడానికి ప్రణాళికలు రూపొందించాం. వైకల్యం కారణంగా ఎవరూ వివక్షకు గురికాకూడదు, ఎవరూ అవకాశాలను కోల్పోకూడదు. ఇదే నా ఆశయం."



తియ్యని ఖర్జూర తినేద్దామా!

ఖర్జూర అద్భుతమైన పోషకాహారం. శరీరంలో పిత్తం ఎక్కువగా ఉన్నవారు ఖర్జూరపండును, వాత శరీరం ఉన్నవారు ఎండు ఖర్జూరాన్ని తినడం మంచిది. ఎండు ఖర్జూర అనేది డ్రై ఫ్రూట్స్‌లో ఒకటైనప్పటికీ ఇందులో షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందనే అపోహతో దీనిని తక్కువగా వినియోగిస్తుంటారు. ఖర్జూరలో అత్యధికంగా ఫైబర్‌తోపాటు ప్రొటీన్లు, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. రోజుకు మూడు ఖర్జూరాలు తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. క్యాన్సర్‌ను నిరోధించడంలో, బరువు తగ్గడంలో, శరీరాన్ని ఫిట్‌గా ఉంచడంలో ఖర్జూర పాత్ర విశేషమైంది.

- ఖర్జూరలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. గుండె కొట్టుకునే వేగాన్ని, రక్తపోటును సాధారణ స్థాయిలో ఉంచుతాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- నీటిలో నానబెట్టిన ఎండు ఖర్జూరాలు తినడం వల్ల మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తక్షణ శక్తి లభిస్తుంది.



- మహిళలు ప్రతిరోజూ ఖర్జూర తింటే రుతుక్రమం సరిగా ఉంటుంది. హార్మోన్లు నియంత్రణలో ఉంటాయి. గర్భధారణ సమయంలో ఆక్సిటోసిన్ డిమాండ్‌ను తగ్గిస్తుంది. గర్భవతులకు సహజ ప్రసవం అవుతుంది. కాలేయ సమస్యలు కూడా దూరమవుతాయి.
- ప్రతిరోజూ ఉదయం అల్పాహారంలో ఖర్జూరాలు ఉండేలా చూసుకుంటే శరీరానికి అవసరమైన విటమిన్లు అంది చర్మం కాంతివంతంగా మారుతుంది. శిరోజాలు ఆరోగ్యంగా పెరుగుతాయి. ఆందోళన తగ్గి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అల్జీమర్స్ లక్షణాలు తగ్గుతాయి.
- ఖర్జూరలో చక్కెర కంటెంట్ ఉన్నప్పటికీ అది రక్తంలో చక్కెర స్థాయిని త్వరగా పెంచదు. వ్యాయామం చేయడానికి అరగంట ముందు రెండు నుంచి నాలుగు ఖర్జూరాలు తీసుకుంటే శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుంది. వీటిలోని మెగ్నీషియం, సెలీనియం, మాంగనీస్ వంటి సూక్ష్మ పోషకాలు ఎముకల బలోపేతానికి దోహదం చేస్తాయి.
- బాగా ఆకలిగా ఉన్నపుడు భోజనానికి ముందు ఖర్జూరాలు తినడం వల్ల నోటిలో ప్రత్యేకమైన ఎంజైమ్‌లు విడుదలవుతాయి. ఇవి భోజనం తరవాత పొట్టలోని ఆహారం సక్రమంగా జీర్ణం కావడానికి సహాయం చేస్తాయి.
- అర్ధరాత్రి సమయంలో ఆకలి అనిపించినపుడు రెండు లేదా మూడు ఖర్జూరాలు తినడం వల్ల పొట్ట నిండిన అనుభూతి కలిగి మంచి నిద్ర పడుతుంది.

ఇంజనీర్లను బదిలీ చేయొద్దు

శ్రీశైలం ప్రాజెక్టు భద్రత, నిర్వహణ దృష్ట్యా ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, అక్కడ పని చేస్తున్న ఇంజనీర్లను ఎట్టి పరిస్థితుల్లో బదిలీ చేయొద్దని ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి ఈఎన్‌సీ (అడ్మిన్)కు లేఖ రాశారు. ఖాళీలు భర్తీ చేయకపోగా ఇక్కడ పని చేసే ఇంజనీర్లను బదిలీ చేయడం గమనార్హం. ఇద్దరు ఈఈలను శ్రీశైలం ప్రాజెక్టుకు బదిలీ చేసినా వారు జాయిన్ కాలేదు. డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వారు రాజకీయంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఏఈఈ ఒకరిని పాత తేదీతో ఉత్తర్వులిచ్చి బదిలీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం



ప్రమాదంలో శ్రీశైలం!

నిధులు ఉన్నా నిర్వహణ ప్రశ్నార్థకం

- డ్యాం మరమ్మతులకు రూ.103 కోట్లు
- ప్లంజ్‌పూల్‌పై అధ్యయనానికి రూ.14.50 కోట్లు
- నిర్వహణకు 59 ఇంజనీరింగ్ పోస్టులు
- వీటిలో పని చేస్తున్నది 12 మందే.. ఖాళీలు 47
- మెయింటెనెన్స్ సర్కిల్‌లో పోస్టులన్నీ ఖాళీ



డ్యాం క్రస్ట్‌గేట్ల దిగువన ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన భారీ గుంత (ఫైల్)

కర్నూలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల జీవనాడి. ఆ డ్యాంను కంటికి రెప్పలా కాపాడుకోవల్సిన బాధ్యత రెండు ప్రభుత్వాలది. జలాశయం నిర్వహణను ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా డ్యాం భద్రతపై ప్రభావం పడుతుంది. 2009 వరదలకు డ్యాం భారీగా దెబ్బతింది. ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన భారీ గుంత కారణంగా డ్యాం భద్రత ప్రశ్నార్థకంగా మారింది. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు మరమ్మతులకు రూ.103 కోట్లు ఇచ్చేందుకు ప్రపంచబ్యాంకు అంగీకరించింది. ప్లంజ్‌పూల్ అధ్యయనానికి ప్రభుత్వం రూ.14.50 కోట్లు మంజూరు చేసింది. నిధులు ఉన్నా పనులను పర్యవేక్షించాలంటే ఇంజనీరింగ్ నిపుణుల పాత్ర ఎంతో కీలకం. అయితే ఈ జలాశయం నిర్వహణకు ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈలు.. ఇలా వివిధ హోదాల్లో 59 మంది ఇంజనీర్లు పని చేయాల్సి ఉండగా.. కేవలం 12 మందే ఉన్నారు. 47 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్నవాటిని భర్తీ చేయకుండా ఇక్కడ ఉన్నవారిని సైతం బదిలీ చేయడాన్ని చూస్తే ప్రాజెక్టు నిర్వహణపై పాలకులకు ఎంత చిత్తశుద్ధి తెలుస్తుంది. నిపుణులైన ఇంజనీర్లు లేకుండా నిర్వహణ సాధ్యమా? ఇంజనీర్ల పర్యవేక్షణ లేకుండా మరమ్మతులు ఎలా చేస్తారు? 2009 నాటి వరద మళ్లీ వస్తే డ్యాంను సంరక్షించగలమా? ఇవన్నీ సమాధానాలు లేని ప్రశ్నలు. ఇక్కడ పని చేస్తే ఇంజనీర్లను బదిలీ చేయొద్దు.. అంటూ ప్రాజెక్టు ఎస్ఈ ప్రభుత్వానికి లేఖ రాశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇంజనీర్లు లేకుండా పర్యవేక్షణ ఎలా?

2009 అక్టోబరులో 25.5 లక్షల క్యూసెక్కుల వరద చేరడంతో వరద ఒత్తిడికి ప్లంజ్ పూల్ గుంత ఏర్పడింది. అప్రోచ్ రోడ్డు, రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయాయి. గేట్ల రబ్బర్ సీల్స్ దెబ్బతిని లీకేజీలు వస్తున్నాయి. శాశ్వత మరమ్మతులు చేపట్టాలని. ప్లంజ్‌పూల్ గుంతపై అధ్యయనం చేయాలని నిపుణుల కమిటీలు సూచించాయి. వారి సూచన మేరకు 'డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం' (డ్రిప్)-2 కింద 19 పనులకు రూ.203 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు.

ప్లంజ్‌పూల్ అంటే..!

ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం దేవస్థానం దగ్గర కృష్ణా నదిపై 1963 జూలై 24న శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దీనికి పునాది రాయి వేశారు. కుడిగట్టు విద్యుత్తు కేంద్రం (రైట్ పవర్ హౌస్) సహా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడానికి 20 ఏళ్లు పట్టింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. నీటి నిల్వ సామర్థ్యం 308.04 టీఎంసీలు. వరద ప్రవాహ సామర్థ్యం 13.20 లక్షల క్యూసెక్కులు. అయితే జలాశయంలో ఏటేటా చేరుతున్న పూడిక వల్ల జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. 2011లో తీసిన లెక్కల మేరకు నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలుగా నిర్ధారించారు. అంటే 92.24 టీఎంసీల మేర పూడిక చేరింది. అలాగే వరదను దిగువకు వదిలేందుకు 12 రేడియల్ క్రస్ట్ గేట్లు ఏర్పాటు చేశారు. స్పిల్‌వే గేట్ల నుంచి వరద జలాలు కిందపడి.. మళ్లీ పైకి లేచి నదిలో పడతాయి. దీనినే ప్లంజ్‌పూల్ అంటారు. ఆ ప్రాంతంలో భారీగా గుంత ఏర్పడింది. ఈ గుంత వల్ల డ్యాం పునాదుల భద్రతకు ఎలాంటి ముప్పు ఉంది? 2009 అక్టోబరు నాటి వరద మళ్లీ వస్తే డ్యాం తట్టుకోగలదా? ఆనాటి వరదకు ఆనకట్ట, కుడి, ఎడమ గట్లు ఏమేరకు దెబ్బతిన్నాయి? వంటి అంశాలపై నిపుణుల కమిటీలు అధ్యయనం చేశాయి. ఈ కమిటీలు డ్యాం భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు ఇచ్చారు. ఈమేరకు శ్రీశైలం ప్రాజెక్టును పకడ్బందీగా నిర్వహిస్తూ.. 2009 వరదలకు దెబ్బతిన్న డ్యాం మరమ్మతులను తక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇందుకు నిధులు, పర్యవేక్షణ, నిర్వహణకు ఇంజనీరింగ్ నిపుణులు కావాలి. ఈ నెల 8న ప్రపంచబ్యాంకు, సీడబ్ల్యూసీ బృందం డ్యాంను పరిశీలించి ఫేజ్-1 కింద రూ.102.58 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపాయి. ప్లంజ్‌పూల్ గుంతపై అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.14.50 కోట్లు మంజూరు చేసింది. నిధులు ఇచ్చినా ఆ పనులు చేయాలంటే ఇంజనీరింగ్ నిపుణులు కావాలి. 80 శాతం ఇంజనీరింగ్ పోస్టులు ఖాళీగా ఉంటే.. నాణ్యమైన పనులు చేయగలరా? వెయ్యి టీఎంసీలకుపైగా వరద ఉన్న జలాశయం నిర్వహణ ఎలా సాధ్యం.? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. 50-60 శాతం పోస్టులైనా భర్తీ చేస్తేనే.. పనులు ముందుకు సాగుతాయి.

శ్రీశైలం ప్రాజెక్టులో మంజూరైన ఇంజనీరింగ్ పోస్టులు.. ఖాళీలు:

హోదా	మంజూరు	పని చేస్తున్నది	ఖాళీలు
ఎస్ఈ	1	1	–
ఈఈలు	3	–	3
డీఈఈలు	11	2	9
ఏఈఈ/ఏఈలు	44	9	35
మొత్తం	59	12	47

ఇంజనీరింగ్ పోస్టులన్నీ ఖాళీనే!

శ్రీశైలం డ్యాం నిర్వహణ కోసం ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఏఈలు 59 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఎస్ఈగా శ్రీరామ చంద్రమూర్తి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మూడు ఈఈ పోస్టులకు మూడూ ఖాళీగా ఉన్నాయి. 11 డీఈఈ పోస్టులకు 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఈఈ/ఏఈలు 44 పోస్టులకు గానూ 35 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం 9 మందే పని చేస్తున్నారు. అంటే వివిధ హోదాల్లో పని చేయాల్సిన 59 మంది ఇంజనీర్లకుగాను 12 మందే పని చేస్తున్నారు. 47 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- ప్రాజెక్టు భద్రతలో కీలకమైన డ్యాం మెయింటెనెన్స్ సర్కిల్ ఆఫీసులో ఎస్ఈ, డిప్యూటీ ఎస్ఈ, టెక్నికల్ డీఈఈ సహా ఆరుగురు ఏఈఈలకు గానూ.. ఎస్ఈ మాత్రమే ఉన్నారు. 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- డ్యాం మెయింటెనెన్స్ డివిజన్ పరిధిలో ఈఈ, ఐదుగురు డీఈఈలు, 20 మంది ఏఈఈలు పని చేయాల్సి ఉండగా.. 9 మందే పని చేస్తున్నారు. 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- క్యాంప్ అండ్ బిల్డింగ్ డివిజన్ పరిధిలో ఈఈ, ఐదుగురు డీఈఈలు, 18 మంది ఏఈఈలకు గానూ ఈఈ, డీఈఈ, ముగ్గురు ఏఈఈలు పని చేస్తున్నారు. 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- డ్యాం ప్రొటెక్షన్ వర్క్స్ డివిజన్ కర్నూలులో ఉంది. ఇక్కడ ఈఈ, ఇద్దరు డీఈఈలు, 10 మంది ఏఈఈలు పని చేయాల్సి ఉంటే.. వంద శాతం భర్తీ చేశారు. ఎందుకంటే ఈ డివిజన్ కర్నూలు నగరంలో ఉంటుంది. పనులు కూడా అంతంతమాత్రమే కావడంతో ఇంజనీర్లు ఆసక్తి చూపుతున్నారు.

చెత్తలోనూ స్వాహా

(మొదటి పేజీ తరువాయి)

స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ పనులను సామర్థ్యం, అర్హత లేని రెండు సంస్థలకు అప్పగించి నిబంధనలను తుంగలో తొక్కారు. కరకట్ట కమల్‌హాసన్‌గా పేరొందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఒకరు, జగన్ భక్తురాలిగా పేరుగాంచిన ఐఏఎస్ అధికారి (మున్సిపల్ ఉన్నతాధికారి)తో కుమ్మక్కై చిలకలూరిపేటకు చెందిన ఒకే కాంట్రాక్టరుతో టెండరు వేయించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పబ్లిక్ హెల్త్ ఇంజనీర్, స్వచ్ఛాంధ్ర ఉన్నతాధికారి కూడా తెరవెనుక భాగస్వాములుగా ఉన్నారని తెలుస్తోంది. కాంట్రాక్టు సంస్థలకు ఎలాంటి ఆస్తులు, బ్యాంకు సాల్వెన్సీలు లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు పొందారు. ఏకంగా బ్యాంకు సాల్వెన్సీ సర్టిఫికెట్లను ఫోర్జరీ చేశారన్న ఆరోపణలున్నాయి. పనులు దక్కించుకున్న ఆ సంస్థలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించే స్తోమత లేక ఏళ్ల తరబడి కొన్ని మున్సిపాలిటీల్లో అగ్రిమెంట్లు చేసుకోకుండానే పనులు చేపట్టాయి. కొన్ని మున్సిపాలిటీల్లో అయితే అగ్రిమెంట్ కాలం పూర్తయినా గడువు పెంచుకుని చలామణి అవుతున్నాయి. సరైన కారణం లేకుండానే వాటికి అనేక మినహాయింపులు ఇచ్చారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ సంస్థలకు ఆర్థిక స్తోమత లేని కారణంగా పనులు పూర్తి చేయలేక చేతులెత్తేశాయి. ఇప్పటికీ కూటమి ప్రభుత్వంలో మున్సిపల్ అధికారులు వారిపై ఎనలేని ప్రేమ చూపిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అర్హత లేని ఆ సంస్థలను కొనసాగించేలా, చేయని పనులకు కూడా బిల్లులు చెల్లించేలా కమిషనర్లపై ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తోంది.

అర్హత లేకపోయినా...

మున్సిపల్, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పనిచేస్తోంది. 2014-19 మధ్య కాలంలో దాదాపు 20 మంది కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేసి పట్టణ, స్థానికసంస్థల్లో పనులు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండు సంస్థలు మాత్రమే ఈ శాఖలో టెండర్లు వేసి పనులు దక్కించుకున్నాయి. జగన్‌కు సన్నిహితుడైన ఎమ్మెల్యే తన బినామీతో టెండరు వేయించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. రివర్స్ టెండరింగ్‌లో ఈ రెండు సంస్థలు మాత్రమే పాల్గొనేలా చక్రం తిప్పారు. అవి ఫోర్జరీ సాల్వెన్సీ సర్టిఫికెట్లతో పాల్గొని అధిక ధరలకు టెండర్లు దక్కించుకున్నాయి. పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ డిపాజిట్ (పీఎస్‌డీఎస్), ఫర్ అదర్ సెక్యూరిటీ డిపాజిట్(ఎఫ్ఎస్‌డీఎస్)లతో సంబంధం లేకుండానే ఒప్పందాలు జరిగిపోయాయి. మున్సిపల్ ఉన్నతాధికారి ఈ బినామీ కాంట్రాక్టర్‌కు వైసీపీలో టికెట్ ఇప్పించేందుకు సకల ప్రయత్నాలు చేసిన విషయం ఎన్నికల ముందు విస్తృతంగా ప్రచారం జరిగింది.

అడ్డగోలుగా బిల్లులు

రూ.20 కోట్ల విలువైన 1100 లీటర్ల కాంపాక్ట్ బిన్‌లను సరఫరా చేయడానికి టెండర్ దక్కించుకుని, నాసిరకం ఐరన్ బిన్‌లను సరఫరా చేసి బిల్లులు డ్రా చేసుకున్నారు. అలాగే రూ.100 కోట్ల విలువైన ట్రై సైకిళ్లు, 40 లీటర్ల హెచ్‌డీపీఈ బిన్‌లు సరఫరా చేసే కాంట్రాక్టులో అన్నీ నాసిరకం సరఫరా చేసి నిధులు సొమ్ము చేసుకున్నారు. రూ.120 కోట్ల విలువైన 10 లీటర్ల సామర్థ్యం కలిగిన 1.50 కోట్ల హెచ్‌డీపీఈ డస్ట్‌బిన్‌లు సరఫరా కాంట్రాక్టులో స్థానిక నాసిరకం డస్ట్‌బిన్‌లను సరఫరా చేశారు. ఇప్పటికే రూ.60 కోట్లు డ్రా చేసుకోగా, మరో రూ.10 కోట్లు డ్రా చేసుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. 2,200 గ్రామ పంచాయతీలకు రూ.74 కోట్ల విలువైన ట్రాక్టర్లకు ట్రైలర్స్ సరఫరా చేసేందుకు టెండరు దక్కించుకున్నారు. 2023 మే 8న వర్క్ ఆర్డర్ ఇచ్చారు. 180 రోజుల్లో సరఫరా చేయాల్సి ఉండగా, 17 నెలలు పూర్తయినా ఇంత వరకు ఒక్క ట్రైలర్ కూడా సరఫరా చేయలేదు. మంగళగిరి, తాడేపల్లిలో 2,28,915 టన్నుల చెత్తను ఘన వ్యర్థ పదార్థాలను వేరు చేయడానికి టన్నుకు రూ.747 చొప్పున ప్రభుత్వం రూ.17.09 కోట్లు చెల్లించింది. కానీ పనులు మాత్రం జరగలేదు. అలాగే రాయచోటి, నర్సారావుపేట, సత్తెనపల్లి, మదనపల్లె మున్సిపాలిటీల్లో పనులు చేయకుండానే అక్రమంగా బిల్లులు తీసుకునే ప్రయత్నంలో ఉన్నారని సమాచారం. గడిచిన ఐదేళ్లలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.570 కోట్లు ఖర్చు చేస్తే అందులో రూ.200 కోట్లు దోచేశారు' అని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామక్రిష్ణ, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ విచారణ మొదలైంది.

చంద్రబాబు రక్షణకు సీఆర్‌పీఎఫ్

- యోగి, రాజ్‌నాథ్ సహా పలువురికి ఇక పారామిలిటరీ రక్షణే
- ఎన్ఎస్‌జీ సేవలు ఇకపై యాంటీ టెర్రర్ ఆపరేషన్లకే
- కేంద్ర హోంశాఖ ఆదేశాలు.. నెల రోజుల్లో బదలాయింపు పూర్తి..

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రక్షణ బాధ్యతలు ఇకపై సీఆర్‌పీఎఫ్ చూసుకుంటుంది. తిరుపతిలోని అలిపిరిలో చంద్రబాబుపై నక్సల్ దాడి (2003 అక్టోబరు) జరిగినప్పటి నుంచి, గత 21 సంవత్సరాలుగా ఆయనకు రక్షణగా ఉన్న ఎన్ఎస్‌జీ...ఇక ఉగ్రవాద చర్యల నిరోధానికే పరిమితం కానుంది. దానిస్థానంలో సీఆర్పీఎఫ్‌కు బాధ్యతలు ఇవ్వాలని కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. చంద్రబాబుతో పాటు మరో ఎనిమిది మంది కూడా ఈ కేటగిరీలో ఉన్నారు. వీరందరినీ సీఆర్పీఎఫ్ భద్రతా వలయంలోకి తీసుకురానున్నారు. సీఆర్పీఎఫ్ విభాగంలో వీఐపీ భద్రతా అవసరాల కోసం ఆరు బెటాలియన్లు ఉన్నాయి. వాటిని ఇప్పుడు ఏడుకు పెంచనున్నారు. ఇప్పటికే మంత్రి లోకేశ్‌కు సీఆర్పీఎఫ్ బలగాలు రక్షణ కల్పిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఎన్ఎస్‌జీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్లాక్ క్యాట్స్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ రక్షణలో ఎన్ఎస్‌జీ గార్డ్స్ ధైర్యం, తెగువ, స్ఫూర్తికి నమస్కరిస్తున్నా.. అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

గ్రామాల్లో ఈశా ఫౌండేషన్ 'గ్రామోత్సవం'

- బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటలు ఆరోగ్యానికి మంచిదని, సామూహిక ఆటలు సామరస్యాన్ని, ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందిస్తాయని క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామోత్సవం వేడుకకు సంబంధించిన వాల్‌పోస్టరును బుధవారం సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈశా ఫౌండేషన్ 2004 నుంచి గ్రామోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఇప్పటి వరకూ 30వేల గ్రామాల్లో నిర్వహించామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆటల ద్వారా వినోదంతోపాటు, అంతరించిపోతున్న సంప్రదాయ కళల పునరుద్ధరణే లక్ష్యంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బ్రోచర్ ఆవిష్కరణలో పర్యాటకశాఖ ముఖ్యకార్యదర్శి వినయ్‌చంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌గా దామోదరనాయుడు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ టి.దామోదరనాయుడును పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఈ శాఖ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఆర్.అమరేంద్రకుమార్‌ను గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. అలాగే రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పశుసంవర్ధకశాఖ కార్యదర్శిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెగ్యులర్ చైర్మన్‌ను నియమించే వరకు రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఈ నియామకం చేసింది. విజయవాడలోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ సలహా సంఘాన్ని ప్రభుత్వం నియమించింది. చైర్మన్‌గా పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌తో పాటు మరో 8 మంది సభ్యులను నియమించింది. కాగా, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం.. ఏపీ ఆయిల్ ఫెడ్‌కు ఇన్‌చార్జి ఎండీగా కొనసాగాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.


వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్‌గా బాబు.ఎ బాధ్యతలు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి బాబు.ఎ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఖజానాకు వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన ఆదాయ వనరు. ఆర్థికంగా రాష్ట్రం తీవ్ర ఒడిదుడుకుల్లో ఉన్న ఈ పరిస్థితుల్లో వాణిజ్య పన్నుల శాఖను సమర్థవంతమైన అధికారికి అప్పజెప్పాలని ప్రభుత్వం భావించింది. పన్ను ఎగవేతలు, ఆదాయం లీకేజీలు నియంత్రించడంతో పాటు రెవెన్యూ పెరుగుదలకు అనేక చర్యలు తీసుకొని రాష్ట్ర ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఇంత ప్రాధాన్యం గల బాధ్యతలను ప్రభుత్వం బాబు.ఎ కు అప్పగించింది. అలాగే, గత ప్రభుత్వంలో ఈ శాఖలో అనేక అవకతవకలు జరిగాయి. వాటిపైనా కొత్త కమిషనర్ చర్యలు తీసుకుంటారని అంతా భావిస్తున్నారు.

ఇసుకలో 'లోడింగ్' మాఫియా!

రీచ్‌లలో పాగాకు పక్కాప్లాన్.. ప్రభుత్వ ధరకన్నా తక్కువకే.. రీచ్ నుంచి లోడ్ చేస్తామని మస్కా

- రూ.54కే కోట్ చేసిన బెజవాడ కంపెనీ
- ప్రభుత్వం నిర్ణయించిన ధరే రూ.110
- ఎన్టీఆర్ జిల్లాలోనూ టన్ను రూ.72కే



గుంటూరు/విజయవాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. ఇసుకను ఉచితంగా అందిస్తూ కేవలం లోడింగ్, రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేసేలా నిబంధనలు రూపొందించింది. లోడింగ్ చార్జీ అందరికీ ఒకే విధంగా ఉండేలా నిర్ణయించింది. రవాణా చార్జీలు మాత్రం డంపింగ్ యార్డు నుంచి వినియోగదారుల చిరునామాకు చేరవేసే దూరాన్ని బట్టి నిర్ణయిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఇసుక లోడింగ్‌కు టెండర్లు పిలిచారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో టెండర్ల ప్రక్రియ చేపట్టారు. లోడింగ్ ఖర్చును టన్నుకు రూ.110గా నిర్ణయించారు. ఎవరైనా అంతకంటే తక్కువ కోట్ చేస్తే వారి టెండర్ చెల్లదని షరతు పెట్టారు. గుంటూరు జిల్లాలో కాంట్రాక్టర్లు రూ.110కే బిడ్‌లు దాఖలు చేశారు. దీంతో కాంట్రాక్టర్‌ని ఖరారు చేసేందుకు లాటరీ నిర్వహించారు. కానీ, పల్నాడు జిల్లాలో మాత్రం రూ.54 కోట్ చేస్తూ టెండర్ దాఖలు చేసిన వారికి రీచ్ కేటాయించారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఆ జిల్లాలో విజయవాడకు చెందిన ఇసుక మాఫియా డాన్ రంగంలోకి దిగి చక్రం తిప్పినట్టు తెలిసింది. పల్నాడులోని ఓ రీచ్‌కు చెందిన మండలాధికారి, జిల్లా ఉన్నతాధికారులతోనూ కుమ్మక్కైన డాన్ రెండు రీచ్‌లను చేజిక్కించుకున్నారు. టన్ను ఇసుకను కేవలం రూ.54కే రీచ్ నుంచి మాన్యువల్‌గా తీసి స్టాక్‌యార్డుకు చేర్చి, అక్కడ వినియోగదారుల లారీల్లోకి లోడింగ్ చేస్తానని పేర్కొనడం గమనార్హం. అయితే, ఇంత తక్కువ ధరకే ఇదెలా సాధ్యమవుతుందని టెండర్‌లలో పాల్గొన్న మిగతా వారు బిత్తరపోతున్నారు.

అడుగు పెడితే చాలు!

ఏదో ఒకలా ముందు ఇసుక రీచ్‌లలో అడుగుపెడితే తర్వాత సంగతి తర్వాత అన్న యోచనలో తెలుగు తమ్ముళ్లు ఉన్నారు. నిర్ణయించిన ధరకంటే తక్కువకు కోట్‌చేసిన కాంట్రాక్టర్లను అధికారులు ఎంపిక చేస్తారు కాబట్టి.. ఆ తర్వాత అక్కడ ఏం చేసినా ఎవరూ అడగరని భావిస్తున్నారు. తవ్వకాలన్నీ తమ్ముళ్ల కనుసన్నల్లో సాగుతుండడంతో ఎంతైనా తోడుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. ఈ విధంగా వేళపాళ లేకుండా ఇసుక తవ్వకాలు చేసి దాన్ని ఒక చోట బ్లాక్ చేసుకునే యోచనలో తమ్ముళ్లు ఉన్నట్టు తెలుస్తోంది.

సీఎం దృష్టికి

పల్నాడులో అప్పగించిన టెండర్ మాటున ఉచిత ఇసుకను బ్లాక్ మార్కెట్‌కు తరలించే ఆలోచన ఉందని మిగిలిన టెండర్‌దారులు ఆరోపిస్తున్నారు. అతి తక్కువ లోడింగ్ చార్జీలు కోట్ చేసి రీచ్‌లో పాగా వేసే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మాఫియా డాన్ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

గడువు పెంపుపైనా సందేహం

పల్నాడు జిల్లాలో టెండర్ దాఖలుకు తొలుత అక్టోబరు 10వరకు గడువు ఇచ్చారు. ఆ తర్వాత మరో రెండు రోజులు పొడిగించారు. గడువు పెంచిన తర్వాతే విజయవాడ మాఫియా గ్యాంగ్ టెండర్ దాఖలు చేసిందని, దీనివెనుక అధికారుల పాత్ర కూడా ఉందని ఇతర టెండర్‌దారులు ఆరోపిస్తున్నారు. పల్నాడులో అంబడిపూడి 1, 2, 3, పొందుగల, కోనూరు, దిడుగు రీచ్‌లు ఉన్నాయి. వీటిలో అంబడిపూడి-1, పొందుగల రీచ్‌లలో మాత్రమే ఇప్పటికిప్పుడు ఇసుక లోడింగ్ చేసే అవకాశం ఉంది. ఈ రీచ్‌లనే విజయవాడ ఇసుక మాఫియా చేజిక్కించుకుంది. మొత్తం 4 సంస్థలు ఈ టెండర్‌లో పాల్గొనగా గోదావరి-కృష్ణా కంపెనీ ఈ రీచ్‌లు దక్కించుకున్నాయి. మిగతా రీచ్‌లకు సాత్విక్ కంపెనీ రూ.84కు కోట్ చేసి టెండర్ దాఖలు చేయగా పెండింగ్ పెట్టినట్లు తెలిసింది. ఎన్టీఆర్ జిల్లాలోని 15 రీచ్‌లలో ఇసుకను తవ్వి, లోడ్‌చేసి స్టాక్ పాయింట్‌కు తీసుకెళ్లి.. లారీల్లో అన్‌లోడింగ్ చేసేందుకు మైనింగ్ శాఖ టన్నుకు రూ.110 ధర నిర్ణయిస్తే కొందరు తెలుగు తమ్ముళ్లు తెలివిగా నిర్ణీత ధరలకాన్న తక్కువకే కోట్ చేశారు. 9 రీచ్‌లకు రూ.108 చొప్పున, మరో రెండు రీచ్‌లకు రూ.106 చొప్పున కోట్ చేశారు. నాలుగు రీచ్‌ల్లో మరీ దారుణంగా రూ.72కే కోట్ చేశారు. ఇంత తక్కువ ధరకు టెండర్ కోట్ చేయడం వెనుక రహస్య ప్రణాళికలు ఉన్నాయని తెలుస్తోంది.

బీసీలు గౌరవంగా బతకాలి

- ఆ లక్ష్యంతోనే రక్షణ చట్టం : మంత్రులు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల ప్రజలకు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా బీసీ రక్షణచట్టం రూపొందిస్తున్నట్లు మంత్రులు స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో బీసీ సామాజికవర్గ మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎస్.సవిత, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారధి, సత్యకుమార్ యాదవ్, వాసంశెట్టి సుభాశ్, కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు హోంమంత్రి అనిత సమావేశమయ్యారు. బీసీ రక్షణ చట్టం ఆవశ్యకతను మంత్రి సవిత వివరించారు. జగన్ హయాంలో రాష్ట్రంలో బీసీల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కరువైందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు బలైపోతున్న బీసీల దుస్థితిని 'మీ కోసం' బస్సుయాత్రలో సీఎం చంద్రబాబు, యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ స్వయంగా పరిశీలించారని గుర్తు చేశారు. బీసీలను ఆదుకోవాలని నిర్ణయించి బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారన్నారు. కులపరంగా, వ్యక్తిగతంగా దూషించినా చర్యలు తీసుకునేలా దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం రూపొందిస్తున్నామన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బీసీ చట్టం రూపకల్పనలో న్యాయ నిపుణులు, రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ చట్టాన్ని పకడ్బందీగా రూపొందించాలని, ఇందు కోసం ఇతర చట్టాలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ చట్టం రూపకల్పనలో సెక్షన్లు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి రూపొందించాలన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో బీసీల రక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, చట్టం రూపకల్పన చేయాలన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ చట్టం బీసీలకు రక్షణ కవచంలా ఉండాలన్నారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాశ్ మాట్లాడుతూ బీసీ రక్షణ చట్టం రూపకల్పనలో మరిన్ని పర్యాయాలు సమావేశాలు నిర్వహించాలన్నారు. తొలుత బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి పోలా భాస్కర్ బీసీల్లో ఉన్న ఉపకులాలు, వాటి రిజర్వేషన్ల అమలు తీరును వివరించారు. బీసీ రక్షణ చట్టంతో బీసీల్లో తీవ్రంగా వెనుకబడిన కులాలకు మేలు కలుగుతుందన్నారు. కాగా, వచ్చే సమావేశంలో న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని పూర్తి వివరాలతో హాజరుకావాలని బీసీ సంక్షేమాధికారులకు మంత్రులు స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

14 రోజుల పసికందుకు ప్రాణభిక్ష

- ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యానికి సాయం
- సకాలంలో స్పందించి ఆదుకున్న మంత్రి లోకేశ్



పసికందును ఎత్తుకున్న మంత్రి లోకేశ్, పక్కన చిన్నారి తల్లిదండ్రులు

తాడేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్.. చావుబతుకుల్లో ఉన్న 14 రోజుల పసికందు ప్రాణాన్ని నిలబెట్టింది. ఆ శిశువుతో పాటు బుధవారం ప్రజాదర్బార్‌కు వచ్చిన తల్లిదండ్రులు.. తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టిన లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేటకు చెందిన చదల వెంకట మహేశ్వరరావు దంపతులకు ఇటీవల రెండో సంతానంగా మగబిడ్డ పుట్టాడు. అయితే శిశువు రాత్రిళ్లు ఏడుస్తుండడం, పాలు తాగక పోవడంతో సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. శిశువుకు ప్లేట్‌లెట్స్ పడిపోయాయని, పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్న వైద్యులు మెరుగైన చికిత్స కోసం విజయవాడ తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు విజయవాడలోని ఓ ఆస్పత్రికి తీసుకురాగా.. అక్కడి వైద్యులు పరీక్షించి చికిత్సకు భారీగా ఖర్చవుతుందని చెప్పారు. గిరిజన కుటుంబానికి చెందిన మహేశ్వరరావు ఆర్థిక పరిస్థితి అంతమాత్రమే. చిన్నారికి మృత్యువు ముంచుకొస్తుండడంతో గత నెల 27న ప్రజాదర్బార్‌లో లోకేశ్‌ను కలిసి చిన్నారి ప్రాణాలు కాపాడాలని వేడుకున్నారు. వెంటనే స్పందించిన లోకేశ్ సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్యానికి అవసరమైన సాయాన్ని అందించారు. 14 రోజుల పాటు చికిత్స పొందిన తమ బిడ్డ ఆరోగ్యంగా ఇంటికి రావడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. బుధవారం ప్రజాదర్బార్‌కు ఆ బిడ్డతో సహా వచ్చిన తల్లిదండ్రులు మంత్రి లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారిని ఎత్తుకున్న లోకేశ్.. తల్లిదండ్రులను ఓదార్చి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

డ్రోన్ సమ్మిట్‌కు విశేష స్పందన

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష ప్రభుత్వం 22, 23 తేదీల్లో మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న అమరావతి డ్రోన్ సమ్మిట్-2024కు ఔత్సాహికుల నుంచి అద్భుత స్పందన వస్తోంది. ఈ జాతీయ సదస్సులో భాగంగా ఔత్సాహికుల కోసం డ్రోన్ హ్యాక్ థాన్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు ఏకంగా 400మంది ఔత్సాహికులు పేర్లు నమోదు చేసుకున్నారు. మరింతమంది పాల్గొనేందుకు ఈ పోటీల గడువును మరో రెండు రోజులు పొడిగించినట్లు ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ ఎండీ కె. దినేశ్‌కుమార్ బుధవారం తెలిపారు. తొమ్మిది థీమ్స్‌లో జరిగే పోటీల్లో విజేతలను నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి, ప్రతి కేటగిరీ నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేస్తామన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ రూ.3లక్షలు, ద్వితీయ రూ.2లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష అందజేస్తామని చెప్పారు. 22న జరిగే డ్రోన్స్ జాతీయ సదస్సు ప్రారంభోత్సవ సభలో సీఎం చంద్రబాబు విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. 22వ తేదీ సాయంత్రం కృష్ణాతీరం పున్నమి ఘాట్‌లో 5వేల డ్రోన్లతో మెగా షో ఏర్పాటు చేశామని, ప్రజలందరూ పాల్గొనవచ్చని ఎండీ చెప్పారు.

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

- తిరుపతి జిల్లా వాసులు ముగ్గురు దుర్మరణం

శ్రీకాళహస్తి/ఓజిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి జిల్లాకు చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. అమెరికా కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 6.45 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాళహస్తి పట్టణం బంగారమ్మ కాలనీకి చెందిన చెన్ను సాయితేజారెడ్డి (31), హరితారెడ్డి (27)కి 2022 ఫిబ్రవరిలో వివాహమైంది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న సాయితేజారెడ్డి భార్యతో కలిసి టెక్సాస్‌లో స్థిరపడ్డారు. అలాగే.. తొట్టంబేడు మండలం చిన్నకనపర్తి గ్రామానికి చెందిన రాజినేని శివ (30). ఓజిలి మండలం రాజుపాళేనికి చెందిన తిరుమూరు గోపి(30) కూడా అమెరికాలో ఉంటున్నారు. వీరంతా మిత్రులయ్యారు. సాయితేజరెడ్డి, భార్య హరితారెడ్డితో పాటు రాజినేని శివ, గోపి ఆదివారం కారులో విహారానికి వెళ్లారు. సోమవారం సాయంత్రం తిరిగి వస్తుండగా దక్షిణ బాన్‌హోంకు అరుమైళ్ల దూరంలో హైవేపై వీరు ప్రయాణిస్తున్న కారుని మరొక కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో మంటలు వ్యాపించి హరితారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, సాయితేజారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. శివ, గోపి కూడా అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.

ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): 'వాల్యూ ఎడిషన్, వాల్యూ చెయిన్‌ను పెంచడానికి ఎంట్రప్రెన్యూర్‌లను ప్రోత్సహించాలి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, సమాఖ్యలు, సహకార సంఘాలకు ప్రాధాన్యమివ్వాలి'... ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలు ఇవి. ఈ లక్ష్యాల సాధనకు అనుసరించాల్సిన పద్ధతులను, ఇవ్వాల్సిన రాయితీలను, ప్రోత్సాహకాలను విపులీకరిస్తూ ప్రవేశపెట్టిన పాలసీని బుధవారం కేబినెట్ ఆమోదించింది. ఇదే పాలసీలో విధాన లక్ష్యాలనూ నిర్దేశిస్తూ ప్రతిపాదించారు. 'ఎంఎస్ఎంఈలతో పాటు పెద్ద వ్యాపారులకూ తగిన ప్రోత్సాహాలు ఇవ్వాలి. అన్ని కేటగిరీల్లోనూ సాధారణ రాయితీలను అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వ విధానం ప్రకారం ఎంఎస్ఎంఈలకు, రూ.51-100 కోట్ల మధ్య పెట్టుబడులు పెట్టే వ్యాపారులకు, రూ.100 కోట్ల పైన పెట్టుబడి పెట్టే వ్యాపారులకు విద్యుత్ ఖర్చు, నికర స్టేట్ జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ప్రతిపాదించారు. ఫుడ్ ప్రాసెసింగ్ కింద తయారీ రంగంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలి. తయారీ, సేవల రంగంలో 3 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పాలి. తయారీ రంగంలో 3 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం నుంచి 15 బిలియన్ల యూఎస్ డాలర్ల ఉత్పత్తులు ఎగుమతి చేయాలి. మూడు గిరిజన జిల్లాలను ఆర్గానిక్ జోన్లుగా ప్రకటించాలి. మామిడి, అరటి, జీడిపప్పు ఉత్పత్తులకు ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఫుడ్ ప్రాసెసింగ్ సాంకేతికత, నాణ్యత ధ్రువీకరణలో పరిశోధన, అభివృద్ధికి రూ.250 కోట్ల కార్పస్ ఫండ్ వెచ్చించాలి' అని నిర్దేశించుకున్నారు. పాలసీలో ఔత్సాహిక పారిశ్రామికులకు ప్రోత్సాహకాలను ప్రకటించింది.



ఉత్పత్తి రంగంలో విధానాల రూపకల్పన సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తున్న సీఎం చంద్రబాబు

ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రాసెసింగ్ యూనిట్లు రూ.8 కోట్ల లోపు సంస్థలు మూలధన రాయితీపై 10% కంటే ఎక్కువ రాయితీని క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇందులో మహిళలు, ఎస్సీ ఎస్టీ, బీసీ, ప్రత్యేక దివ్యాంగులకు 10% అదనపు మూలధన రాయితీ లభించనున్నది. రూ.100 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడులకు టైలర్ మేడ్ ఇన్సెంటివ్‌లు ఇస్తామని పాలసీలో పేర్కొన్నారు. కోల్డ్‌చైన్, ఈ రేడియేషన్, కబేళా, టెస్టింగ్ ల్యాబ్‌లకూ ప్రోత్సాహాలు లభించనున్నాయి. పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా(నానో) పార్కులకు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లకూ సాధారణ మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలో కొత్త ఆహార శుద్ధి పథకం కింద రెండేళ్లలో ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.50 లక్షల పెట్టుబడిలో 25%, ద్వితీయ, తృతీయ ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.5 కోట్ల పెట్టుబడికి రెండేళ్లలో 35% ఇన్సెంటివ్‌లను ప్రతిపాదించారు. రూ.3 కోట్ల పెట్టుబడి యూనిట్లకు టెక్నాలజీ అప్‌గ్రెడేషన్‌కు రెండేళ్లలో 35%, రూ.2 కోట్ల పెట్టుబడి యూనిట్లలో వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద రెండేళ్లలో 50%, రూ.15 కోట్ల పెట్టుబడితో ఆధునిక కబేళాల ఏర్పాటుకు రెండేళ్లలో 50%, పీఎంఎఫ్ఎంఈ కింద అర్హత ఉన్న ప్రాజెక్ట్‌ల్లో రూ.10 లక్షల పెట్టుబడి యూనిట్లకు 10%, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ప్రకారం రూఫ్ టాప్ సోలార్‌కు ప్రోత్సాహాలు అందించనున్నారు.

ఎంట్రప్రెన్యూర్‌లకు భారీ ప్రోత్సాహకాలు

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, డ్వాక్రాలకు ప్రాధాన్యం

అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలే లక్ష్యం

30 వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు


3 లక్షల ఉద్యోగాలు, 1500 కోట్ల యూఎస్ డాలర్ల ఎగుమతులే లక్ష్యం

■ అన్ని విభాగాల్లో సాధారణ రాయితీలు

ఏడాదికి రూ.లక్ష పెట్టుబడి గల సూక్ష్మ స్థాయి పరిశ్రమలు, రూ.5లక్షల పెట్టుబడి పెట్టే చిన్న పరిశ్రమలు, రూ.15 లక్షల పెట్టుబడి పెట్టే మధ్యస్థ పరిశ్రమలకు ఆరేళ్లపాటు యూనిట్ విద్యుత్ రూపాయి చొప్పున ఇంధన చార్జీలు రీయింబర్స్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వార్షిక పెట్టుబడిలో 5% టర్నోవర్ కింద ఆరేళ్ల పాటు స్టేట్ జీఎస్టీ రీయింబర్స్ చేయాలని ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలో ప్రతిపాదించారు.

మెగా అడుగులు

- థింక్ గ్లోబల్.. యాక్ట్ గ్లోబల్
- ఒక కుటుంబం- ఒక వ్యాపారవేత్త
- మరిన్ని ఉద్యోగాలు, రాయితీలు
- ఐదేళ్లలో ఇరవై లక్షల ఉద్యోగాలు
- ఇండస్ట్రీలో జాబ్ ఫస్ట్
- రూపాయికే ఎలక్ట్రానిక్ కంపెనీలకు యూనిట్ విద్యుత్



"థింక్ గ్లోబల్ .. యాక్టు గ్లోబల్ అనే విధానంలో రాష్ట్రంలో పారిశ్రామిక విధానాలను ముందుకు తీసుకెళతాం. పారిశ్రామిక రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలకూ భాగస్వామ్యం కల్పిస్తాం. ప్రైవేటు రంగంలో పారిశ్రామిక పార్కులను తీసుకురాబోతున్నాం. ఇక ఉద్యోగాలను బట్టే ప్రోత్సాహకాలు ఉంటాయి" - చంద్రబాబు

సూపర్ 6

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాస్, టీజీ భరత్‌లతో కలసి చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. పెట్టుబడుల ఆకర్షణ.. ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఎలక్ట్రానిక్, ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ డెవలప్‌మెంట్, ఎంఎస్ఎంఈ పాలసీ, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పాలసీలను తీసుకువచ్చామని చంద్రబాబు చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

రతన్ టాటా ఇన్నోవేషన్ జోన్‌లు..

"అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తాం. ఈ హబ్ ద్వారా పారిశ్రామిక, వాణిజ్య వేత్తలకు అవసరమైన మేథో, సాంకేతిక పరిజ్ఞానాన్ని బదలాయించుకోవచ్చు. విశాఖ, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు/కృష్ణా, అనంతపురంలో రతన్ టాటా ఇన్నోవేషన్ జోన్‌లను ఏర్పాటు చేస్తాం. నాలెడ్జ్ ఎకానమీకి ఇన్నోవేషన్ హబ్‌లు కేంద్రాలుగా ఉండాలి. రాష్ట్రంలో 2047 నాటికి 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించేలా పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తాం. వచ్చే నెల మొదటి వారంలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తాం. ప్రపంచ దేశాల్లో మార్కెటింగ్ జరిగేలా రాష్ట్ర ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్ తీసుకువస్తాం. భావనపాడులో పదివేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తాం. వచ్చే ఏడాది నాటికి భావనపాడు పోర్టును పూర్తి చేస్తాం. భోగాపురం విమానాశ్రయాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించి .. ప్రతి ఇంట్లోనూ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం"

జాబ్ ఫస్ట్ నినాదంతో..

"జాబ్ ఫస్ట్ నినాదంతో పారిశ్రామిక విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తాం. ఉద్యోగాల కల్పన ఆధారంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఉంటాయి. పారిశ్రామికవాడల్లోనూ..పరిశ్రమల ఏర్పాటులోనూ సామాజిక సమతుల్యతను పాటిస్తాం. మహిళలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలను భాగస్వాములను చేస్తాం. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీలన్నింటినీ పరిశీలించి..కాయిలా పడ్డవాటిని పునరుద్ధరిస్తాం. పరిశ్రమలను తీసుకువచ్చే బాధ్యత అధికారులదే. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తాం. రాష్ట్రమంతా గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చేస్తాం. నౌకాశ్రయాలను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లుగా మారుస్తాం. సోలార్, విండ్ , హైబ్రీడ్ సోలార్, పంప్డ్ స్టోరేజీ హైడల్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్ల అనుమతిలో 'ముందు వచ్చిన సంస్థలకు ముందుగా' పద్ధతిని అమలు చేస్తాం. ఎంఎస్ఎంఈలకు రూ.500 కోట్ల కార్పస్‌ఫండ్‌ను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు అన్నారు.

మల్లవల్లి.. ఓ బ్యాడ్ స్టోరీ

మీడియా భేటీలో చంద్రబాబు వ్యాఖ్య

"మల్లవల్లి..ఓ బ్యాడ్ స్టోరీ" అని సీఎం చంద్రబాబు మీడియాకు తెలిపారు. ఈ పార్కులో 349 పారిశ్రామికవేత్తలకు 150 ఎకరాల భూమిని తిరిగి కేటాయించామనీ, ఈ భూమిని ఎకరా రూ.16.5 లక్షలకు గతంలో ఇచ్చిన ధరకే అప్పగించామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం కృష్ణా జిల్లా మల్లవల్లిలో 1,350 ఎకరాల్లో బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు (మోడల్ ఇండస్ట్రియల్ పార్కు)కు శ్రీకారం చుట్టింది. అశోక్ లేలాండ్, పార్లే వంటి పెద్ద పరిశ్రమలతోపాటు వందల సంఖ్యలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఏపీఐఐసీ అధికారులు....ప్లాట్లు కేటాయించారు. అప్పట్లో ఉన్న భూమి విలువ, మౌలిక సదుపాయాల కల్పనకు కలిపి ఎకరానికి రూ.16.50 లక్షలు చొప్పున ఏపీఐఐసీ వసూలు చేసింది. అయితే 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వచ్చీ రావడంతోనే కక్షపూరిత రాజకీయాలకు తెరలేపింది. మల్లవల్లి పార్కులో భూములు కేటాయించిన పారిశ్రామికవేత్తలపై టీడీపీ సానుభూతిపరులనే ముద్రవేసి రకరకాలుగా వేధింపులకు గురిచేసింది. మౌలిక సదుపాయాలు కల్పించకుండా వదిలేసింది. అక్కడ పారిశ్రామికవేత్తలకు కేటాయించిన భూములను రద్దు చేస్తూ నోటీసులు ఇచ్చింది. ఆ నోటీసులపై దాదాపు 150 మంది పారిశ్రామికవేత్తలు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ఎకరాకు రూ.65 లక్షలు చొప్పున కొత్త ధరలు నిర్ణయించి.. ఈ రేటు చెల్లిస్తేనే ఆ భూములను తిరిగి కేటాయిస్తామంటూ వైసీపీ సర్కారు మరోసారి నోటీసులు పంపింది. దీంతో పారిశ్రామికవేత్తలు అటువైపు చూడటం కూడా మానేశారు. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారంతా మళ్లీ తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వ పెద్దలను కలిశారు. వారి అభ్యర్థనలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

ఎలక్ట్రానిక్స్ హబ్‌గా ఏపీ

ఐదేళ్లలో 84వేల కోట్ల పెట్టుబడులు

ఐదు లక్షల మందికి ఉద్యోగాలు

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రానిక్స్, డిజిటల్ పరికరాల ఉత్పత్తుల తయారీ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచేలా రాష్ట్ర సర్కారు ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ పాలసీని ప్రకటించింది. దీనికి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ తయారీ పాలసీ 4.0 అనే పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. బుధవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన కేబినెట్‌లో ఈ పాలసీని ఆమోదించారు. వచ్చే ఐదేళ్ల వ్యవధిలో, అంటే 2029 నాటికి ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో 84వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆహ్వానించేలా, పారిశ్రామికవేత్తలను ఏపీకి రప్పించేలా విధివిధానాలను నూతన పాలసీలో ప్రకటించారు. కనీసం 4.2 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ లక్ష్యంగా దాన్ని రూపొందించారు. ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని పాలసీ ద్వారా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే కంపెనీలకు ఇచ్చే రాయితీలను మూడు రకాలుగా విభజించారు. 50-200 కోట్ల పెట్టుబడి పెట్టే వారికి 20 శాతం(ఐదు వాయిదాలు), 200-1000 కోట్ల పెట్టుబడి పెట్టే కంపెనీకి 25 శాతం(ఏడు వాయిదాలు) పెట్టుబడి రాయితీ ఇవ్వనున్నారు. భారీ యూనిట్‌లు అంటే 1000-5వేల కోట్ల పెట్టుబడి పెట్టే మెగా కంపెనీలకు 30శాతం పెట్టుబడి రాయితీని 10 వాయిదాల్లో అందించనున్నారు. ఐటీఐల్లో చదివే వారికి నైపుణ్య శిక్షణ, పారిశ్రామిక అవగాహన కల్పించేలా ప్రతిపాదనలు ఉన్నాయి. పెట్టుబడి వ్యయం పెరగకుండా నీరు, విద్యుత్, లే అవుట్ అనుమతులపై విధించే ఛార్జీలను ఖరారు చేస్తారు. సమస్యల పరిష్కారం కోసం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేస్తారు.

యూనిట్ విద్యుత్ రూపాయికే...

పరిశ్రమలు ఏర్పాటయిన తర్వాత వాటిపై ఆర్థిక, ఇతర భారాలను తగ్గించేందుకు ప్రభుత్వం పలు నిర్వహణ రాయితీలను ప్రకటించింది. ఐదేళ్లపాటుగా ఆ కంపెనీ చెల్లించే జీఎస్టీలో రాష్ట్ర జీఎస్టీని 100 శాతం తిరిగి చెల్లించనుంది. ఐదేళ్లపాటు విద్యుత్ సబ్సిడీ వర్తింపచేయనుంది. ఇందులో భాగంగా యూనిట్ విద్యుత్ కేవలం రూపాయికే అందించనుంది. ఉత్పత్తుల తయారీ, విక్రయాలు, ఇతర నిర్వహణా అగ్రిమెంట్లకు సంబంధించి ఐదేళ్లపాటు కంపెనీ చెల్లించే స్టాంప్‌డ్యూటీని 100 శాతం ప్రభుత్వం తిరిగి చెల్లించనుంది. ఉద్యోగ నియామకాల్లో సహాయం కింద ప్రభుత్వమే కంపెనీలకు మేలు చేసేలా విధానం ప్రకటించింది. కంపెనీ పనిచేయడం ప్రారంభించిన తర్వాత తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారిలో పురుషులకు నాలుగు వేలు, మహిళలకు ఆరు వేల చొప్పున చెల్లించేలా ప్రతిపాదించారు.

ఇక ప్రైవేట్ పారిశ్రామిక పార్కులు

నాలుగు విభాగాలుగా అభివృద్ధికి ప్రణాళిక

పారిశ్రామిక పార్కుల పాలసీకి ఆమోదం

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు కూటమి సర్కారు ప్రణాళికలు రూపొందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనిపై పాలసీని ఆమోదించారు. ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులను నాలుగు విభాగాలుగా అభివృద్ధి చేయనున్నారు. 10 ఎకరాల లోపు నానో పార్కులు, 10-100 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, 100-1000 ఎకరాల్లో భారీ లేక సెక్టార్ స్పెసిఫిక్ పార్కులు, వెయ్యి ఎకరాల పైన భూమిలో మెగా పార్కులు ఏర్పాటు కానున్నాయి. ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను(ఎఫ్ఎఫ్‌సీ) పీపీపీ విధానంలో చేపడతారు. జాయింట్ వెంచర్, బిల్డ్ ఓన్ ఆపరేట్(బీఓఓ), డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) తదితర విధానాల ద్వారా ప్రైవేట్ భాగస్వామ్యంతో మంచి పారిశ్రామిక మౌలికవసతులను అభివృద్ధి చేయనున్నారు. ప్రైవేట్ పారిశ్రామికవాడల పాలసీలో ప్రైవేట్ డెవలపర్ మెజారిటీ భూమికి యజమాని కావొచ్చని, కొన్ని సందర్భాల్లో రైతుల నుంచి ప్రైవేట్ డెవలపర్లు భూమిని సేకరించవచ్చని పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రాంతంలోని 5 కిలోమీటర్ల పరిధిలో ఉద్యోగులకు ఇళ్ల నిర్మాణాలు, హాస్టళ్లను నిర్మించాలని పాలసీలో పేర్కొన్నారు. ప్రైవేట్ విభాగంలో మూడు నమూనాల్లో ప్రైవేట్ పారిశ్రామికవాడలను అభివృద్ధిచేస్తారు. మోడల్-1 ద్వారా పూర్తి ప్రైవేట్ భూమిలో పారిశ్రామికాభివృద్ధి చేయడం, మోడల్-2లో పాక్షికంగా ప్రభుత్వం/ఏపీఐఐసీ పారిశ్రామికాభివృద్ధి, మోడల్-3 ద్వారా ప్రభుత్వ భూమి/ఏపీఐఐసీ భూమిలో పారిశ్రామికాభివృద్ధి చేపడతారు.

పారిశ్రామిక పార్కులకు ప్రోత్సాహకాలు

నానో, ఎంఎస్ఎంఈ, భారీ, మెగా పార్కులకు నూరుశాతం నాలా మినహాయింపులు, భూవినియోగ మార్పిడి ఫీజు నూరుశాతం మినహాయింపు, లేఅవుట్ ఆమోదపు చార్జీలు నూరుశాతం మినహాయింపు, పారిశ్రామిక వాడలకు తీసుకున్న భూములకు రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంపుడ్యూటీ నూరుశాతం మినహాయింపు ఇస్తారు. నానో, ఎంఎస్ఎంఈలకు ఒక్కో ఎకరానికి రూ.5 లక్షల వరకు కేపిటల్ సబ్సిడీ అందిస్తారు. భారీ, మెగా పార్కులకు ఎకరాకు రూ.3 లక్షల వరకు కేపిటల్ సబ్సిడీ అందించనున్నారు. వీటికి సంబంధించిన ఆపరేటింగ్ మార్గదర్శకాలు ప్రత్యేకంగా విడుదల చేస్తారు.

రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు

ఏడున్నర లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీ

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీలో పునరుత్పాదక విద్యుత్, పంప్ స్టోరేజీ ద్వారా విద్యుత్ ఉత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ వనరుల వినియోగం పెంచేందుకు ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీకి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. గ్రీన్ ఎనర్జీ - సర్క్యులర్ ఎకానమీ యూనివర్సిటీని పీపీపీ విధానంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ రంగంలోకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకురావాలని, వీటి ద్వారా సుమారు ఏడున్నర లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు అనేక ప్రోత్సాహకాలు, మినహాయింపులు, రాయితీలు కల్పించారు. భారీగా క్యాపిటల్ సబ్సిడీలు ఉంటాయని పాలసీలో పేర్కొన్నారు.ఈ రంగంలోకి కొత్తగా వచ్చే అన్ని ప్రాజెక్టులకు కొన్నేళ్ల పాటు నికర ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, భూమి కొనుగోలుపై స్టాంపు డ్యూటీ మినహాయింపు, విద్యుత్ చార్జీల్లో రాయితీలు, విద్యుత్ సుంకాలు, నీటి వినియోగ చార్జీలు, భూమికన్వర్షన్ చార్జీల నుంచి మినహాయింపు కల్పించింది.

20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం..

నూతన పారిశ్రామిక విధానం ఖరారు

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 2024-29) రూపొందించింది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా రూపొందించిన ఈ నూతన పారిశ్రామికాభివృద్ధి పాలసీని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు పెద్దఎత్తున రాయితీలు ప్రకటించింది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ పరిశ్రమలకు మూలధన రాయితీ కింద 20 నుంచి 40 శాతం వరకు ఇస్తున్నాయి. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలకు మాత్రమే మూలధన రాయితీలు ఇస్తున్నారు. ఇకపై రాష్ట్రంలో కొత్తగా నెలకొల్పే భారీ, మెగా పరిశ్రమలకు కూడా దీనిని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలకు 10 శాతం అదనపు ప్రోత్సాహకాలు, ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలకు అదనంగా మరో 5% ప్రోత్సాహకాలను ప్రకటించింది. నాలుగు విభాగాలుగా పరిశ్రమలకు పోటీ ప్రోత్సాహకాలను అందించనుంది.రూ.50-500 కోట్ల పెట్టుబడితో ఐదేళ్లలో ఉత్పత్తిని ప్రారంభించే సబ్‌లార్జ్ పరిశ్రమలకు, రూ.501-1000కోట్ల పెట్టుబడితో ఏడేళ్లలో ఉత్పత్తిని ప్రారంభించే భారీ పరిశ్రమలకు 12% మూలధన రాయితీ ప్రకటించింది. రూ. 1,001-5000 కోట్ల పెట్టుబడితో పదేళ్లలో ఉత్పత్తిని ప్రారంభించే మెగా పరిశ్రమలకు, రూ. 5001 కోట్లకు పైగా పెట్టుబడితో పదేళ్లలో ఉత్పత్తిని ప్రారంభించే అల్ట్రా మెగా పరిశ్రమలకు 15% రాయితీ ప్రకటించింది.

ఒక కుటుంబం.. ఒక వ్యాపారవేత్త....

భారీపరిశ్రమలతోపాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమలకూ ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఐదేళ్లలో తయారీ రంగంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, 5 లక్షల ఉద్యోగాలు సృష్టించడం లక్ష్యాలుగా ఎంఎస్ఎంఈ అండ్ ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0ను ఆమోదించింది. రాజధాని అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు అంశాన్ని పాలసీలో పొందుపర్చింది. 2030 నాటికి 'ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త' నినాదంతో తయారీ, సేవల రంగంలో 22 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లను నెలకొల్పాలని నిర్ణయించింది.

సొంతానికి ఇసుక ఉచితం

» వాగులు, వంకల్లో తవ్వి తరలించుకోవచ్చు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత అవసరాలకు వాగులు, వంకల్లోని ఇసుకను ఉచితంగా తవ్వుకొని తీసుకువెళ్లడానికి అనుమతించాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. సీఎం మాట్లాడుతూ, 'ఇసుకను ఉచితంగా ఇస్తామని వాగ్దానం చేశాం. రాష్ట్రంలో అనేకచోట్ల వాగులు, వంకలు ఉన్నాయి. వాటిలో ఎక్కడైనా, ఎవరైనా తమ సొంత అవసరాల కోసం ఉచితంగా ఇసుకను తవ్వుకొని తీసుకువెళ్లవచ్చు. ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లతో రవాణా చేసుకోవచ్చు. వాటిని ఎవరూ ఆపరు. దానికి ఏ అనుమతి అక్కర్లేదు. ఎవరికీ పైసా చెల్లించాల్సిన అవసరం లేదు. పెద్ద నదుల విషయంలో మాత్రం నిబంధనలు పాటిస్తాం. లారీలకు టన్నుల పరిమితి లేదు. వాటి సామర్థ్యాన్ని బట్టి అనుమతి ఇస్తాం. ఇకపై ఇసుక తక్కువ ధరకు లభించాలి. పది రోజుల్లో ఈ తేడా కనిపించాలి. ఎవరైనా ఇసుకను బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్మితే ఊరుకొనేది లేదు. ఆన్‌లైన్ బుకింగ్ విధానం కొనసాగుతుంది' అని పేర్కొన్నారు. వాగులు, వంకల నుంచి ప్రజలు ట్రాక్టర్లలో ఇసుక తీసుకువెళ్తుంటే పోలీసులు ఆపి, జరిమానా విధిస్తున్నారని మంత్రి డీబీవీ స్వామి ఫిర్యాదు చేశారు. నదుల్లో ఇసుక లోడింగ్‌కు కొంతమంది బాగా తక్కువ ధరకు టెండర్లు వేశారన్న ఫిర్యాదులపై కూడా చర్చించారు. ఇలాంటి వారివద్ద డిపాజిట్ భారీగా తీసుకోవాలని, చేయలేకపోతే ఆ డిపాజిట్‌ను జప్తు చేయాలని సీఎం సూచించారు. ఏ ఊళ్లో ఇసుకను ఆ ఊరివాళ్లే తీసుకోవాలన్న నిబంధన లేదన్నారు.ఏమైనా సమస్యలుంటే మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకోవాలన్నారు.

రాష్ట్రంలో రోడ్ల మరమ్మతు పనులు నవంబరు 1 నుంచి ప్రారంభించాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. దీని కోసం మరో రూ.300కోట్లు అదనంగా కేటాయిస్తూ సీఎం నిర్ణయం తీసుకొన్నారు. పల్లె పండుగ తరహాలోనే రోడ్ల మరమ్మతు పనుల ప్రారంభాన్ని కూడా రాష్ట్రమంతా ఒక వేడుకలా నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి గృహాలకు సౌర విద్యుత్ పరికరాలను ఉచితంగా బిగించాలని నిర్ణయించారు. గ్రామాల్లో ఇళ్లకు ఈ పరికరాలు బిగించుకొనేలా ప్రోత్సహించి మిగులు కరెంటును వీధి లైట్లకు వాడుకొనే అవకాశం కల్పించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. దీనికి సీఎం అంగీకరించారు. కాగా, పేదల జీవితాల్లో వెలుగు నింపేలా ఉద్యోగ, ఉపాధి కల్పన అవకాశాలను విస్తరించడానికి అనువైన పాలసీలను ఖరారు చేయడంపై చంద్రబాబు కృషిని అభినందిస్తూ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ పాలసీల ఆమోదానికి 40, 50 గంటలు కూర్చోవాల్సి వచ్చిందని సీఎం చెప్పారు.

'మార్కెట్ సెస్ వసూలు'పై దర్యాప్తు

కేబినెట్ సమావేశంలో ఓ విషయం వెలుగులోకి వచ్చింది. 'గ్రామీణ రోడ్ల మరమ్మతుల కోసం గత వైసీపీ హయాం లో మార్కెట్ సెస్ వసూలు చేశారు. ఆ డబ్బును వేర్‌హౌసిం గ్ కార్పొరేషన్‌కు బదిలీ చేసి దాని ద్వారా రుణం తీసుకోవాలని భావించారు. రోడ్ల రిపేర్లకు టెండర్లు పిలిచి పనులు ఇచ్చారు. కానీ బిల్లుల చెల్లింపునకు ఖాతా తెరవలేదు. ఖాతా లేకుండా ఈ పనులకు పైసా ఇవ్వడం సాధ్యం కాదు. వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇచ్చిన నిధులు తీసుకోవడానికి కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ డబ్బులు వెనక్కు తీసుకోవడం వీలు కాదు' అని సంబంధిత అధికారి ఒకరు వివరించారు. దీనిపై కేబినెట్ దర్యాప్తునకు ఆదేశించింది.



ఇక అమరావతిలో పనుల పరుగు!

» రూ.524 కోట్ల పనులకు 2-3 రోజుల్లో టెండర్లు: మంత్రి నారాయణ

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణ పనులు ఇక పరుగులు పెట్టనున్నాయి. వివిధ దశల్లో ఉన్న పనులకు డిసెంబరులోపు టెండర్లు పిలిచి, రెండేళ్లలో పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించారు. బుధవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ అథారిటీ 38వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మీడియాకు తెలిపారు. 'అమరావతి నిర్మాణానికి సంబంధించిన ఏడు అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపింది. అమరావతి నిర్మాణాలను షెడ్యూల్ ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించాం. అమరావతి బ్లూప్లాన్ కోసం డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్ నియామకానికి అథారిటీ ఆమోదం తెలిపింది. 2019కు ముందు అమరావతిలో 3,600 అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టాం. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌లకు 18 టవర్లు నిర్మించాలని నిర్ణయించగా.. ఈ పనులన్నీ వివిధ దశల్లో నిలిచిపోయాయి. రూ.524 కోట్లతో ఈ పనులు చేపట్టేందుకు అథారిటీకి అనుమతులిచ్చాం. ఈ పనులకు రెండు మూడు రోజుల్లో టెండర్లు పిలుస్తాం. రూ.160 కోట్లతో 2,42,481 చదరపు అడుగుల్లో సీఆర్‌డీఏ కార్యాలయం నిర్మాణానికి అథారిటీ ఆమోదం తెలిపింది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీఆర్‌డీఏ కార్యాలయం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, మున్సిపల్ శాఖలో ఉన్న కార్యాలయాలన్నీ ఈ భవనంలో కొలువుతీరతాయి. ఈ రెండు పనులు నాలుగైదు రోజుల్లో ప్రారంభమవుతాయి. డిసెంబరు కల్లా ప్రపంచబ్యాంకు నుంచి రూ.15వేల కోట్లు విడుదలవుతాయి. గతంలో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 360 కిలోమీటర్ల మేర రోడ్లు వేసింది. డిసెంబరు 31లోపు 360 ట్రంక్ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలుస్తాం. ఎంత వాన వచ్చినా కొండవీటి వాగు, పాలవాగులతో వరదలు రాకుండా ప్రణాళికలు రూపొందించాం. రాజధానిలో ఎన్ని తుపానులు వచ్చినా నష్టం లేకుండా నిర్మాణాలు ఉంటాయి. రాజధాని టెండర్లన్నీ డిసెంబరు నెలాఖరులోపు పూర్తవుతాయి. అసెంబ్లీ, హైకోర్టు భవనాల పనులకు జనవరి నెలాఖరులోపు టెండర్లు పిలుస్తాం. ఈ పనులన్నీ రెండేళ్లలోపు పూర్తవుతాయి' అని మంత్రి నారాయణ చెప్పారు. ఐకానిక్ భవనాలు, ఐదు టవర్లకు కూడా డిసెంబరులోపు టెండర్లు పిలుస్తామని, వాటికి రెండున్నరేళ్ల సమయం పడుతుందని తెలిపారు. రైతుల యాన్యుటీ మొదటి ఫేజ్‌లో రూ..250 కోట్లు చెల్లించామన్నారు. ఈ విషయంలో ఎవరినీ ఇబ్బంది పెట్టబోమన్నారు. యాన్యుటీ రాని రైతులు ఆందోళన పడొద్దన్నారు. గతంలో భూమి ఇచ్చిన వారికి లాటరీ వేసి ప్లాట్లు ఇవ్వాల్సి ఉందని, వారికి పది రోజుల్లో ప్లాట్లు ఇస్తామని చెప్పారు. గతంలో రూపొందించిన డిజైన్లే ఉంటాయని చెప్పారు. గతంలో ఉన్న కాంట్రాక్టులను క్లోజ్ చేసి మళ్లీ టెండర్లు పిలిచే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ పూర్తయ్యిందని, నాలుగు ప్రాంతాల్లో నీళ్లు ఉండటం వల్ల ఆయా ప్రాంతాల్లో పనులు పూర్తి కాలేదని మంత్రి నారాయణ చెప్పారు.

గంజాయిని ఉక్కుపాదంతో అణిచేస్తాం: సీఎం

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయాలను ఉక్కుపాదంతో అణిచివేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై నేరాలకు పాల్పడే వారిని సంఘ బహిష్కరణ చేసేలా చర్యలు తీసుకుంటామని, గంజాయిని అమ్మినా, కొనుగోలు చేసినా, రవాణా చేసినా అదే వారికి చివరి రోజు అని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయడంతో పాటు 26 జిల్లాల్లో నార్కోటిక్స్ పోలీస్ బృందాలు ఏర్పాటుకు చేసే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇందులో భాగంగా హైకోర్టు ఆధ్వర్యంలో జిల్లాల్లో 5 ప్రత్యేక కోర్టులు లేదా 5 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యాన్ని సాధించడానికి లోకేశ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ధరల పర్యవేక్షణ, నియంత్రణ, మార్కెట్‌లో జోక్యంపై ఏర్పాటయ్యే క్యాబినెట్ సబ్ కమిటీకి మంత్రి నాదెండ్ల మనోహర్ చైర్మన్‌గా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, బాధితులకు పునరావాసం తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు, గంజాయి నియంత్రణకు హోంమంత్రి అనిత అధ్యక్షురాలిగా కేబినెట్ సబ్ కమిటీని వేశామన్నారు. చెత్త మీద పన్ను వేసిన గత వైసీపీ ప్రభుత్వం... 85 లక్షల టన్నుల చెత్తను తొలగించకుండా అలాగే వదిలేసి పోయారని చంద్రబాబు మండిపడ్డారు. కాగా, స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని చంద్రబాబు వెల్లడించారు.

పనుల బిల్లులు ఎప్పటికప్పుడే!

- ప్రతి గురువారం పేమెంట్స్ డే.. నేడు రూ.109 కోట్ల చెల్లింపులు
- గ్రామాల్లో సిమెంట్ల రోడ్ల నిర్మాణంలో కొత్త శకం
- గత బకాయిలు ఇప్పటికే చెల్లించేసిన గ్రామీణాభివృద్ధి శాఖ
- పల్లెల్లో జోరందుకున్న సిమెంట్ రోడ్ల పనులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అప్పుడు..

2019 ఎన్నికల ముందు చంద్రబాబు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.2వేల కోట్ల సిమెంట్ రోడ్లు నిర్మించింది. అయితే ఎన్నికలు రావడంతో కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేకపోయారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. టీడీపీ కార్యకర్తలు, సర్పంచ్‌లు చేపట్టిన పనులంటూ వాటికి బిల్లులు నిలిపేశారు. పైగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లపై విజిలెన్స్ విచారణ చేపట్టి వేధించారు. ఏసీబీ అధికారులను పురమాయించి ఇంజనీర్లను కూడా వేధించారు. చివరకు హైకోర్టు జోక్యం చేసుకుని ఉపాధి బిల్లులు చెల్లించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను సైతం వైసీపీ సర్కార్ ధిక్కరించింది. పట్టువదలని సర్పంచ్‌లు పదే పదే కోర్టు ధిక్కార కేసులు నమోదు చేయడంతో విధిలేని పరిస్థితుల్లో అప్పటి సీఎస్ బిల్లులు చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మూడేళ్లు పట్టింది. కోర్టు ఆదేశాలిచ్చినా పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించలేదు. విజిలెన్స్ విచారణ పూర్తయ్యాక ఇస్తామంటూ 21 శాతం బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ఆ బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదు. దీంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.

ఇప్పుడు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలో చేపట్టిన ఉపాధి మెటీరియల్ పనులకు సంబంధించిన బకాయిలు పూర్తిగా చెల్లించింది. సిమెంట్‌రోడ్ల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టింది. చేసిన పనులకు ప్రతి గురువారం పేమెంట్స్ డేగా ప్రకటించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 14 నుంచి సిమెంట్ రోడ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. రోడ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తూ.. కాంట్రాక్టర్లకు బిల్లులు వస్తాయన్న నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకున్నారు. కాగా, ఉపాధి హామీ పథకంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు ఆ పథకంలో మెటీరియల్ నిధులతో చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే గ్రామాలకు 30వేల సిమెంట్ రోడ్లు మంజూరు చేశారు. ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా పల్లెపండుగ పేరుతో పనులకు భూమి పూజ కూడా చేశారు. ఉపాధి పథకం నిధులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద సుమారు రూ.1000 కోట్లు దాకా ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి శాఖ వద్ద మరో రూ.500 కోట్లు ఉండటంతో నిధులకు ఢోకా లేదని అంటున్నారు. ఏప్రిల్‌లోపు మళ్లీ కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశం ఉంది.

బెయిల్ కోసం హైకోర్టుకు నందిగం సురేశ్

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మరియమ్మ అనే మహిళ హత్య కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీకి చెందిన మాజీ ఎంపీ నందిగం సురేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల సురేశ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గుంటూరు ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సురేశ్ హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడికి చెందిన మరియమ్మ 2020 డిసెంబరు 27న హత్యకు గురయ్యారు. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సురేశ్‌ను 78వ నిందితుడిగా చేర్చారు. ఇటీవల ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు కొట్టివేయడంతో హైకోర్టును ఆశ్రయించారు.

వైనాట్ సజ్జల!?

ఎల్‌వోసీ జారీలో జాప్యం.. జారీ చేశాక అత్యంత గోప్యం



- వైసీపీ నేత చెప్పే వరకు తెలియని లుక్ అవుట్ నోటీసుల వ్యవహారం
- పోలీసుల తీరుపై ప్రభుత్వ వర్గాల్లో చర్చ

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏదైనా కేసులో నిందితుడు పరారీలో ఉన్నప్పుడు గుర్తించడానికి వీలుగా దర్యాప్తు సంస్థలు లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్‌వోసీ)ను జారీ చేస్తాయి. ముఖ్యంగా విదేశాలకు పారిపోకుండా ఎల్‌వోసీ ఉపయోగపడుతుంది. డీజీపీ కార్యాలయం పక్కనే ఉన్న టీడీపీ కేంద్ర కార్యాలయంపై పట్టపగలు విధ్వంసం సృష్టించిన కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి ఎల్‌వోసీ జారీ చేయడంలో గుంటూరు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. గత ప్రభుత్వంలో షాడో సీఎంగా, సకల శాఖల మంత్రిగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లోనే ఏ పని అయినా జరిగేది. టీడీపీ ఆఫీసుపై దాడి కూడా ఇలానే జరిగిందన్న ఆరోపణలున్నాయి. దీంతో నెల క్రితమే తాడేపల్లి పోలీసులు సజ్జలను 120వ నిందితుడిగా చేర్చారు. అయినా ఎలాంటి విచారణ నోటీసు ఇవ్వకుండా జాప్యం చేశారు. పోనీ, విదేశాలకు పారిపోయే అవకాశం లేకుండా ఎల్‌వోసీ ఇచ్చారా? అంటే అది కూడా ఈ నెల 10న ఇచ్చినట్లు తెలుస్తోంది. స్వయానా డీజీపీ ద్వారకా తిరుమలరావును ఈవిషయమై అడిగితే అసలు తన దృష్టికి ఆవిషయం రాలేదని, గుంటూరు ఎస్పీ ఏదో ఇచ్చారని అనుకుంటున్నానని చెప్పారు. డీజీపీ మాటలు చర్చనీయాంశమయ్యాయి.

సజ్జల చెప్పే వరకు!

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడు సజ్జల రామకృష్ణారెడ్డి.. లుక్‌అవుట్ నోటీసు విషయాన్ని స్వయంగా వెల్లడించే వరకు ఎవరికీ తెలియదు. మరి ఎల్‌వోసీని ఇంత గుట్టుగా దాచడం ఎందుకనేది ప్రశ్న. గతంలో మార్గదర్శి ఎం డీ శైలజా కిరణ్‌కు పోలీసులు ఎల్‌వోసీ జారీ చేశారు. ఆ విషయాన్ని వెబ్ సైట్‌లో పెట్టి అందరూ వీక్షించేలా అందుబాటులో ఉంచారు. మరి సజ్జల విషయంలో ఆయన చెప్పేవరకు ఎల్‌వోసీ విషయాన్ని పోలీసులు ఎందుకు గోప్యంగా ఉంచారన్నది కీలక ప్రశ్న.

సజ్జలకు పోలీసుల పిలుపు

- నేడు విచారణకు రావాలని ఆదేశం
- బరితెగింపా? పొగరా?: సజ్జల

మంగళగిరి సిటీ/అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేసు దర్యాప్తు అధికారి వై. శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. 2021, అక్టోబరు 19న వైసీపీ మూకలు మంగళగిరి బైపాస్ రోడ్డులోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. ఈ కేసులో మొదటి నిందితుడిగా ఉన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ప్రధాన అనుచరుడు పానుగంటి చైతన్య కోర్టులో లొంగిపోయారు. మాజీ ఎంపీ నందిగం సురేశ్‌తో సహా 28 మందిని అరెస్టు చేశారు. మిగతా వారు కోర్టును ఆశ్రయించి రక్షణ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అయితే, ఇంటీరియం ప్రొటెక్షన్ ఉత్తర్వులు విచారణకు అవరోధం కాదని పోలీసులు చెబుతున్నారు. దీనిలో భాగంగానే సజ్జలవిదేశాలకు వెళ్లకుండా ఇప్పటికే లుక్ అవుట్ నోటీసులు ఇచ్చారు. తాజాగా గురువారం విచారణకు రావాలని నోటీసులిచ్చారు. కాగా, తనకు నోటీసులు జారీ చేయడాన్ని సజ్జల సహించలేకపోయారు. పోలీసులపై చిందులుతొక్కారు. "చేతిలో అధికారం ఉందని నోటీసులు ఇస్తారా? దీన్ని బరితెగింపు అనాలా? పొగరు అనాలా? ఇంకేమైనా అనాలా? అసలు రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తోందా?" అని సజ్జల మండిపడ్డారు.

చైతన్య కస్టడీకి పోలీసుల పిటిషన్: టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో పాల్గొన్న పానుగంటి చైతన్యను విచారించేందుకు 10 రోజులు కస్టడీకి ఇవ్వాల్సిందిగా మంగళగిరి రూరల్ పోలీసులు బుధవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

పోలీసుల అదుపులో బోరుగడ్డ అనిల్

- గుంటూరు ఇంట్లోనే అదుపులోకి
- జగన్ హయాంలో లెక్కలేనన్ని అరాచకాలు
- జగన్ ఆదేశిస్తే అరగంటలో చంద్రబాబును లేపేస్తానంటూ తీవ్రస్థాయిలో హెచ్చరికలు

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించి, హేయమైన భాషలో సోషల్ మీడియాలో చెలరేగిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. మాజీ సీఎం జగన్‌కు బంధువునని చెప్పుకొంటూ ఆయనపై ఎవరు విమర్శలు చేసినా వెంటనే సోషల్ మీడియాలో అనిల్ చెలరేగిపోయారు. అయితే, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో అనిల్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కొంతకాలం హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే, మొదట్లో అనిల్‌ను పట్టుకున్నందుకు పోలీసులు ప్రయత్నించినా ఓ ఉన్నతాధికారి కారణంగా సైలెంట్ అయిపోయారు. ఇంతలో టీడీపీ ఆఫీసుపై దాడి కేసు, చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో పోలీసులు వ్యవహరిస్తున్న తీరును పసిగట్టిన అనిల్.. ఇక, తాను సేఫ్ అనుకున్నారు. ఈ క్రమంలో గుంటూరులోని అమరావతి రోడ్డులో ఉన్న తన ఇంటికి ఇటీవల వచ్చేశారు. దీంతో పట్టాభిపురం పోలీసులు బుధవారం ఆయనను ఇంట్లోనే అదుపులోకి తీసుకున్నారు. పోలింగ్ తర్వాత కౌంటింగ్‌కు ముందు అనిల్ సోషల్ మీడియాలో చేసిన దూషణలు, బెదిరింపులపై జూన్ 1న నమోదైన కేసులో అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

ఎన్నెన్ని అరాచకాలో: అనిల్ చేసిన అరాచకాలకు లెక్కే లేదు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ మొదలు నాటి వైసీపీ అసమ్మతి నేతలైన రఘురామకృష్ణరాజు, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వంటి నేతలను హెచ్చరికలతో హడలెత్తించారు. అప్పటి ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత దూషణలు, వారి కుటుంబంలోని మహిళల పట్ల అసభ్యకరమైన వ్యాఖ్యలతో సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించారు. జగన్ కనుసైగ చేస్తే అరగంటలో చంద్రబాబును లేపేస్తానని తీవ్ర వ్యాఖ్యలతో రెచ్చిపోయారు. అప్పట్లో ఆయన వాహనం నుంచి పోలీసులు మారణాయుధాలు సైతం స్వాధీనం చేసుకున్నారు. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా బోరుగడ్డ అనిల్‌పై సుమారు 15 వరకు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అరండల్ పేట పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ తెరిచారు.



రాజకీయ కారణాలతోనే 'పిల్'

- అన్న క్యాంటీన్ భవనాల రంగుల వ్యాజ్యం విచారణలో హైకోర్టు వ్యాఖ్య
- కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి ఆదేశం



అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లకు టీడీపీ జెండా రంగులు వేస్తున్నారని పేర్కొంటూ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం(పిల్) రాజకీయ కారణాలతో వేసినట్లు ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు అనంతరం పిల్ దాఖలు వెనుక ఉన్న రాజకీయ కారణాలను పరిశీలిస్తామని పేర్కొంటూ.. విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లకు టీడీపీ జెండా రంగులు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ ఏపీ ఎన్జీవో సంఘం పూర్వ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అన్న క్యాంటీన్లకు అధికార టీడీపీ జెండాలో ఉన్న రంగులు వేస్తున్నారని, ప్రభుత్వ భవనాలకు రాజకీయ పార్టీల రంగులు వేయడానికి వీల్లేదని తెలిపారు. దీనికి సంబంధించి హైకోర్టు గతంలోనే ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ విషయంలో గత ప్రభుత్వంలో అధికారులు కోర్టుధిక్కరణ కేసులు కూడా ఎదుర్కొన్నారని వివరించారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ప్రస్తుత ఫొటోలను పరిశీలిస్తే అన్న క్యాంటీన్ భవనంపై ఉన్న ట్యాంక్‌కు నీలం రంగు ఉంది కదా అని ప్రశ్నించింది. క్యాంటీన్‌కు పసుపు, ఎరుపు రంగులు కూడా ఉన్నాయని గుర్తు చేసింది. ఏ రంగు ఏ పార్టీకి చెందిందో ఎలా గుర్తించగలమని ప్రశ్నించింది. గత ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లకు ఏ రంగులు ఉన్నాయని ప్రశ్నించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బదులిస్తూ.. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసివేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే వాటిని తిరిగి తెరిచారని తెలిపారు. 2019కి పూర్వం క్యాంటీన్లకు ఉన్న రంగులే ప్రస్తుతం ఉన్నాయన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రంగులు ఏమీ మార్చలేదు కదా? అభ్యంతరం ఏముందని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతో పిల్ వేసినట్లు ఉందని వ్యాఖ్యానించింది.

సీమపై జలఖడ్గం!

(మొదటి పేజీ తరువాయి)

లోతట్టు, చెరువులు, నదులుండే ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. నైరుతి బంగాళాఖాతంలో గల వాయుగుండం దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడుల దిశగా దూసుకొస్తోంది. గంటకు 15 నుంచి 20 కి.మీ. సగటు వేగంతో పశ్చిమ వాయవ్యంగా పయనిస్తున్న వాయుగుండం బుధవారం రాత్రికి చెన్నైకు 290 కి.మీ. తూర్పు ఆగ్నేయంగా, నెల్లూరుకు 270 కి.మీ. ఆగ్నేయంగా నైరుతి, దానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంది. ఇది తీవ్ర అల్పపీడనంగా బలహీనపడి గురువారం ఉదయం చెన్నైకు సమీపంలో తీరం దాటుతుంది. తరువాత దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు మీదుగా పయనించి శుక్రవారానికి బలహీనపడుతుంది. దీని అవశేషాలు ఈనెల 18న అరేబియా సముద్రంలో ప్రవేశించి అక్కడ అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. వాయుగుండం తీరందాటే సమయంలో గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వాయుగుండం ప్రభావంతోపాటు రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అనేకచోట్ల, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఏర్పేడులో 97.75 మి.మీ.లు, ఓబులవారిపల్లెలో 81.25, రెడ్డిపల్లెలో 80.50 మి.మీ. భారీ వర్షపాతం నమోదైంది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అనేక చోట్ల భారీవర్షాలకు ఇప్పటికే వరద తీవ్రత పెరిగింది. బుధవారం రాత్రి నుంచి వర్షాలు పెరిగే అవకాశం ఉండడంతో ప్రకాశం, నెల్లూరు, పల్నాడు, గుంటూరు, చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. వాయుగుండం తీరం దాటే సమయంలో బాపట్ల, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లోనూ వర్షాలు పెరుగుతాయి. గురువారం దక్షిణ కోస్తా, సీమల్లో అనేకచోట్ల, ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కృష్ణపట్నం, నిజాంపట్నం, ఓడరేవు, మచిలీపట్నంలలో మూడు, కాకినాడ, గంగవరం, విశాఖపట్నంలలో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు.

అతలాకుతలం

- నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కుండపోతగా వర్షం
- తిరుపతి జిల్లాలో 6500 ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- తిరుమల ఘాట్ రోడ్డులో జారిపడిన కొండరాళ్లు
- నేడు శ్రీవారిమెట్టు దారి మూసివేత



నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలో నేలవాలిన వరిపైరు

నెల్లూరు, తిరుపతి, అనంతపురం అర్బన్/పుట్టపర్తి, నంద్యాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు నెల్లూరు, తిరుపతి జిల్లాలు అతలాకుతలమవుతున్నాయి. మొదటి రెండు రోజులతో పోలిస్తే బుధవారం వర్షం తీవ్రత మరింత పెరిగింది. ఎడతెరిపి లేకుండా వర్షాలతో జనజీవనం స్తంభించింది. మంగళవారం మధ్యాహ్నానికే నెల్లూరు జిల్లాలో సరాసరి 81.9 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జలదంకి మండలంలో 185 మి.మీ, కావలిలో 174.4 మి.మీ, నెల్లూరు నగరంలో 135.6 మి.మీ, నెల్లూరు రూరల్‌లో 123.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది. భారీ వర్షాల మూలంగా వాగులు, వంకలు పొంగుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్లకు గండ్లు పడ్డాయి. సోమశిల జలాశయానికి భారీగా వరద వచ్చి వస్తోంది. మంగళవారం 10వేల క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం 21 వేల క్యూసెక్కులు దాటింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉండటంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే 500 మంది పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. విపత్తునైనా ఎదుర్కొనేందుకు తగినట్టుగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభుత్వం జిల్లాకు పంపింది. తిరుపతి జిల్లావ్యాప్తంగా బుధవారం కుండపోత వర్షాలు పడ్డాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, చిల్లకూరు తదితర పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో మూడు ప్రదేశాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ముందు జాగ్రత్త చర్యగా శ్రీవారి మెట్టు నడక దారిని గురువారం మూసివేస్తున్నట్టు టీటీడీ ప్రకటించింది. జిల్లావ్యాప్తంగా పలు చోట్ల 6500 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, కూరగాయ పంటలు నీట మునిగాయి. ఉదయం తిరుపతిలో దిగాల్సిన ఇండిగో విమానాన్ని చెన్నైకి దారి మళ్లించారు. హైదరాబాదు నుంచి వచ్చిన స్పైస్ జెట్, ఎయిర్ ఇండియా విమానాలు రేణిగుంట విమానాశ్రయం వద్ద గాల్లోనే చక్కర్లు కొట్టి గంట ఆలస్యంగా ల్యాండ్ అయ్యాయి. తిరుపతి నుంచి ఉదయం 6.20 గంటలకు చెన్నై బయల్దేరాల్సిన గరుడాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేశారు. వాతావరణం ఇలాగే ఉంటే గురువారం కూడా ఈ సర్వీసు రద్దయ్యే అవకాశముంది. జిల్లాలో 208 పునరావాస కేంద్రాల ఏర్పాటు చేసిన జిల్లా యంత్రాంగం 1183 మందిని తరలించారు. తిరుపతి నగరంలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీళ్లు చేరాయి. వర్షాలకు ఉమ్మడి అనంతపురంలో వాగులు, వంకలు, కుంటలకు జలకళవచ్చింది. కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జయమంగళి నదికి భారీగా నీరు చేరింది. ఆ నీరు పెన్నా నదిలోకి చేరుతోంది. జయమంగళి వరద నీటితో హిందూపురం-పరిగి మధ్య కాసేపు వాహనాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నంద్యాలలో పొంగిన వాగులు..

నంద్యాల జిల్లాలో వాగులు, వంకలు పొంగాయి. కొన్ని చోట్ల పంటలు వాలిపోయాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జిల్లా యంత్రాంగం సెలవులు ప్రకటించింది. చాగలమర్రి మండలంలో కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించి పోయాయి. శిరివెళ్ల నుంచి రుద్రవరంకు వెళ్లే ప్రధాన రహదారిలోని మాలమాగు వాగు పొంగడంతో వాహనాల రాకపోకలు నిలిచాయి.

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం: అనిత

వాయుగుండం తీరం దాటాక ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోంమంత్రి అనిత చెప్పారు. సహాయ చర్యల కోసం నెల్లూరు, తిరుపతి, కర్నూలు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో 5 ఎస్డీఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వాననీటిలోనే చెన్నై శివారు ప్రాంతాలు

- నేడు తీరం దాటనున్న వాయుగుండం

చెన్నై, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చెన్నైకి ముప్పు తప్పింది. వాయుగుండం నేపథ్యంలో చెన్నై సహా 9 జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించిన వాతావరణశాఖ బుధవారం ఉపసంహరించుకుంది. మంగళవారం అర్ధరాత్రి నుంచే చెన్నైలో చెదురుమదురు జల్లులు మినహా పెద్దగా వర్షమేమీ పడకపోవడంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మంగళవారం కురిసిన కుండపోత వర్షం కారణంగా చెన్నై శివారు ప్రాంతాలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. రెండు రోజుల వర్షానికి నగరంలో 539 ప్రాంతాల్లో వరద నీరు నిలువగా, ఇందులో 436 ప్రాంతాల్లో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్(జీసీసీ) సిబ్బంది నీటిని తొలగించారు. గురువారం చెన్నైతో పాటు తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్‌అలెర్ట్ ప్రకటించింది.

వర్షాల పరిస్థితి ఎప్పటికప్పుడు నివేదించాలి: సీఎం

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వాయుగుండం నేపథ్యంలో వర్షప్రభావిత జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సీఎంవో అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. భారీ వర్షాలపై అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. నెల్లూరు సహా, పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో అతి భారీ వర్షాల నేపథ్యంలో ఆర్టీజీఎస్ వర్షాల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ చేస్తోంది. ఇందుకోసం జిల్లాకో ప్రత్యేక కోఆర్డినేటర్‌ను నియమించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో 4,845 సర్వైలెన్స్ కెమెరాలతో వర్షాల పరిస్థితిపై ఆర్టీజీఎస్ సీఈవో దినేష్‌కుమార్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

కమిటీ నివేదిక రాగానే కౌంటర్ వేస్తాం

- ఏపీపీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకంపై ప్రభుత్వం

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్, సభ్యుల నియామకం విషయంలో స్పెషల్ సీఎస్ నేతృత్వంలో కమిటీ వేశామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. స్పెషల్ సీఎస్‌తోపాటు 10మంది సభ్యులతో కూడిన కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉందని, అది అందిన వెంటనే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ ధర్మాసనానికి తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

ఎక్కడి వారు అక్కడికి వెళ్లాల్సిందే!

- తెలంగాణ అయితే ఏంటి? ఏపీ అయితే ఏంటి?
- ముందు రిపోర్ట్ చేయండి.. తర్వాత విచారిస్తాం
- ఏడుగురు ఐఏఎస్‌లకు టీ హైకోర్టు స్పష్టం

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్యాడర్ వివాదంలో ఉన్న ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. ఈ నెల 16న ఎవరికి కేటాయించిన రాష్ట్రాల్లో వారు రిపోర్ట్ చేయాలంటూ కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరుతూ ఏడుగురు ఐఏఎస్ అధికారులు టీ హైకోర్టులో బుధవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను అత్యవసరంగా విచారించేందుకు జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం అంగీకరించింది. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత పిటిషన్లను విచారణకు స్వీకరించింది. విచారణ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఐఏఎస్‌లు అయినంత మాత్రాన స్టే ఇవ్వాలా? అని ప్రశ్నించింది. వాణీప్రసాద్, వాకాటి కరుణ, ఆమ్రపాలి కాట, రొనాల్డ్ రోస్ (తెలంగాణ), జి.సృజన, లోతేటి శివశంకర్, సి.హరికిరణ్ (ఏపీ) ఎవరి రాష్ట్రాల్లో వారు రిపోర్ట్ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ) ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి టీ హైకోర్టు నిరాకరించింది. క్యాట్‌లో నవంబరు 4న విచారణ ఉన్న నేపథ్యంలో అప్పటివరకైనా రిలీవ్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు విద్యాసాగర్, వి.మల్లిక్, కేఆర్‌కేవీ ప్రసాద్, లక్ష్మీనర్సింహ తదితరులు వాదనలు వినిపించారు. పిటిషనర్ల వాదనలను వ్యక్తిగతంగా విని స్పీకింగ్ ఆర్డర్ ఇవ్వాలని ఇదే ధర్మాసనం డీవోపీటీకి ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేశారు. పిటిషనర్లకు ఆ అవకాశం ఇవ్వకుండా, ఏకసభ్య కమిటీ రిపోర్ట్ అందజేయకుండా, ఏకపక్షంగా డీవోపీటీ ఈ నెల 16న వారివారి రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇవ్వడం చెల్లదని పేర్కొన్నారు. సోమేశ్‌కుమార్ తీర్పునకు పిటిషనర్ల కేసులకు సంబంధం లేదన్నారు. ఆయా అధికారుల సేవలు తామే వినియోగించుకుంటామని.. వారిని రిలీవ్ చేయడానికి 15 రోజుల సమయం కావాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ఇచ్చిన లేఖలను ధర్మాసనానికి సమర్పించారు. డీవోపీటీ ఉత్తర్వులపై క్యాట్ స్టే ఇవ్వకుండా నవంబరు 4కు వాయిదా వేసిందని.. అప్పటివరకైనా రిలీవ్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో క్యాట్ ఉత్తర్వులపై స్టే ఇచ్చి హైకోర్టే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. అధికారుల 10 ఏళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. ఏకసభ్య కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌ను మూడు నెలలు పెండింగ్‌లో ఉంచి ప్రస్తుతం ఆకస్మికంగా డీవోపీటీ నిర్ణయం తీసుకోవడంలో అర్థం లేదని తెలిపారు.

ఉద్యోగులను కేటాయించేది కోర్టు కాదు..

డీవోపీటీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహశర్మ వాదనలు వినిపిస్తూ.. ఉద్యోగులను కేటాయించే పని కోర్టుది కాదని, కేంద్రం నిర్ణయమే అంతిమమని పేర్కొంటున్న సోమేశ్‌కుమార్ తీర్పు దీనికి ఆధారంగా ఉందని గుర్తుచేశారు. ముందు పిటిషనర్లు ఎక్కడివారు అక్కడ రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన లేఖలపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుందన్నారు. క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనని.. క్యాట్ లో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. "ముందు ఎక్కడివారు అక్కడికి వెళ్లి రిపోర్ట్ చేయండి. ఆ తర్వాత పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం. మీరు పెద్ద అధికారులని అడిగినప్పుడల్లా స్టే ఇవ్వలేం. ఏపీ అయితే ఏంటి? తెలంగాణ అయితే ఏంటి? ఎక్కడైనా పని చేయవచ్చు" అని తెలిపింది. పిటిషనర్లు మధ్యంతర ఉత్తర్వుల కోసం పట్టుబట్టడంతో వాదనలను రికార్డు చేసిన ధర్మాసనం.. పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. కేంద్రం కేటాయింపుల్లో జోక్యం చేసుకోలేమని, అనవసర జోక్యం వల్ల పరిపాలనకు ఇబ్బందులు వస్తాయని తీర్పులో పేర్కొంది.

రాష్ట్రం నుంచి ముగ్గురు ఐఏఎస్‌లు రిలీవ్

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి ముగ్గురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం సి.హరికిరణ్(2010), జి.సృజన(2013), శివశంకర్ లోతేటి(2013) ఐఏఎస్‌లను డీవోపీటీ ఆదేశాల మేరకు రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రస్తుతం హరికిరణ్ ఆరోగ్యశాఖ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఏర్పాట్లు చేసుకోవాలని ఆరోగ్యశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా ఎం.సృజన, వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌గా శివశంకర్ లోతేటి విధులు నిర్వహిస్తున్నారు. ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లను ఇన్‌చార్జ్ కలెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎం.సృజన, శివశంకర్ హైదరాబాద్‌లోనే ఉన్నారు. కాబట్టి ఏపీ రిలీవింగ్ ఉత్తర్వులు ఇవ్వగానే తెలంగాణలో రిపోర్ట్ చేశారు. సి.హరికిరణ్ మాత్రం గురువారం ఉదయం తెలంగాణ సీఎస్‌కు రిపోర్ట్ చేయనున్నారు. తెలంగాణలో రిలీవ్ అయిన ఐదు మందిలో ఎం.ప్రశాంతి ఏపీలో రిపోర్ట్ చేశారు. వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్ మెయిల్ ద్వారా ఏపీ సీఎస్‌కు తమ జాయినింగ్ రిపోర్టులు పంపించారు. గురువారం ఉదయం వ్యక్తిగతం ఏపీ సీఎస్ వద్ద రిపోర్ట్ చేయనున్నట్లు సమాచారం. కాగా, ఏపీ అధికారుల విషయంలో సీఎం చంద్రబాబు ఉత్తర్వుల మేరకు సీఎంఓ, డీవోపీటీకి లేఖ రాసింది. ముగ్గురు ఐఏఎస్‌లను రిలీవ్ చేసే విషయమై నెల రోజుల గడువు కావాలని, ఈలోగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని కోరింది. ఆ లేఖపై డీవోపీటీ నుంచి స్పందన లేకపోవడంతోనే బుధవారం ముగ్గురు ఐఏఎస్‌లను రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.